www.andhrajyothy.com
పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 110

సోమవారం | 4-8-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.11.42 తదుపరి ఏకాదశి, నక్షత్రం: అనూరాధ ఉ.9.13 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: మ.3.18-5.03, దుర్ముహూర్తం: మ.12.46-1.37, మ.3.19-4.10, అమృతఘడియలు: రా.1.46-3.31, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.43

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


నేతన్నలు నేసిన తువాళ్లు, దుప్పట్లు

మగ్గాలపై మ్యాజిక్..!

చేనేతపురి ఉత్పత్తులకు దేశవిదేశాల్లో మంచి ఆదరణ
ఆకట్టుకునే డిజైన్లలో బర్డ్స్ ఐ తువాళ్లు, జిందగీ దుప్పట్లు
ఆకర్షించేలా చేతి రుమాళ్లు, లుంగీలు, ధోవతులు, చీరలు
మరమగ్గాల పోటీని తట్టుకుంటూ సహజ రంగుల్లో వస్త్రాలు
మగ్గాలపై కష్టించే నేతన్నల శ్రమకు గుర్తింపు దక్కే చాన్స్
ఎమ్మిగనూరు నేతన్నల నైపుణ్యానికి భౌగోళిక గుర్తింపు
తీసుకొచ్చే దిశగా చకచకా అడుగులు
11
జీఐ ట్యాగ్ వస్తే అంతర్జాతీయంగా మరింత పేరు

మరమగ్గాలపై నేసే వస్త్రాలు కావివి..! పోగుపోగు వడికి.. సహజమైన రంగులద్ది.. విభిన్న డిజైన్లతో చేనేత కార్మికుల చేతుల నుంచి జాలువారిన అద్భుత కళా ఖండాలివి..! కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నేతన్నల ప్రత్యేక శైలికి ప్రత్యక్ష నిదర్శనాలివి..! చెక్క మగ్గాలపై తయారవుతున్న బర్డ్స్ ఐ తువాళ్లు, జిందగీ దుప్పట్లు, చేతి రుమాళ్లకు దేశవిదేశాల్లో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు వీటికి భౌగోళిక గుర్తింపు సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి.


స్వచ్ఛ రథం

గ్రామాల్లో.. 'స్వచ్ఛరథం'

వ్యర్థాల సేకరణకు వినూత్న విధానం
ప్లాస్టిక్ వస్తువులు, అట్టపెట్టెలు వంటివి తీసుకుని నిత్యావసర సరుకుల పంపిణీ
గుంటూరు.. లాలుపురంలో పైలట్ ప్రాజెక్టు
అంచలంచెలుగా అన్ని గ్రామాలకూ విస్తరణ
ప్రాజెక్టుకు ఎండీయూ వాహనాల వినియోగం
ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా అడుగులు
11


వ్యర్థాలకు ప్రతిగా ఇచ్చేందుకు స్వచ్ఛరథంలో వెనక భాగంలో సిద్ధం చేసిన నిత్యావసర సరుకులు


గుంటూరు జిల్లా రూరల్ మండలంలోని లాలుపురం గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన స్వచ్ఛ రథంలో వ్యర్థాలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన క్యాబిన్

ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మద్యం పాలసీ కారణంగా కర్ణాటకలోని కోలార్ జిల్లాలో అమ్మకాలు తగ్గాయి. రెండు రాష్ట్రాల మధ్య మద్యం ధరల్లో వ్యత్యాసం ఉంది. మద్యం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరగాలని, అలాగే వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉండాలని ఏపీ లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల మద్యం అక్రమ అమ్మకాలు కూడా తగ్గాయి.

- కర్ణాటక ఎక్సైజ్ శాఖ కమిషనర్ వెంకటేశ్ వ్యాఖ్యలివి. కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త మద్యం పాలసీ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మద్యం ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.



బోర్డర్ మందు బంద్

ఏపీలో కొత్త మద్యం పాలసీ అమలుతో తెలంగాణ, కర్ణాటక ఆదాయం ధమాల్

కర్ణాటకలో ఏటా 10 శాతం ఉన్న వృద్ధి రేటు 0.47 శాతానికి పడిపోయిందన్న అధికారులు
తెలంగాణలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి
ఖమ్మంలో నెలకు రూ.10 కోట్ల ఆదాయం హుష్
నల్గొండలో 30 శాతానికి పడిపోయిన విక్రయం
నాణ్యమైన మద్యంతో ఏపీలో అమ్మకం పైపైకి
రాష్ట్రంలో లిక్కర్ 24%, బీరు 129% పెరుగుదల
విలువ పరంగా చూస్తే 58 శాతం మేరకు పెంపు
ఒక్క త్రైమాసికంలోనే 849 కోట్ల అదనపు ఆదాయం
గతంలో ఇదంతా పక్క రాష్ట్రాలకు చేరిన వైనం

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

ఏపీలో అమలు చేస్తున్న నూతన మద్యం విధానం రాష్ట్ర ఖజానాకు కాసులు కురిపిస్తుండగా, పొరుగు రాష్ట్రాల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం విక్రయించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు మద్యం ఆదాయం భారీగా తగ్గిపోయింది. ఉదాహరణకు తెలంగాణతో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేటలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. జగన్ హయాంలో ఈ జిల్లాలో నెలకు 4 వేల కేసుల మద్యం అమ్మితే, ఇప్పుడు అది 12వేల కేసులకు చేరింది. అదేంటి జగన్ ప్రభుత్వంలో మద్యం

మిగతా 12వ పేజీలో...

లాటరీతోనే బార్లకు లైసెన్స్‌లు!

మద్యం దుకాణాల తరహాలోనే!.. ఫీజుల వసూలుకు రెండు ప్రతిపాదనలపై కసరత్తు
మొదటి దానివల్ల రాబడి తగ్గే చాన్సు.. దాని భర్తీకి బార్ల సంఖ్య వెయ్యికి పైగా పెంపు?
ఫీజులు భారీగా పెంచాలని రెండో ప్రతిపాదన.. నగర పంచాయతీల్లో బార్లకు 55 లక్షలు
మున్సిపాలిటీల్లో 65 లక్షలు.. కార్పొరేషన్లలోని బార్లకు రూ.75 లక్షలు
ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం.. 15లోగా కొత్త విధానంపై నోటిఫికేషన్
11

తాగుడు కూతలు

లిక్కర్ స్కామ్ నిందితులకు రోతపత్రిక వత్తాసు


ప్రత్యేక విమానంలో హీరోయిన్ తమన్నాతో కలిసి ప్రయాణిస్తున్న వెంకటేశ్ నాయుడు. సోషల్ మీడియాలో ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్న ఫొటోలలో ఇదొకటి.

వాస్తవాలు దాచి వక్రీకరణ
సిట్‌పైనే బురదజల్లే యత్నం
వెంకటేశ్ నాయుడు రియల్టరట
ఆ డబ్బు వ్యాపార లావాదేవీలదని అడ్డగోలుగా సమర్థన
5 కోట్లను 35 కోట్లుగా 'సొంత లెక్క'
ఒంగోలు ఎంపీ స్థానానికి వెంకటేశ్ వేసిన నామినేషన్‌లో ఏడాది సంపాదన 4.95 లక్షలే
మరి కోట్లలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో?
ఇంకా ఖరీదైన కార్లు, చార్టర్డ్ ఫ్లైట్లలో షికార్లు
2000 నోట్ల చలామణిపైనా అబద్ధాలు
సిట్ దర్యాప్తుకు వక్రభాష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ఎన్నో సంచలన ఆధారాలు బయటపడ్డాయి. ముడుపులు దాచిన డెన్‌లు, నోట్ల కట్టలు లెక్కిస్తున్న వీడియోలతో పాటు ఫామ్‌హౌస్‌లో దాచిన 11 కోట్ల నగదు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో వెలుగు చూశాయి. అయితే.. లిక్కర్ స్కామ్ నిందితులు చాలా నిజాయితీపరులంటూ జగన్ రోతపత్రిక అడ్డగోలుగా సమర్థిస్తోంది. జగన్ పార్టీ నేతలను కాపాడేందుకు సిట్‌పైనే బురదజల్లుతోంది. కళ్లముందు కనిపించే నిజాలను కక్షసాధింపు చర్యలుగా చూపించడానికి నానా తిప్పలు పడుతోంది. సిట్, గిట్టని మీడియాపై విషం చిమ్ముతోంది. లిక్కర్ స్కామ్‌ను రాజకీయకుట్రగా చూపడానికి జనాల కళ్లకూ గంతలు కట్టేందుకు అసత్యాలు అచ్చేస్తోంది. తాజాగా సిట్ వెలికితీసిన ఐదు కోట్ల ముడుపుల సొమ్ము 'వీడియోలో ఉన్నది మా వాడే కానీ, ఆ సొమ్ము మద్యం సొమ్ము కాదు' అని జగన్ పత్రిక పెద్ద కథనం వండింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు రియల్టర్ అని, ఆ వీడియోలో ఉన్న రూ.35 కోట్లు (జగన్ పత్రిక లెక్క) అతడి వ్యాపార లావాదేవీలవని

మిగతా 12వ పేజీలో...

వార్షికాదాయం 5 లక్షలు
వ్యాపారం 35 కోట్లతోనట

- వెంకటేశ్ నాయుడు... వైసీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మద్యం స్కామ్‌లో ఏ 34 నిందితుడు. మద్యం ముడుపుల నోట్ల కట్టల గుట్టల (రూ.5 కోట్లు)ను అతడు లెక్కపెడుతున్న వీడియో సిట్ విచారణలో వెలుగు చూసిన సంగతి తెలిసిందే. అయితే.. వెంకటేశ్ రియల్టర్ అని, తన వ్యాపార లావాదేవీల్లో భాగమైన నగదు (జగన్ పత్రిక లెక్కల ప్రకారం 35 కోట్లు)ను మద్యం కేసుకు సిట్ ముడిపెడుతోందంటూ రోత పత్రిక పెద్ద కథనం వండివార్చింది.
- వెంకటేశ్ 2024 ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా పోటీ చేయడానికి నామినేషన్ వేశాడు. అఫిడవిట్‌లో తన ఏడాది సంపాదన రూ.4.95 లక్షలుగా పేర్కొన్నాడు. తాజాగా బయటపడిన వీడియోలో ఉన్నది వెంకటేశ్ నాయుడేనని జగన్ పత్రిక అంగీకరిస్తూనే.. ఆ డబ్బు అతడి వ్యాపారాలకు సంబంధించిందని సమర్థించే ప్రయత్నం చేసింది. అయితే... ఏడాదికి రూ.4.95 లక్షలు సంపాదన ఉన్న అతడికి రూ.5 కోట్ల డబ్బు (రోత పత్రిక లెక్కల ప్రకారం 35 కోట్లు) ఎలా వచ్చింది? ఏడాదిలో అంత మొత్తం ఎలా సంపాదించాడు? ఇది సాధ్యమయ్యే పనేనా?
- వెంకటేశ్ చాలా ఖరీదైన కార్లతో తిరిగేవాడు. చార్టర్డ్ ఫ్లైట్లలో షికార్లు చేసేవాడు. బాలీవుడ్, టాలీవుడ్ హీరోయిన్లతో ప్రత్యేక విమానాల్లో చక్కర్లు కొడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఏడాది సంపాదన రూ.4.95 లక్షలే ఉన్న అతడు అంత విలాసవంతంగా ఎలా గడిపాడు? డబ్బు ఎలా వచ్చింది?
- 2023 మే నుంచి 2000 నోటు చలామణిలో లేదని జగన్ పత్రిక రాసింది. అలాంటప్పుడు ఎన్నికల్లో ఎలా పంచుతారంటూ కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించింది. వాస్తవానికి.. రూ.6017 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు తిరిగి రాలేదని ఆర్‌బీఐ ప్రకటించిందని శనివారం అదే పత్రిక వార్త ప్రచురించింది. తమ ఇష్యూ కార్యాలయాల వద్ద లేదా పోస్టులో పంపి కూడా ఆ నోట్లను మార్చుకోవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. అంటే.. రెండు వేల రూపాయల నోట్లు చెల్లుబాటులో ఉన్నట్టే.


8

నేటి నుంచి షూటింగ్స్ బంద్

ఫిల్మ్ ఛాంబర్‌తో చర్చలు విఫలమవడంతో ఫెడరేషన్ నిర్ణయం
వేతనాలు పెంచని సినిమాల షూటింగ్‌కు వెళ్లకూడదని తీర్మానం

అసహజ మరణాల రికార్డులు ధ్వంసం


ధర్మస్థళ కేసులో పోస్టుమార్టం నివేదికలు.. ఫొటోలూ మాయం
ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెలుగులోకి
గుర్తుతెలియని బాలిక మృతదేహం ఖననంపై సిట్‌కు ఫిర్యాదు చేసిన కార్యకర్త
నిబంధనలన్నీ తుంగలో తొక్కారని ఆరోపణ
2

సీఎంపై అసభ్య వ్యాఖ్యల కేసులో..

కొడాలి నానికి నోటీసులు
11

చేజారిన ఎంటెక్ చాన్స్!

అడ్మిషన్లకు ముగిసిన ఆప్షన్ల ప్రక్రియ.. బీటెక్ సర్టిఫికెట్లు ఇవ్వని యూనివర్సిటీలు



రాష్ట్రవ్యాప్తంగా 600 మంది విద్యార్థులకు నష్టం
ప్రైవేటు కాలేజీల్లోనూ సర్టిఫికెట్ల నిలిపివేత
మొత్తంగా అడ్మిషన్లు కోల్పోయిన వేలాది విద్యార్థులు
ఫీజుల విషయంలో అమలుకాని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు.. పట్టించుకోని అధికారులు

సర్టిఫికెట్ల మంజూరులో యూనివర్సిటీలు, ప్రైవేటు కాలేజీల ఇష్టారాజ్యం! వాటిని నియంత్రించాల్సిన ఉన్నత విద్యాశాఖ అధికారుల మౌనం!! ఫలితంగా వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. బీటెక్ పూర్తి చేసుకున్న వారంతా.. ఈ ఏడాది ఎంటెక్‌లో చేరే అవకాశాన్ని కోల్పోయారు. ఫీజుల విషయంలో విద్యార్థులను ఒత్తిడి చేయొద్దన్న ప్రభుత్వ ఆదేశాలను కాలేజీలు పట్టించుకోలేదు. సర్టిఫికెట్లు ఆపేసిన విషయం అధికారుల దృష్టికి వెళ్లినా.. తమకు సంబంధం లేదన్నట్టుగా చోద్యం చూశారు.

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ గాడి తప్పుతోంది. ఆ శాఖలో ఎవరి దారి వారిదే అన్నట్టుగా మారింది. ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఉన్నత విద్యాశాఖ చెబుతుంటే... మీ ఆదేశాలతో తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రైవేటు కాలేజీలతో పాటు ఆఖరుకు ప్రభుత్వ పరిధిలోని యూనివర్సిటీలు కూడా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల కోసం సర్టిఫికెట్లు ఆపొద్దని స్వయంగా ఆ శాఖ మంత్రి లోకేశ్ పలుమార్లు ఆదేశించినా వర్సిటీల అధికారులు ఖాతరు చేయడం లేదు. వర్సిటీలు ఇష్టారాజ్యంగా

మిగతా 11వ పేజీలో...

వన్‌సైడ్ చేసేద్దాం!

ఆరోగ్య శాఖ శానిటేషన్ టెండర్లలో ఇష్టారాజ్యం

డాక్యుమెంట్ నిబంధనలకు పాతర
సొంత రూల్స్ అమలు చేస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు
అర్హత లేని కంపెనీలకు అందలం
వాటిపై ఫిర్యాదులున్నా లెక్కచేయరు
రూ.50 కోట్ల టర్నోవర్ కూడా లేని కంపెనీపై అవ్యాజ ప్రేమ
మూడేళ్ల జీఎస్టీ చూపించకున్నా ఓకే
2 సార్లు బ్లాక్ లిస్ట్ అయిన సంస్థకు అండ
3



కంపెనీలతో ముందస్తు ఒప్పందాలు
వాటికే టెండర్లు దక్కేలా స్కెచ్
నేడు టెక్నికల్ బిడ్, ఖరారు కమిటీ భేటీలు



ఏఐతో దర్శనంపై మాటల తూటాలు

దీనితో 3 గంటల్లో శ్రీవారి దర్శనం అసంభవం
ఆ ప్రయత్నం కూడా ఏ మాత్రం క్షేమకరం కాదు
టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు
ఏఐపై అవగాహన లేకుండా మాట్లాడటమా?
ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృథా అనడం
ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం: చైర్మన్
3


ప్రమాదం జరిగిన బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీ
12

ఆరుగురిని మింగేసిన గ్రానైట్ క్వారీ

బండరాయి పడి వలస కూలీల దుర్మరణం.. బాపట్ల జిల్లాలో ఘోరం
మరో 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
మృతులు, క్షతగాత్రులు అంతా ఒడిశావాసులే
సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం
క్వారీల్లో భద్రతా ప్రమాణాలపై అనుమానాలు



స్విచ్ఛాఫ్.. నెట్‌వర్క్ బిజీ..!

'హలో'.. హలో' అంటుండగానే కట్ అవుతున్న కాల్స్
సెల్ సిగ్నల్స్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు
మాట్లాడుతూ ఉండగానే కాల్ డ్రాప్.. జంప్
మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టని కంపెనీలు
సెల్ ఆపరేటర్లకు జరిమానాలు విధించే అవకాశం
అయినా పట్టించుకోని టెలికాం నియంత్రణ సంస్థ



12

బీమా లేని వాహనాలపై కొరడా!


భారీ జరిమానా విధించాలని కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఆగస్టు 3: రహదారులపై వేగ పరిమితుల్లో మార్పులతోపాటు ఇన్సూరెన్స్ లేని వాహనాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మోటారు వాహనాల చట్టంలో కొత్త సవరణలను ప్రతిపాదించింది. బీమా లేని వాహనాలను రోడ్డుమీద తిప్పితే.. భారీగా జరిమానా విధించాలని ఈ ప్రతిపా దనల్లో పేర్కొంది. ప్రస్తుతం బీమా లేకుండా వాహనాలు నడిపితే.. తొలిసారి ఈ నేరానికి పాల్పడిన వారికి రూ.2వేలు, మళ్లీ మళ్లీ ఇదే నేరానికి పాల్పడితే రూ.4వేలు జరిమానా విధిస్తున్నారు. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం మొదటిసారి ఇన్సూరెన్స్ లేకుండా పట్టుబడితే ప్రాథమిక బీమా ప్రీమియంకు మూడు రెట్లు, తదుపరి ఉల్లంఘనలకు ఐదు రెట్లు జరిమానా విధించాలని నిర్ణయించారు. ఇది అమలులోకి వస్తే బీమా లేని కార్లకు భారీ జరిమానా పడే అవకాశం ఉంది. భారత్‌లో బీమా లేని కార్లు, వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కేంద్రం ఈ తరహా చర్యలకు ఉపక్రమించనుంది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ పునరు ద్ధరణలో కూడా కొన్ని కఠిన నిబంధనలు విధించాలని ప్రతిపాదించింది. అతివేగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించాలని సూచించింది. అంతేకాకుండా డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో 55 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారికి మళ్లీ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించాలని పేర్కొంది. అలాగే.. ప్రస్తుతం కేంద్రం నిర్ణయించిన వేగ పరిమితులు, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తున్న వేగ పరిమితులకు మధ్య తేడా ఉంటోంది. దీనివల్ల డ్రైవర్లు గందరగోళానికి గురవుతూ.. తమకు తెలియకుండానే వేగ పరిమితులను ఉల్లంఘిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేగ పరిమితుల్లో సవరణ చేయాలని కేంద్రం నిర్ణయించింది.

రాష్ట్రపతిని వేర్వేరుగా కలిసిన మోదీ, అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగస్టు 3: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆదివారం ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వేర్వేరుగా సమావేశమయ్యారు. వీరిద్దరూ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ముర్ముతో భేటీ అయినట్లు రాష్ట్రపతి భవన్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మినహా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. వాయిదాల పర్వం కొనసాగుతోంది. మరోవైపు, మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన కొనసాగింపుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రధాని, హోం మంత్రి కొన్ని గంటల వ్యవధిలో రాష్ట్రపతితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

లోకం తీరు



వంద ఫిర్యాదులొచ్చినా దర్యాప్తు చేస్తాం

» ప్రజ్వల్ వివాదంలో 'సిట్' చీఫ్ బిజయ్ కుమార్ వెల్లడి

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడికి సంబంధించి వంద ఫిర్యాదులు వచ్చినా దర్యాప్తు చేస్తామని 'సిట్' చీఫ్ ఏడీజీపీ బిజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు చేసిన బాధితురాలు ఏడాదిగా న్యాయం కోసం గట్టిగా నిలబడ్డారన్నారు. కీలకమైన కేసులో శిక్ష పడడం పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. బాధితులు ఎంతమంది ఉన్నా.. ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. హాసన్ జిల్లాలో లైంగిక దాడులకు సంబంధించి ఐదు కేసుల్లో సిట్ విచారణ చేసిందని, ఇందులో కేఆర్ నగర్ తాలూకా బాధితురాలికి సంబంధించిన అత్యాచారం కేసులోనే కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. మరో రెండు కేసులు విచారణ దశలో ఉన్నాయన్నారు. కాగా.. పెన్‌డ్రైవ్ పంపిణీకి సంబంధించి దర్యాప్తు దాదాపు పూర్తయిందని, రెండు వారాల్లో చార్జిషీట్ సమర్పిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రేవణ్ణను పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. జైలులో అతడికి ప్రత్యేక దుస్తులతోపాటు ఖైదీ నంబరు 15528 కేటాయించారు.

నువ్వు 'ఫూల్'.. నువ్వే 'రాస్కెల్'..!

» తమిళనాడులో డీఎంకే ఎంపీ, ఎమ్మెల్యే మధ్య తిట్ల దండకం

చెన్నై, ఆగస్టు 3: తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకేకు చెందిన ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్యే పోటీపడి మరీ బహిరంగ వేదికపై తిట్టేసుకున్నారు. నువ్వు ఒక 'ఫూల్', కాదు నువ్వే 'రాస్కెల్'.. అంటూ ఒకరిపై ఒకరు మాటల వాగ్వాదానికి దిగారు. వీరిద్దరి మధ్య తిట్ల దండకానికి థేని జిల్లాలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమం వేదికైంది. సీఎం స్టాలిన్ శనివారం 'నలం కాకుమ్ స్టాలిన్' అనే ఆరోగ్య పథకాన్ని చెన్నై నుంచి ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్, ఎమ్మెల్యే మహారాజన్ మధ్య మాటల యుద్ధం జరిగింది. స్టేజీపై ఎమ్మెల్యే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తుండగా, తాను కూడా ఆ పంపిణీలో పాల్గొనేందుకు ఎంపీ ప్రయత్నించారు. మహారాజన్ చిరాకు పడ్డాడు. సర్టిఫికెట్‌ను లాక్కొని.. ఎంపీని పట్టించుకోలేదు. దీంతో చిర్రెత్తిపోయిన ఎంపీ తమిళ్‌సెల్వన్.. ఎమ్మెల్యే మహారాజన్‌ను 'ఫూల్' అంటూ తిట్టాడు. దీనికి తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే ఆయన్ను 'రాస్కెల్' అంటూ వాగ్వాదానికి దిగారు.

అమెరికాలో అదృశ్యమైన వృద్ధుల మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 3: అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వృద్ధులు అదృశ్యమైన ఘటన విషాదంగా ముగిసింది. అమెరికాలో బఫెలో నగరం నుంచి వెస్ట్ వర్జీనియాలోని ఓ ఆధ్యాత్మిక ప్రదేశానికి ఇటీవల కారులో బయలుదేరిన వీరు కనిపించకుండా పోయారు. వీరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మార్షల్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ వృద్ధులు ప్రయాణించిన కారు ఓ ఎత్తైన రోడ్డులో అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. మృతి చెందిన వారిని ఆశ దివాన్(85), కిషోర్ దివాన్(89), శైలేష్ దివాన్(86), గీత దివాన్(84)గా గుర్తించారు. జూలై 31 నుంచి వీరి నుంచి ఎటువంటి సమాచారం లేకుండా పోయిందని మార్షల్ కౌంటీ షెరిఫ్ డార్కీ తెలిపారు.

నా సమాధిని తవ్వుకుంటున్నా

» హమాస్ బంకర్‌లో ఇజ్రాయెల్ పౌరుడి ఆవేదన



టెల్‌అవీవ్, ఆగస్టు 3: "నా సమాధిని నేనే తవ్వుకుంటున్నాను. రోజురోజుకూ బలహీనపడుతున్నాను. నా వాళ్లను తిరిగి కలిసే పరిస్థితులు కనిపించడం లేదు" అంటూ తమ చెరలో ఉన్న 24 ఏళ్ల వయసున్న ఇజ్రాయెలీ యువకుడు ఎవ్యటార్ డేవిడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియోను హమాస్ విడుదల చేసింది. హమాస్ బంకర్‌లో ఉన్న డేవిడ్ శరీరం బాగా బలహీనంగా మారినట్లు ఆ వీడియో స్పష్టం చేస్తోంది. గడిచిన 48 గంటల్లో బందీలకు సంబంధించి ఇది రెండో వీడియో. ఇంతకు ముందు రోమ్ బ్రస్లవ్‌స్కీ అనే 21 ఏళ్ల జర్మన్-ఇజ్రాయెలీ వీడియో విడుదలైంది. అతను కూడా చాలా బలహీనంగా కనిపించాడు. ఈ వీడియోల్లో "కాల్పుల విరమణతోనే బందీల విడుదల" అంటూ హమాస్ సందేశాన్ని పంపింది.

'నీట్' రద్దు చేయాలి: కమల్ హాసన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)లను రద్దు చేయాలని అగ్రనటుడు, రాజ్యసభ సభ్యుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు. హీరో సూర్య సారథ్యంలోని అగరం ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం చెన్నైలో జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభలో కమల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, అగరం ఫౌండేషన్‌లో విద్యాభ్యాసం చేసిన అనేక మంది విద్యార్థులు డాక్టర్లుగా, వివిధ హోదాల్లో కొనసాగుతున్నారని, అయితే 2017 నుంచి దీన్ని కొనసాగించడం కష్టసాధ్యంగా మారిందన్నారు. దీనికి కారణం నీట్ పరీక్ష ప్రధాన కారణమన్నారు. 2017 నుంచి ఈ రోజు వరకు అలాంటి విద్యావకాశాలు లేకుండా చేసింది నీట్ చట్టమన్నారు. ఆ చట్టం ఇపుడు ఎలాంటి ఆయుధం లేకుండా దేశాన్ని ధ్వంసం చేస్తోందని ఆరోపించారు.

కేరళలో 'రెండు రూపాయల డాక్టర్' కన్నుమూత


గోపాల్ (ఫైల్)

తిరువనంతపురం, ఆగస్టు 3: రెండు రూపాయల డాక్టర్ అని కేరళ ప్రజలు ఆప్యాయంగా పిలుచుకొనే డాక్టర్ ఏకే రైరు గోపాల్(80) ఆదివారం కన్నుమూశారు. వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ఈ రోజుల్లో కన్నూర్‌కు చెందిన ఆయన నిరుపేదలు, అనాథల నుంచి కేవలం రూ.2 నామమాత్రపు రుసుము తీసుకుని 50ఏళ్లకు పైగా నిస్వార్థంగా వైద్య సేవలు అందించారు. తెల్లవారుజామున 3.30గంటల నుంచే రోగులను చూడటం ప్రారంభించేవారు. అయన ఇంటి ముందు నిత్యం వందలాది మంది పేషెంట్లు క్యూలో నిలబడేవారు. రోజుకు 300మందిని పైగా పరీక్షించేరు.

హెచ్ఎంను బదిలీ చేయించాలని ట్యాంకులో విషం

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రధానోపాధ్యాయుని బదిలీ చేయించాలని కుట్రపన్ని విద్యార్థులు తాగే తాగునీటి ట్యాంకులో విషం కలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. సవదత్తి తాలూకా హూళికట్టి ప్రభుత్వ పాఠశాలలో 13 ఏళ్లుగా హెచ్ఎంగా కొనసాగుతున్న సులేమాన్‌ను బదిలీ చేయించాలని సాగర్ పాటిల్, నాగనగౌడ పాటిల్, కృష్ణ మాదర కుట్ర పన్నారు. హెచ్ఎంకు చెడ్డపేరు వస్తే ఉన్నతాధికారులు బదిలీ చేస్తారని వీరు భావించారు జూలై 14న ట్యాంకులో విషం కలిపారు. ఆ నీటిని తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు.

ఉత్తరప్రదేశ్‌లో వరదలు!

ఎడతెరిపిలేని వానలతో 17 జిల్లాలను ముంచెత్తిన వరదలు

- ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న పలు నదులు
- నీట మునిగిన వందలాది గ్రామాలు
- ప్రయాగ్‌రాజ్‌లో 15 వేల ఇళ్లలోకి నీరు
- కొనసాగుతున్న సహాయక చర్యలు..


ప్రయాగ్‌రాజ్‌లో పసిపాపను పైకి ఎత్తి పట్టుకొని వరదనీటిని దాటుతున్న ఓ తండ్రి


వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను పడవల సాయంతో తరలిస్తున్న దృశ్యం

లఖ్‌నవూ, ఆగస్టు 3: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. వందలాది గ్రామాలు, కొన్ని నగరాలు పూర్తిగా నీట మునిగాయి. జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాన్పూర్‌నగర్, లఖింపూర్ ఖేరీ, ఆగ్రా, ఔరారియా, చిత్రకూట్, బల్లియా, బండా, ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారాణసీ, చందౌలీ సహా 17 జిల్లాలను వరదలు ప్రభావితం చేశాయి. గంగా, యమునా, రామగంగా, గోమతి సహా పలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్, వారాణసీ నగరాలు పూర్తిగా నీట మునిగాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 15 వేల ఇళ్లలోకి వరద నీరు చేరింది. పలు ప్రాంతాల్లో పీకల్లోతు వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు అక్కడి జనం పడుతున్న ఇబ్బందుల తాలుకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'వరదలతో 37 తహసీళ్లలోని 402 గ్రామాలకు చెందిన 84,392 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 47 వేలకు పైగా మందికి తక్షణ సాయం అందించాం. క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. 493 పడవలు, బోట్ల ద్వారా ఆహా రం ప్యాకెట్లు, అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం' అని విపత్తు నిర్వహణ కమిషనర్ భానుచంద్ర గోస్వామి ఓ ప్రకటలో తెలిపారు. మంత్రి స్వతంత్రదేవ్ సింగ్ హమీర్‌పూర్‌లోని వర ద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక రాబోయే 24 గంట ల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో సర్కారుపై ప్రతిపక్ష నేత, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. 'ప్రయాగ్‌రాజ్‌లో 20 వేల కోట్లను ఖర్చు చేసినా అక్కడికి ప్రజలకు వరద ముంపు కష్టాలు తప్పలేదు. బీజేపీ నేతల అవినీతిని అక్కడి నీటి గుం తలే స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ భావనపై నీళ్లు చల్లిన కాషాయ పార్టీ నేతలు తమ పడవలతో ఎక్కడికో అదృశ్యమయ్యారు?' అంటూ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.

యూపీలో కాలువలోకి కారు.. 11 మంది మృతి

గోండా (యూపీ), ఆగస్టు 3: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. పృథ్వీనాథ్ ఆలయ దర్శనం కోసం భక్తులతో బయలుదేరిన ఓ బొలేరో వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మందితో సహా పదకొండు మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. పృథ్వీనాథ్ ఆలయానికి 15 మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. మార్గం మధ్యలో కారు అదుపుతప్పి సరయు కాలువలో పడిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, రెస్క్యూ బృందాలతో కలిసి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ఆ గ్రంథాలయంలో మనుష్యులే పుస్తకాలు

» ఐఐటీ పాలక్కడ్ క్యాంపస్‌లో ప్రయోగం

పాలక్కడ్, ఆగస్ట్ 3: అనుభవజ్ఞుడైన వ్యక్తితో కొద్ది సమయం గడిపినా బోలెడన్ని పుస్తకాలు చదివినంత జ్ఞానం లభిస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఇదే తరహాలో భిన్నంగా ఆలోచించిన కేరళలోని ఐఐటీ పాలక్కడ్ ప్రొఫెసర్లు తమ క్యాంపస్‌లో పుస్తకాలు లేని హ్యూమన్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ మనుష్యులే పుస్తకాల్లా వ్యవహరిస్తారు. తమ అనుభవాలను సందర్శకులకు వివరిస్తారు. దీనికి సంబంధించి డెన్మార్క్‌కు చెందిన ఓ సంస్థతో ఐఐటీ పాలక్కడ్ ఒప్పందం కురుర్చుకుంది. చాలా ఏళ్ల క్రితమే డెన్మార్క్‌లో హ్యూమన్ లైబ్రరీ ఉద్యమం కొనసాగడంతో అక్కడి సంస్థతో అవగాహన కుదుర్చుకున్నారు. వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో హ్యూమన్ లైబ్రరీని పాలక్కడ క్యాంపస్‌లో చేపడతారు. ఈ హ్యూమన్ లైబ్రరీలో తమ జీవిత అనుభవాలను వివరించే అవకాశం 12 మందికి మాత్రమే దక్కుతుంది. వీరికి ఎలాంటి వేతనాలు చెల్లించరు. ఐఐటీ పాలక్కడ్ నిపుణుల బృందం వీరిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంది. ముఖ్యంగా సమాజంలో వివక్షకు గురైన వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. సందర్శకులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఆకట్టుకునేలా చెప్పేలా వారిని తీర్చిదిద్దుతారు. ఈ హ్యూమన్ లైబ్రరీలో తమకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే సమాజంలో విభిన్న వర్గాల నుంచి మెయిల్స్ వస్తున్నాయని ఐఐటీ పాలక్కడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ తెలిపారు. ఓ దివ్యాంగుడు, ఓ ట్రాన్స్‌జెండర్ డాక్టర్ సహా మొత్తం ఏడుగురు తమను ఇప్పటికే సంప్రదించారని ఆయన చెప్పారు. వీరి అనుభవాలను నేరుగా వినడం ద్వారా సమాజంలో క్రమంగా మార్పునకు అవకాశం ఉంటుందన్నారు.



అదనపు లగేజీ విషయంలో గొడవ..

స్పైస్‌జెట్ సిబ్బందిపై సైనికాధికారి దాడి

శ్రీనగర్, ఆగస్టు 3: స్పైస్‌జెట్ సిబ్బందిపై ఓ సైనికాధికారి దాడి చేసిన ఘటన శ్రీనగర్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. అదనపు లగేజీ విషయమై జరిగిన వివాదం కాస్తా ముదరడంతో ఆర్మీ అధికారి విమానయాన సిబ్బంది నలుగురిపై దాడి చేశారు. జులై 26న జరిగిన ఈ ఘటనలో ఓ ఉద్యోగికి వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు స్పైస్‌జెట్ సంస్థ ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించింది. శ్రీనగర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్పైస్‌జెట్ విమానంలో ప్రయాణించేందుకు ఆర్మీ అధికారి రితేశ్‌కుమార్ సింగ్ 16 కిలోల లగేజీతో వచ్చినట్లు తెలిపింది. అయితే, 7 కిలోల వరకే ఉచితమని, మిగిలిన లగేజీకి రుసుము చెల్లించాలని సిబ్బంది కోరారు. తిరస్కరించిన ఆయన.. బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేయకుండానే బలవంతంగా ఏరోబ్రిడ్జి వద్దకు వెళ్లారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆయన్ను వెనక్కి తీసుకొచ్చారు. అక్కడికి వచ్చిన ఆయన స్పైస్‌జెట్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడిగుద్దులు గుద్దడంతో పాటు, కింద పడిన ఓ ఉద్యోగిని బలంగా తన్నారు. దీంతో అతని వెన్నెముకలో ఎముక విరిగింది. అలాగే ఓ బోర్డు తీసుకొని బలంగా కొట్టారు. మరో ఉద్యోగి దవడకు తీవ్ర గాయమైంది. ఇంకొకరికి ముక్కులో నుంచి రక్తం వచ్చింది. తీవ్రగాయాలైన ఉద్యోగులు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంలో ఆర్మీ అధికారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

భార్యను 'రికార్డుల్లో' చంపేసిన భర్త!

తాను పోయాక వితంతు పింఛను అందకూడదనే

పట్నా, ఆగస్టు 3: తాను చనిపోతే భార్యకు వితంతు పింఛను రాకూడదన్న ఉద్దేశంతో ఓ వ్యక్తి ఆమెను రికార్డుల్లో చంపేశాడు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమయంలో ఈ విషయం బయటపడింది. ఓటర్ల జాబితా సవరణ కోసం అధికారులు పట్నా రూరల్ నియోజకవర్గం ధనరువా గ్రామంలోని శివరంజన్ కుమార్ ఇంటికి వెళ్లగా అక్కడ ఆయన భార్య నిషా కుమారి కనిపించింది. కానీ, 3 నెలల క్రితం చనిపోయినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. డెత్ సర్టిఫికెట్ కూడా జారీ అయింది. అధికారులు ఈ విషయమే ఆమెతో చెప్పారు. దీంతో, తన డెత్ సర్టిఫికెట్ కోసం ఎవరు దరఖాస్తు చేశారో వివరాలు వెల్లడించాలంటూ నిషా కుమారి బీడీఓకు అప్లికేషన్ సమర్పించారు. భర్త శివరంజన్ కుమారే అలా చేశాడని తేలింది. ఎందుకని ప్రశ్నిస్తే.. "నా భార్యకు నాకు పడట్లేదు. నేను చనిపోతే పెన్షన్ రావొద్దనే అలా చేశాను" అని శివరంజన్ సమాధానం ఇచ్చాడు.

అసహజ మరణాల రికార్డులు ధ్వంసం

ధర్మస్థళ కేసులో పోస్టుమార్టం నివేదికలు, ఫొటోలూ మాయం

- ఆర్టీఐ దరఖాస్తు ద్వారా షాకింగ్ విషయాలు వెలుగులోకి
- సిట్‌ను ఆశ్రయించిన సమాచార హక్కు కార్యకర్త జయంత్


జయంత్

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థళలో అనేకమంది మహిళలు, బాలికల మృతదేహాలను చట్టవిరుద్ధంగా ఖననం చేసిన కేసులో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. 2000 సంవత్సరం నుంచి 2015 సంవత్సరం వరకు నమోదైన అసహజ మరణాల రికార్డులు మాయమవడం తాజాగా కలకలం రేపుతోంది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కార్యకర్త జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఆ 15 సంవత్సరాల కాలంలో జరిగిన అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులు కావాలంటూ జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా కోరగా, 2000-2015 మధ్య యూడీఆర్(అసహజ మరణాల రిజిస్టర్)లో నమోదైన మరణాలకు సంబంధించిన అన్ని పత్రాలు, పోస్టుమార్టం నివేదికలు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, గుర్తుతెలియని మృతదేహాల గుర్తింపు కోసం తీసిన ఫొటోలను సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు ధ్వంసం చేశామని బెల్తంగాడి పోలీసులు సమాధానం ఇచ్చినట్టు జయంత్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆ సమాచారాన్నంతటినీ డిజిటలైజ్ చేయకుండా ఎలా ధ్వంసం చేస్తారని జయంత్ ప్రశ్నిస్తున్నారు. ధర్మస్థళలో పలు హత్యలు జరిగాయనీ, వాటికి సంబంధించి తాను గతంలోనే ఆరోపణలు చేశాననీ, పలు వేదికలపై ప్రస్తావించానని, అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. ఇక్కడ నెలకొన్న భయంకర పరిస్థితుల కారణంగా ఎవరూ వాస్తవాలు చెప్పడం లేదని, తానూ భయపడిన వ్యక్తినే అని తెలిపారు. హత్యలు జరిగినపుడు కొందరు మధ్యవర్తులు తెరపైకి వచ్చి రాజీలు కుదిర్చారన్నారు. హత్యలు ఎవరు చేశారనేది తెలియదని చెప్పారు. సోమవారం సిట్ ముందుకు వెళ్లి సమగ్ర సమాచారం ఇస్తానన్నారు. కాగా, గుర్తు తెలియని ఒక బాలిక మృతదేహాన్ని ఖననం చేయడంలో చట్టపరమైన నిబంధనలన్నింటికీ అధికారులు నీళ్లొదిలారని, అందుకు తానే ప్రత్యక్ష సాక్షినని జయంత్ పేర్కొన్నారు. ఆ ఘటనలో అధికారుల తీరు ఏదో ఒక కుక్క కళేబరాన్ని పాతిపెట్టేసినట్టు ఉందని విమర్శించారు. ఆ ఘటన ఇప్పటికీ తన కళ్లలో మెదులుతూనే ఉందని, అందుకే ఆదివారం సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)కు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఖననం సందర్భంగా అక్కడ ఉన్న అధికారులందరి పేర్లూ ఫిర్యాదులో పేర్కొన్నానన్నారు.

తేజస్వికి ఈసీ నోటీసు



- ఓటర్ల జాబితా నుంచి మీ పేరును తొలగించారంటూ మీరు చూపించిన ఓటరు కార్డు మేం జారీచేసింది కాదు
- అసలు కార్డును అప్పగించండి: ఈసీ

పట్నా/న్యూఢిల్లీ, ఆగస్టు 3: బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు ఎన్నికల కమిషన్ నోటీసు జారీచేసింది. ఆయన శనివారం చూపిన ఓటరు గుర్తింపు కార్డు అధికారికంగా జారీచేసింది కాదని.. దర్యాప్తు జరపడానికి వీలుగా దాని ఒరిజినల్ కార్డును తమకు అప్పగించాలని కోరింది. ఈ మేరకు పట్నా సదర్ సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్, దీఘా అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆయనకు ఆదివారం నోటీసు పంపారు. శనివారం బిహార్లో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించారంటూ తేజస్వి పాత ఓటరు కార్డును మీడియా సమక్షంలో చూపారు. అయితే జిల్లా మేజిస్ట్రేట్ ఎస్ఎం త్యాగరాజ వెంటనే దీనిని ఖండించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వి తన అఫిడవిట్‌లో పొందుపరచిన ఎపిక్ నంబరు అది కాదని.. ఆయన వద్ద రెండో ఓటరు కార్డు గనుక ఉంటే.. ఇది విచారణ జరపాల్సిన అంశమని తెలిపారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గ ఎన్నిల అధికారి స్పందించారు. 'ఓటరు జాబితాలో మీ పేరు 204వ పోలింగ్ బూత్‌లో సీరియల్ నంబరు 416గా నమోదై ఉంది. దాని ఎపిక్ నంబరు ఆర్ఏబీ0456228. కానీ మీడియా సమావేశంలో మీరు చూపించిన ఎపిక్ నంబరు ఆర్ఏబీ2916120. అసలీ నంబరు మేం అధికారికంగా జారీచేసింది కాదని మా ప్రాథమిక విచారణలో తేలింది' అని తెలిపారు. ఇదిలా ఉండగా, తమిళనాడులో 6.5 లక్షల మంది వలస కార్మికులను ఓటర్లుగా చేర్చారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆరోపించారు. ఇది ఆందోళనకర, చట్టవిరుద్ధమైన చర్య అని అభివర్ణించారు. కానీ, చిదంబరం ఆరోపణలను ఈసీ ఖండించింది. తమిళనాడులో ఇంకా ఎస్ఐఆర్ అమలు చేయలేదని, 6.5 లక్షల ఓట్లను చేర్చారనడం అబద్ధమని పేర్కొంది.

8న ఈసీ వద్దకు ఇండీ కూటమి ర్యాలీ

బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్ష ఇండీ కూటమి నేతలు ఈ నెల 7న రాత్రి సమావేశం కానున్నారని సమాచారం. ఈసీ వైఖరికి నిరసనగా ఈ నెల 8న ఆ సంస్థ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించాలని కూటమి పక్షాల నేతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా, ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపైన కూడా 7న చర్చ జరుగుతుందని పలువురు ఇండీ కూటమి నేతలు సంకేతాలిచ్చారు.

సౌదీలో ఒకే రోజు 8 మందికి ఉరిశిక్ష

రియాద్, ఆగస్టు 3: సౌదీ అరేబియా ఆదివారం ఒక్క రోజే నేరం రుజువైన ఎనిమిది మంది ఖైదీలకు ఉరిశిక్షను అమలు చేసింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో అరెస్టయిన సోమాలియాకు చెందిన నలుగురికి, ముగ్గురు ఇథియోపియన్లకు, తన తల్లిని చంపిన సౌదీకే చెందిన ఓ ఖైదీకి మరణశిక్ష విధించింది. ఈ ఎనిమిది మందితో కలిపి ఈ ఏడాది మొత్తం మీద 230 మందికి ఆ దేశం మరణశిక్షను విధించింది. వీరిలో 154 మంది మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తూ చిక్కిన వారే ఉన్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ పేర్కొంది. 2023 నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పట్ల సౌదీ కఠినంగా వ్యవహరిస్తోంది.

గవర్నర్లకు రాజ్యాంగమే ప్రామాణికం

» గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు


న్యూఢిల్లీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గవర్నర్లకు రాజ్యాంగమే ప్రామాణికమని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు అన్నారు. ఆదివారం ఢిల్లీ వార్ మెమోరియల్ వద్ద అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. అనంతరం, మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నట్టు తెలిపారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పుడు రాజకీయాల గురించి మాట్లాడకూడదని, నలుగురికి స్ఫూర్తిగా ఉండేలా వ్యవహరించాలని అన్నారు. రాజ్యాంగం ప్రామాణికంగానే గవర్నర్లు పనిచేయాలని సూచించారు. తనకున్న రాజకీయ అనుభవం.. గవర్నర్ పదవిని సమర్థవంతంగా నిర్వర్తించడంలో సహకరిస్తుందని తెలిపారు. గవర్నర్ పదవికి హుందాతనాన్ని తీసుకొచ్చేలా, మిగిలిన వారికి స్ఫూర్తిదాయకంగా ఉండేలా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వాలు, ప్రజలు, మీడియా సమన్వయంతో ముందుకెళితే, సమష్టిగా పనిచేస్తే దేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చని అశోక్‌గజపతిరాజు అభిప్రాయపడ్డారు.

వాతావరణ అనిశ్చితితో వానలు

» నేడు సీమలో భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఇంకా బంగాళాఖాతం నుంచి దక్షిణ తమిళనాడు మీదుగా తూర్పు అరేబియా సముద్రం వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. మరోవైపు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. వీటన్నింటి ప్రభావంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల పిడుగులు, ఉరుములతో వర్షాలు కురిశాయి. కాగా, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఒంగోలులో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయిని, ఈ నెల ఐదో తేదీ నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న మూడు రోజులు పల్నాడు జిల్లాతోపాటు రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మన్యం, అల్లూరి, ఏలూరు గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.

శ్రీశైలం గేట్లు మూసివేత
ఎగువ నుంచి తగ్గిన వరద ప్రవాహం


శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేయడంతో ఆగిన నీటి విడుదల

నంద్యాల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో జలాశయంలోని అన్ని గేట్లను ఆదివారం మూసేశారు. జూరాల, సుంకేసుల నుంచి 1,26,420 క్యూసెక్కుల వరద శ్రీశైలంలోకి వస్తోంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ద్వారా 66,297 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. 199.27 టీఎంసీల నీరుంది.

వన్‌సైడ్ చేసేద్దాం..!

ఆరోగ్య శాఖలో శానిటేషన్ టెండర్లలో ఇష్టారాజ్యం.. డాక్యుమెంట్‌లోని నిబంధనలకు పాతర

» సొంత రూల్స్ అమలు చేస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు
» అర్హత లేని కంపెనీలకు అందలం
» నేడు టెక్నికల్ బిడ్ కమిటీ భేటీ
» బిడ్ ఖరారు కమిటీ సమావేశం కూడా..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య శాఖలో శానిటేషన్ టెండర్లను వన్‌సైడ్ చేసేస్తున్నారు. దాదాపు రూ.850 కోట్ల విలువైన టెండర్లను అర్హత లేని కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. ఇందుకోసం టెండర్ డాక్యుమెంట్‌లో ఉన్న నిబంధనలకు అధికారులు పాతరేసి.. సొంత నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలు కూడా టెక్నికల్ బిడ్‌లో డిస్‌క్వాలిఫై అయ్యాయి. గల్లీల్లో ఉండే చిన్నా చితకా కంపెనీలు అనూహ్యంగా అర్హత సాధించాయి. చివరికి అడ్రస్ లేని కంపెనీలకు కూడా అధికారులు అర్హత కల్పించారు. వాటితో ముందుగానే కుమ్మక్కై... కొన్ని కంపెనీలను ఉద్దేశపూర్వకంగా టెండర్ నుంచి తప్పించారన్న విమర్శలున్నాయి.

రాష్ట్రంలో శానిటేషన్ టెండర్లు మొత్తం కంపెనీల టర్నోవర్ ఆధారంగానే ఎంపిక అవుతాయి. ఇదే జరిగితే రాష్ట్ర వైద్యసేవలు-మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులు కోరుకునే సంస్థలకు టెండర్లు దక్కవు. ఎక్కువ టర్నోవర్ ఉన్న కంపెనీలను ఏవేవో కారణాలతో డిస్‌క్వాలిఫై చేస్తే.. తమకిష్టమైన కంపెనీలు తెరపైకి వస్తాయి. కేవలం ఇదే కారణంతో అన్ని అర్హతలున్న సంస్థలను పోటీ నుంచి తప్పిస్తున్నారు. మొన్న సెక్యూరిటీ టెండర్లలో జరిగిన విధంగా శానిటేషన్ టెండర్లకు ముందుగానే బేరసారాలు జరిగిపోయాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆరోగ్య శాఖలో కీలకమైన వ్యక్తికి సంబంధించిన టీమ్.. ఈ టెండర్లు ఏయే కంపెనీలకు ఇవ్వాలో ఇప్పటికే నిర్ణయించేసింది. అది ఇచ్చిన జాబితాను ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు గుడ్డిగా అనుసరిస్తున్నారు. అందులో ఉన్న కంపెనీలనే ఎంపిక చేసి.. మిగిలినవాటిని టెక్నికల్ బిడ్ దశలోనే డిస్‌క్వాలిఫై చేసేశారు. ఇందుకోసం టెండర్ కమిటీలో కొన్ని మార్పులు చేశారు. గత వారం వరకూ టెండర్ వ్యవహారాలు చూసిన చీఫ్ ఇంజనీర్‌ను అకస్మాత్తుగా తప్పించి.. ఏపీఎంఎస్ఐడీసీలో కీలకమైన ఇద్దరు అధికారులకు ఆ బాధ్యత అప్పగించారు. వారిద్దరూ కీలక వ్యక్తికి చెందిన టీమ్ మార్గదర్శకత్వంలో నడుస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత వారం ఏయే కంపెనీలకు అర్హత కల్పించారో.. సోమవారం విడుదల చేసే ఫైనల్ లిస్ట్‌లో కూడా అవే కంపెనీలు ఉండనున్నాయి. డిస్‌క్వాలిఫై అయిన తమపై వచ్చిన అభ్యంతరాలను నిరూపించుకునేందుకు ఆయా కంపెనీలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. వాటిని అధికారులు కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే క్వాలిఫై అయిన కంపెనీలపై అనేక ఫిర్యాదులు వచ్చినా బుట్టదాఖలు చేస్తున్నారు. టెండర్ ప్రక్రియలో ఏదైనా కంపెనీపై ఫిర్యాదులు వస్తే.. వాటి నుంచి తప్పనిసరిగా వివరణ కోరాలి. అవి ఇచ్చిన వివరణ సక్రమంగా ఉందో లేదో అధికారులే చూసుకోవాలి. ఈ టెండర్ల విషయంలో ఇవేమీ పట్టించుకోకుండా ఏకపక్ష ధోరణిలో వ్యవహరిస్తున్నారు.

టర్నోవర్ లేని.. బ్లాక్‌లిస్ట్ కంపెనీలకు పెద్దపీట

శానిటేషన్ టెండర్ ప్రక్రియకు సంబంధించి అధికారులు ఎంపిక చేసిన ఏడు కంపెనీల్లో కొన్నింటిపై అనేక ఫిర్యాదులున్నాయి. ప్రస్తుతం వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ)లో రాయలసీమ ప్రాంత ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు చేస్తున్న కంపెనీ ఏపీలో రెండు సార్లు బ్లాక్‌లిస్టయింది. సదరు కంపెనీ తిరుపతిలో సక్రమంగా పనులు చేయడం లేదని, శానిటేషన్ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదంటూ దానిని డీఎంఈ అధికారులు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. ఇదే కంపెనీ యాజమాన్యం మరో సంస్థ పేరుతో శానిటేషన్ టెండర్లల్లో పాల్గొంది. ఆ కంపెనీ కూడా ఈ ఏడాది మే నెలలో తెలంగాణలో బ్లాక్‌లిస్ట్ అయింది. మరోవైపు జీఎస్టీ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో భవిష్యత్‌లో ఈ కంపెనీ ఏపీలో ఎలాంటి టెండర్లలో పాల్గొనే వీల్లేకుండా చేయాలని జీఎస్టీ అధికారులు లేఖ రాశారు. కంపెనీలు వేరైనా యాజమాన్యం ఒక్కటే కాబట్టి జీఎస్టీ రాసిన లేఖ ఆధారంగా సదరు కంపెనీని డిస్‌క్వాలిఫై చేయాలి. కానీ అధికారులు మొట్టమొదట ఆ సంస్థనే క్వాలిఫై చేశారు. గతంలో సెకండరీ హెల్త్‌లో ఫేక్ డాక్యుమెంట్స్ చూపించి శానిటేషన్ పనులు దక్కించుకున్న కంపెనీకి.. మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు కీలక వ్యక్తికి సంబంధించిన టీమ్, అధికారులు తాపత్రయపడుతున్నారు. సదరు కంపెనీ యజమాని.. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అత్యంత ఆప్తుడు, సన్నిహితుడు కూడా. ఇప్పటికే ఆ కంపెనీకి అర్హత లేకపోయినా సెక్యూరిటీ టెండర్లు కట్టబెట్టారు. ఇప్పుడు శానిటేషన్ టెండర్లు కూడా ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. ఆ కంపెనీకి సరైన టర్నోవర్ లేదు. పైగా టెండర్ నిబంధనల ప్రకారం మూడేళ్ల జీఎస్టీ, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు కచ్చితంగా బిడ్‌లో పొందుపరచాలి. కానీ ఆ కంపెనీ 3 నెలల డాక్యుమెంట్లు మాత్రమే పొందుపరిచింది. మరోవైపు సీఎం చంద్రబాబును మీడియాలో అనునిత్యం విమర్శించే మాజీ ఎంపీకి సంబంధించిన కంపెనీకి కూడా టెండర్లలో అర్హత కల్పించారు.

సీఎం అయితే లెక్కా..?

ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. రోగులకు మంచి వాతావరణలో వైద్య సేవలు అందించాలని ప్రతి సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిస్తున్నారు. శానిటేషన్ విషయంలో ఎక్కడా రాజీపడొద్దని.. జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న కంపెనీలు, టర్నోవర్ ఎక్కువ ఉన్న కంపెనీలకు శానిటేషన్ పనులు అప్పగించాలని చెబుతున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఆయన ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు. బ్లాక్‌లిస్ట్ కంపెనీలు, అర్హత లేని కంపెనీలు, జగన్‌కు అనుకూలంగా ఉండే కంపెనీలతో పాటు గల్లీల్లో ఉండే కంపెనీలను సైతం ఎంపిక చేసే పనిలో పడ్డారు. టెండర్ ప్రక్రియలో పారదర్శకతకు పూర్తిగా పాతరేశారు. ముడుపులిచ్చిన కంపెనీలకు, ముందుగానే నిర్ణయించుకున్న కంపెనీలకు టెండర్లు కట్టబెట్టేందుకు పక్కా స్కెచ్ వేశారు. సోమవారం ఆగమేఘాల మీద టెక్నికల్ కమిటీ సమావేశంతో పాటు బిడ్ ఖరారు కమిటీ భేటీ కూడా నిర్వహించి.. తాము అనుకున్న కంపెనీలకు టెండర్లు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం జోక్యం చేసుకుంటే తప్ప దీనికి బ్రేకులు పడే అవకాశం లేదు.


శ్రీశైలం ఆలయంలో జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అధికారులు, అర్చకులు

మల్లికార్జుని సేవలో హైకోర్టు సీజే

నంద్యాల కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జున, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రధాన ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ జ్ఞాపికతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు


శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ లక్ష్మణ్

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కే.లక్ష్మణ్, రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శంభాజీ ఎస్ షిండే వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

విశాఖ భూములను కాపాడండి

» మాజీ సైనికుడి భూమికి ఎన్ఓసీ జారీపై విచారణ చేయించండి
» రెవెన్యూ మంత్రికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు లేఖ

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మాజీ సైనికులకు ఇచ్చినవి, అసైన్డ్ భూము (డీ-పట్టా)లు అన్యాక్రాంతం కాకుండా కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఆయన లేఖ రాశారు. విశాఖ కేంద్రంగా డీ పట్టా భూముల దందా భారీగా సాగుతోన్న సంగతి తెలిసిందే. మాజీ సైనికులు, ఫ్రీహోల్డ్ అయిన అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు ప్రైవేటు ముఠాలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటిపై 'ఆంధ్రజ్యోతి' మే, జూన్ నెలల్లో వరస కథనాలు ప్రచురించింది. ఈ నేపథ్యంలో విశాఖకు చెందిన జనసేన నేత, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ జూన్ 27న మీడియాతో మాట్లాడుతూ.. ఎండాడలోని మాజీ సైనికుల భూమితో పాటు ఇతర చోట్ల ఉన్న డీ పట్టా భూములు దళారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండాడ భూమి విషయంలో అక్రమంగా నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని స్పీకర్ అయన్న ఉటంకిస్తూ... ఎండాడకు చెందిన మాజీ సైనికుల భూముల ఉదంతంపై విచారణ చేయాలని రెవెన్యూ మంత్రిని కోరారు. "మూర్తియాదవ్ ఎండాడలోని మాజీ సైనికుడి భూమి 5.10 ఎకరాలకి ఎన్ఓసీ గురించి లేవనెత్తారు. ఎన్ఓసీ తీసుకోవడంలో ప్రత్యేకించి నా సోదరుడు, మరికొందరు వైసీపీ నేతలు కలిసి పనిచేశారని అన్నారు. అందులో నా పేరును కూడా ప్రస్తావించారు. ఇది పూర్తిగా నిరాధారమైనది. ఈ అంశంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటి ఆరోపణలు నా వ్యక్తిగత ప్రతిష్ఠకు, రాజకీయ జీవితానికి మచ్చతెచ్చేలా ఉన్నాయి. కాబట్టి ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలుగులోకి తేవాలి" అని స్పీకర్ అయ్యన్న కోరారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందే నివేదిక అందించాలని కోరారు.

మోదీ పాలనలో దేశం అధోగతి

» ఈసీని గుప్పిట్లో పెట్టుకుని ఇష్టారాజ్యం: సీపీఐ నారాయణ



సీపీఐ తిరుపతి జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్‌ను ప్రధాని మోదీ తన గుప్పెట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, దేశాన్ని అధోగతిపాలు చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సీపీఐ తిరుపతి జిల్లా మహాసభలు ఆదివారం సూళ్లూరుపేటలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పాలన చేస్తున్నారని ఆరోపించారు. అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశాన్ని ధారాదత్తం చేసి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారన్నారు. 'దేశంలో ప్రతిపక్షాలను లెక్కచేయరు గానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు భయపడతారు. ఆయనకు మోదీ బానిసగా మారిపోయారు. దేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి విడదీసేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది. మోదీ హయాంలో దేశంలో మత కలహాలు, ఘర్షణలు కనిపిస్తున్నాయి. రైతులను కూడా ఆదుకోలేని పరిస్థితులు ఉన్నాయి' అని ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ పాలనపై పోరాడేందుకు అన్ని పార్టీలు, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పోరాటం

» ఆర్టీసీ స్థలాలు కార్పొరేట్లకు కట్టబెట్టడం దుర్మార్గం
» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విజయవాడ (గవర్నర్‌పేట), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విలువైన ప్రభుత్వ స్థలాలను కార్పొరేట్ సంస్థలకు అన్యాక్రాంతం చేయొద్దని, ఆర్టీసీ స్థలాలను లులు కంపెనీకి లీజుకు ఇస్తూ తీసుకొచ్చిన జీవో నెంబరు 137 వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యాన ఆదివారం విజయవాడ దాసరి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఐ నగర సమితి కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగి, కోట్ల రూపాయల విలువచేసే విజయవాడ పాతబస్టాండ్ స్థలంతో పాటు విశాఖపట్నంలో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని కార్పొరేట్ సంస్థకు కారుచౌకగా 99 ఏళ్ల లీజుకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, లిబరేషన్ నాయకుడు హరనాథ్, ఎస్‌యూసీఐ నేత సుధీర్‌బాబు, కార్మిక సంఘాల నేతలు జీవీ నరసయ్య, ఎండీ ప్రసాద్, వైఎస్ రావు, కేఆర్ ఆంజనేయులు తదితరులు ప్రసంగిస్తూ ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.300 కోట్ల విలువైన విజయవాడ గవర్నర్‌పేట డిపో, పాతబస్టాండ్‌కు చెందిన 4.15 ఎకరాలను లులు కంపెనీకి 99 ఏళ్ల పాటు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. పౌరవేదిక ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే మహాధర్నాకు మద్దతు ప్రకటించింది.

12, 13 తేదీల్లో రాష్ట్రవ్యాప్త ధర్నా: ఎన్ఎంయూఏ

విజయవాడ (బస్‌స్టేషన్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన సెటిల్‌మెంట్ బకాయిల సమస్యలతో పాటు ఆర్టీసీ ఆస్తులను కాపాడాలని కోరుతూ ఈనెల 12, 13 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో కోట్లాది రూపాయల విలువచేసే ఆర్టీసీ స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం ప్రభుత్వం మానుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలి

» ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని



సభలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్ కుమార్ కాకాని


గుంటూరు (విద్య) ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడం.., సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని నిర్ధారించడం వంటి లక్ష్యాలు మన ముందున్నాయని ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం 3వ స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామ్ కుమార్ కాకాని మాట్లాడుతూ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం మనిషి 105 సంవత్సరాల జీవితకాలానికి సరిపోయేట్లుగా ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. విద్యార్థులు నేటి సోషల్ ప్రపంచంలో మునిగిపోకుండా వ్యక్తిగత ప్రపంచం, వృత్తిపరమైన ప్రపంచానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ మాట్లాడుతూ, తమ యూనివర్సిటీ 1191 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసిందని తెలిపారు. వీరిలో పీహెచ్‌డీ 39 మంది, బీసీఏ 31 , ఎంబీఏ 689, ఎంసీఏ 397, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ 35 మందికి అందించామని వెల్లడించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రసంగిస్తూ విద్యార్థులు ముందుగా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, ఆ సమస్యల పరిష్కారానికి నూతన ప్రాజెక్టులను చేపట్టి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, విజయవాడలోని ఆర్ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో దర్శనంపై మాటల తూటాలు

దీనితో 3 గంటల్లో శ్రీవారి దర్శనం అసంభవం

» ఆ ప్రయత్నం కూడా ఏమాత్రం క్షేమకరం కాదు
» టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు
» భక్తుల సమస్యలు తీర్చడానికే సాంకేతికత వినియోగం
» ఏఐపై అవగాహన లేకుండా ఎల్వీ మాట్లాడటం బాధాకరం
» ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృథా అనడం...

ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం: చైర్మన్ బీఆర్ నాయుడు


తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా మూడు గంటల్లో చేయించడమనేది అసంభవమని టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'టీటీడీ గంట, మూడు గంటల్లో దర్శనం చేయిస్తుందని కొంతమంది భక్తులు సంభాషిస్తుండగా విన్నాను. నాకు తెలిసినంత వరకు అది అసంభవం. దాని గురించి ప్రయత్నించడం కూడా ఏమాత్రం క్షేమకరం కాదు. ఏఐని తీసుకొచ్చినా ఆలయంలో కొన్ని పరిమితులు ఉన్నాయి. దానికోసం ధనాన్ని వ్యయం చేయకూడదు. అలాంటి ఆలోచనలకు వెంటనే స్వస్తి పలకాలి. ఇది జరిగే పని కాదు. ఇంతకుముందు అనేకమంది ఈవోలు, చైర్మన్లు ఎన్నో ఆలోచనలు చేశారు. ఆలయాన్ని ముట్టుకోకూడదు కాబట్టి వాటిని విరమించుకున్నారు' అని ఎల్వీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కాగా, ఎల్వీ చేసిన వ్యాఖ్యలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుమల క్యూ కాంప్లెక్స్‌లో సామాన్య భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఉచితంగా గూగుల్, టీసీఎస్, ఇతర సంస్థల సహకారంతో అధునాతన ఏఐ సాంకేతికత ఉపయోగించి నిర్దేశిత సమయంలోపు వారికి దర్శనం కల్పించాలని టీటీడీ బోర్డు నిర్ణయించిందని తెలిపారు. 'శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిర్దేశించిన సమయానికి దర్శనం కల్పించడం, దర్శన సమయాన్ని వారికి ముందస్తుగా తెలియజేయడానికి మాత్రమే ఏఐ విధానం అమలుకు నిర్ణయించాం. ఇలాంటి సమయంలో మాజీ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఏఐ టెక్నాలజీపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం బాధాకరం. ఒక సీనియర్ అధికారిగా పనిచేసిన అనుభవమున్న ఆయన తిరుమలలో ఏఐ టెక్నాలజీ నిరుపయోగమని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. ఇలాంటి మాటలు భక్తుల్లో గందరగోళాన్ని సృష్టించేలా ఉన్నాయి. దాతల సాయంతో ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృథా అనడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ సాంకేతికతను ఉపయోగించి సేవలను సులభతరం చేస్తున్నారు. అదే పద్ధతిలో టీటీడీలోనూ దర్శన సమయాన్ని భక్తులకు ముందస్తుగా తెలియజేసేందుకు, మరింత సౌకర్యవంతంగా, సులభతరం చేసేందుకు మాత్రమే ఉపయోగించేలా నిర్ణయించాం' అని చైర్మన్ పేర్కొన్నారు.

సమస్యలపై పోరాటానికి ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం

» ఏపీ ఎన్జీవో నేతలు విద్యాసాగర్, డీవీ రమణ



విద్యాసాగర్, రమణను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ నాయకులు

విజయవాడ (బస్‌స్టేషన్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం కలిసి నడుస్తుందని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. తాడేపల్లిలోని ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అధ్యక్షతన ఆదివారం కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథి విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం అమలులో ఉద్యోగుల పాత్రను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంపూర్ణంగా సహకరిస్తారన్నారు.

అబార్షన్ చేస్తుండగా గర్భిణి మృతి

» ఆస్పత్రి వద్ద బాధితురాలి బంధువుల ఆందోళన
» అనంతలో ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల గర్భిణి అబార్షన్ చేస్తుండగా ప్రాణాలు విడిచింది. దీంతో ఆమె కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. అనంతపురం జిల్లాలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని బుక్కరాయసముద్రం మండలం చెదళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున, రాధిక (34) దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాధిక ఐదు నెలల గర్భిణి కాగా, అబార్షన్ చేయించేందుకు భర్త అనంతపురంలోని రామచంద్రనగర్‌లో ఉన్న శ్రీకృప ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆదివారం వైద్యులు అబార్షన్ చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. మూడు గంటల తర్వాత రాధిక మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకుని వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె ప్రాణాలు కోల్పోయిందని ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. వైద్యులు, మీడియా ప్రతినిధులకు గాయాలయ్యాయి. అనంతపురం త్రీటౌన్ పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పారు. జిల్లా వైద్య శాఖాధికారులు ఆస్పత్రిని సీజ్ చేశారు.


మాధురి, కుమార్తెలు పుష్పకుమారి, జెస్సీ లోవ

తల్లీ, కుమార్తెల దారుణ హత్య

» భర్త ఇంట్లో లేని సమయంలో ఘటన
» కాకినాడ జిల్లా సామర్లకోటలో దారుణం
» రంగంలోకి క్లూస్‌టీం.. పోలీసు దర్యాప్తు ముమ్మరం

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారులోని సీతారామ కాలనీలో దారుణం జరిగింది. భర్త ఇంట్లో లేని సమయంలో భార్యను, ఇద్దరు కుమార్తెలను ఆగంతకులు కిరాతకంగా హత్య చేశారు. హత్యకు గురైన చిన్నారుల్లో ఒకరికి ఎనిమిది ఏళ్లు, మరొకరికి నాలుగేళ్లు. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న ములపర్తి ప్రసాద్ శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఎంతసేపు కొట్టినా తలుపులు తీయకపోవడంతో వెనుక వైపు తలుపులు తొలగించి లోనికి వెళ్లాడు. గది మధ్యలో భార్య మాధురి (26), కుమార్తెలు పుష్పకుమారి(8), జెస్సీ లోవ (6) రక్తపు మడుగులో పడి ఉండడాన్ని చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. వెంటనే సామర్లకోట పోలీసులకు సమాచారం అందించాడు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, సిబ్బందితో సంఘటనా స్థలిని పరిశీలించారు. హతుల ఒంటిపై గాయాలను బట్టి మాధురిని ఇనుపరాడ్డుతోను, పిల్లలను రాళ్లతోనూ కొట్టి చంపినట్లు భావిస్తున్నారు. క్లూస్ టీం, పోలీసు జాగిలాలతో క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. హంతకుల కోసం పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు ప్రారంభించాయని సీఐ వెల్లడించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఆయన తెలిపారు.



తుమ్మెద రెక్కల మీద ముువ్వన్నెవిల్లుల ఆకాశం

1. ఏ పాలపుంతల్ని దాటొచ్చావో కాని-
ఇంతకుముందెన్నడూ మేమెరుగని
పిల్లనగ్రోవులపంటవు నువ్వు..
లోకం వెంట లోకాన్ని దించి
మాకు పల్లకీలు కట్టించిన
మెరుపులచెండువు నువ్వు...
మడతలు విప్పుకున్న పద్యాలుగా
మమ్ము విప్పార్చిన
మొగలీసంపెంగల మహోత్సవానివి కదూ నువ్వు

2. ఆ అనిమేష వీక్షణాల నిండా
విరగబూచే తీగ సంపెంగల పందిరి పరిచి
ఆ పందిళ్ల నిండా
నన్నొక చిన్నిచిన్ని పిట్టలగుంపును చేసి-
తీరొక్కరాగాల కోలాటాలాడించి
పాడడమే ఎరుగని
నన్నెంత మహాగాయకుణ్ణి చేసి
ఆహో.. ఎన్ని కచేరీలు చేయిస్తున్నావో

3. నీ ఆ పెదవి అంచున విరుపులో
దోగాడే పసిసిగ్గున
వేలవేల కలువరాయళ్లను దూసిపోస్తూ
ఆకాశాల్ని అరచేతికందిస్తుంటే
కొత్తపాటల్ని కట్టుకుంటూ
ఎన్నిసార్లు కొత్తమొదళ్లమైపోతున్నా
ఇంకేదో వెలితిలో-
ఈ చిన్నిగుండెల్ని జోలెలుగా పట్టి
నీ కనురెప్పలవాకిట
భిక్షకులం కావడం
ఎంతటి మహదానందంగా ఉందో

4. నువ్వే దేవభాషను
మాట్లాడుతుంటావో తెలీదుకానీ,
నీతో సంభాషించడానికి
మా వర్ణమాలనంతా మరచిపోయి
లిపికందని ఏదో మధురభాషతో
నీతో పోటీపడుతున్నా-
నీ కేరింతలు, ఉంగా, ఊ లతో
దేహాన్నంతా చిత్రభాషగా మలచి
చిత్తుగా ఓడించేస్తుంటే
మనసును చెంగుపట్టి
రోజూ వంద ఓటముల్ని
ఎత్తుకోవడానికైనా మేం తయారే.

5. ఈ ప్రపంచమింకా
బతికుందనడానికి
ఈ నేల ఇంకా
నవ్వుతూనే ఉందనడానికి
ఈ గాలి ఇంకా
కలల తొక్కిసలాటలో
పండుతూనే ఉందనడానికి
కాలం ఇంకా మమ్మల్ని
పలకరిస్తూనే ఉందనడానికి
ఒకే ఒక్క నిదర్శనం-
చివుళ్లతొడిగే కొత్తలోకాల్ని
కుక్కి కుక్కి మోసుకొచ్చిన
ను.. వ్వే.. గా.

6. మేమూ, కాలం
అదిగో ఆ రైలుపట్టాల్లా
ఎప్పుడూ ఎడమెడమే
అదిగో అక్కడెక్కడో మలుపులో
మా దూరాల్ని బద్ధలుకొడుతున్నట్లున్న
ఆ దవ్వుల్లో- ఇప్పటికైతే-
మా జుగల్‌బందీకి
వేదికా నువ్వే, వాద్యమూ నువ్వే
గాత్రమూ నువ్వే, గానమూ నువ్వే
ముగింపన్నదే లేని కచేరీ నువ్వే

7. ఇసుకకొండల్లా ఎండకాగుతున్న
మమ్మల్ని మళ్లీ నదుల్ని చేసిన
చిలుకపాటల చిరుజలపాతం లాంటి
నీ జలతారునవ్వులు,
నేరుగా చందమామలోంచి రాలి
సెలయేళ్లలో ఈత కొట్టొచ్చిన
సమీరాల్లాంటి నీ తేనెచూపులు
తుంచిపోస్తున్న కాశ్మీరాల్లో తూలీ, సోలీ
చుక్కల్ని కోసుకున్న షైకంలో-
ఓ కొండపల్లిబొమ్మా..
నీకెంత కవిత్వాన్ని బాకీ పడిపోతున్నానో!

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు
✆ 99854 11099

ధీరజ్ కోట్ల కథా సాహిత్య పురస్కారాలు

ధీరజ్ కోట్ల సాహిత్య పురస్కారాల కోసం 2023, 2024, 2025లలో ప్రచురిత మైన కథా సంపుటాలను ఆగస్టు 31 లోగా ఒక కాపీ పంపాలి. మొదటి బహుమతి రూ.10వేలు. అలాగే రూ.1,116 చొప్పున నాలుగు బహుమతులతోపాటు, ఎంపిక కాని పుస్తకాల ధర వెనక్కి చెల్లిస్తాము. చిరునామా: పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, ఇంటి నెం: 15-31, పుట్టంరాజు వారి వీధి, ఇందిరా నగర్, అద్దంకి (పోస్ట్ & మండలం), బాపట్ల జిల్లా – 523201. ఫోన్: 81796 36617.

పుట్టంరాజు బుల్లెయ్య

కాశీభట్ల వేణుగోపాల్ స్మరణ సభ

అక్షరం లిటరరీ ట్రస్ట్, కర్నూలు తరపున కాశీభట్ల వేణుగోపాల్ స్మరణ సభ ఆగష్టు 10 ఆదివారం ఉ.10.30కు కెమిస్ట్ భవన్, కర్నూలులో జరుగుతుంది. ఆ సందర్భంగా కాశీభట్ల స్మరణ సంచిక 'నిహితం'ను వంశీకృష్ణ ఆవిష్కరిస్తారు. అదే సభలో 'అక్షరం – సాహిత్య పురస్కారం – 2025'ను కవి తెలుగు వెంకటేష్ స్వీకరిస్తారు.

జి. వెంకటకృష్ణ

తెలుగు భాషోత్సవాలు

నెల్లూరులో తెలుగు భాషోత్సవాలు 'సేవ' (తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలులో 2025 ఆగస్టు 29, 30, 31 తేదీలలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పాతికేళ్లుగా తెలుగు భాషా సాహితీ రంగాల్లో సేవలందించిన మూడు వందల మంది కవులకు, రచయితలకు సేవ పురస్కారములు అందజేస్తున్నాం. ఈ ఉత్సవాల్లో ప్రాచీన, ఆధునిక, అస్తిత్వవాద సాహిత్యాలు, బాల సాహిత్యం, యువ సాహిత్యం, రాష్ట్రేతర ప్రాంతాల తెలుగు భాషా, సాహిత్యాలు, అవధానం, బోధనా భాషగా తెలుగు, ప్రచురణ, ప్రసార, సాంఘిక మాధ్యమాలు, కథ, నవల, నాటకం సినీ సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనములుంటాయి. వివరాలకు: 94926 66660.

కంచర్ల సుబ్బానాయుడు

పద్య కావ్యాలకు ఆహ్వానం


రచన సాహిత్య వేదిక (కడప) ఆధ్వర్యంలో గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు కోసం పద్యకావ్యాలకు ఆహ్వానం. 2022, 2023, 2024 సంవత్సరాల్లో ప్రథమ ముద్రణ పొందిన పద్యకావ్యాలను పంపాలి. ఎంపికైన కావ్యకర్తకు రూ.10వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తాం. కావ్యాలు 3 ప్రతులను ఆగస్ట్ 30లోగా చిరునామా: భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, రచన సాహిత్య వేదిక, 1/2349-1, 'కృష్ణవేణీ సదన్', హౌసింగ్‌బోర్డు కాలనీ, కడప – 516004కు పంపాలి. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

'తెరవని తలుపుల' వెనుక దాగిన చీకట్లు

తెలుగు నవల వెలువడిన తొలి రోజుల్లో నవలాకారులు పాత్రల బాహ్య సంఘర్షణకు ఇచ్చిన ప్రాధాన్యతను అంతరంగ సంఘర్షణకు ఇచ్చేవారు కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తెలుగు నవలాసాహిత్యంపై పడిన ముఖ్యమైన ప్రభావాల్లో మనోవిశ్లేషణవాదం, అస్తిత్వవాద సిద్ధాంతం ముఖ్యమైనవి. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, ముఖ్యంగా అచేతన మనస్సు (Unconscious Mind), రిప్రెషన్ (Repression), లిబిడో (Libido), ఒడిపస్ కాంప్లెక్స్ వంటి భావనలు, తెలుగు సాహిత్యంలో కొంతమంది రచయితల రచనల్లో స్పష్టంగా లేదా అంతర్లీనంగా కనిపిస్తాయి.

ఫ్రాయిడ్ మనోవిశ్లేషణవాద దృక్పథంతో రచనలో మనోవిశ్లేషణ చేసిన నవలాకారుల్లో త్రిపురనేని గోపీచంద్ ప్రముఖులు. ఆయన రాసిన 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపుల మరకలు', 'పిల్ల తెమ్మెర', 'గడియ పడని తలుపులు' మొదలైన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవల, వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల', ఆర్.ఎస్.ఎస్. సుదర్శనం 'సంసార వృక్షం', శీలా వీర్రాజు 'మైనా', భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచిక పుల్లలు', కోడూరు రామమూర్తి 'నీటిలో నీడలు'.. మొదలైన నవలలు ఈ కోవలోనివే. చలం రచనలు ముఖ్యంగా 'మైదానం', 'సావిత్రి' వంటివి లైంగిక సంఘర్షణలు, సామాజిక నిషేధాలు, వ్యక్తిగత స్వేచ్ఛ కోసం పోరాటాన్ని చిత్రీకరించాయి. విశ్వనాథ సత్యనారాయణ 'ఏకవీర' నవలలో కూడా ఈ సిద్ధాంతానికి సంబంధించిన అవగాహన కనపడుతుంది.



ఇటీవల తెలుగులో వచ్చిన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ గురించి ప్రస్తావించేటప్పుడు కాశీభట్ల వేణుగోపాల్ రాసిన 'నేను చీకటి', 'తపన' మొదలైన అన్ని నవలల గురించీ పేర్కొనాలి. ఈ నవలల్లో పాత్రల అంతరంగ సంఘర్షణలను ఆవిష్కరించడం కోసం కాశీభట్ల వేణుగోపాల్ చైతన్యస్రవంతి విధానాన్ని విస్తృతంగా ఉపయోగించారు. 'నేను చీకటి' నవల ఒక మనో వైజ్ఞానిక నవల చేసే పనే గాక సామాజిక స్పృహతో రాసిన నవల చేసే పనిని కూడా సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

మనిషి మనసులోని చీకటికోణాల ఆవిష్కరణకు చైతన్య స్రవంతి శైలి ఉపయోగపడుతుందని భావించి తాను ఆ శైలిని ఉపయోగిస్తున్నట్లు కాశీభట్ల చెప్పుకొన్నారు. ఆయన 'తెరవని తలుపులు' నవల మనసులోని సంఘర్షణను, తెలియని భయాలను, అణచివేయబడిన ఆలోచనలను, సామాజిక ఒత్తిడుల మధ్య సంఘర్షణలను చిత్రీకరిస్తుంది. 'తెరవని తలుపులు' శీర్షికే మనసులో బంధించబడిన భావాలను, తెరవడానికి ధైర్యం లేని రహస్యాలను సూచిస్తుంది. ఈ నవలలో చైతన్య స్రవంతి శైలి విరివిగా కనిపిస్తుంది. ఈ వాక్యాలను ఒకసారి పరిశీలించండి: "ఫాంటేన్హెడ్... ర్యాండ్... వియ్యలవింగ్... లివింగ్... జీవితం... తంత్రం... కుతంత్రం... మంత్రం... పుష్పమంత్రం... మంత్రపుష్పం... పుష్పం? శష్పం... సుసరభేత్... కామ నిలయా ఘాటరోమాటవీ సముత్పాటనా పరిపాటిక్లై పాటల గంధులు దీనిని పాటింతురు...".

ఫణిహారం వల్లభాచార్య- ఈ నవలను మనస్తత్వశాస్త్రంతో ఎంతగానో విశ్లేషించవచ్చనీ, అస్తిత్వవాదంతో దీని లోతులకు ఈదుకుంటూ వెళ్ళవచ్చనీ, అయాన్ రాండ్ 'ద వర్చ్యూ ఆఫ్ సెల్ఫిష్‌నెస్' పుస్తకం మొత్తాన్నీ దీనికి అన్వయించవచ్చనీ అంటారు. కాశీభట్ల వేణుగోపాల్ 'తెరవని తలుపులు' నవలను సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం, ఎరిక్సన్ మనోసాంఘిక విశ్లేషణ సిద్ధాంతాలను పరిగణనలోకి తీసుకొని విశ్లేషించవచ్చు.

ఈ నవలలోని కథానాయకుడు ఆధునిక జీవితం అందించిన సౌఖ్యాలు పొందిన బ్రాహ్మణుడు, తాగుబోతు, చైన్ స్మోకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. అతడి భార్య లెక్చరర్. కొడుకు అమెరికాలో చదువుకోవాలి అనుకొంటూ ఉంటాడు. ఆర్థికంగా స్థిరంగా ఉన్నప్పటికీ కథానాయకుడి మానసిక జీవితం ఒంటరితనంతో, అస్తిత్వ శూన్యతతో నిండి ఉంది. స్మోకింగ్ వల్ల కాళ్ళు కోల్పోయే స్థితిలో, ఆపరేషన్‌కు ముందు నిద్రమాత్రలతో జీవితాన్ని ముగిస్తాడు.

ఫ్రాయిడ్ నిర్వచించిన 'ఇడ్', 'ఈగో', 'సూపర్-ఈగో' భావనలను ఈ కథకు అన్వయించవచ్చు. నవలలోని కథానాయకుడి పాత్రలోని 'ఇడ్' సమాజం ఆమోదించని, అసంగతమైన కోరికలను జనింపజేస్తుంది. ఉదాహరణకు కథానాయకుడు తన కుటుంబ సభ్యుల గురించి ఇలా అనుకొంటాడు: "నేను విడిపోతే వీళ్ళకు దారి సుగమం అవుతుంది. అట్లా కావడం నాకు ఇష్టం లేదు. కలిసుండాలి. వాళ్ళని హింసించాలి. వాళ్ళ సుఖాలు అనుకొంటున్నవాటికి నేను అడ్డం పడాలి". తన కుటుంబం పట్ల అతని ఈ భావనలను సమాజం హర్షించదు. సమాజ ఆమోదం లేని ఇలాంటి అనేక ఆలోచనలు కథానాయకుడి మస్తిష్కంలోకి వస్తూంటాయి. అతని పాత్ర అంతరంగాన్ని 'ఇడ్' ఎంత డామినేట్ చేసినప్పటికీ కొన్ని విషయాల్లో 'ఈగో' ప్రభావంచేత అతడి ప్రవర్తన సమాజ ఆమోదయోగ్యంగా మారుతుంది. ఉదాహరణకు ఒకచోట కథానాయకుడు

మనిషి మనసులోని చీకటికోణాల ఆవిష్కరణకు చైతన్య స్రవంతి శైలి ఉపయోగపడుతుందని భావించి తాను ఆ శైలిని ఉపయోగిస్తున్నట్లు కాశీభట్ల చెప్పుకొన్నారు. ఆయన 'తెరవని తలుపులు' నవల మనసులోని సంఘర్షణను, తెలియని భయాలను, అణచివేయబడిన ఆలోచనలను, సామాజిక ఒత్తిడుల మధ్య సంఘర్షణలను చిత్రీకరిస్తుంది. 'తెరవని తలుపులు' శీర్షికే మనసులో బంధించబడిన భావాలను, తెరవడానికి ధైర్యం లేని రహస్యాలను సూచిస్తుంది.



"ఆ పెద్దావిడ సంభాషణ ఎక్కడికి దారితీస్తుందో నాకు తెలుసు. మీ ముందు ఆమెను తిట్టలేను కదా... అందుకే.. ఏం చెయ్యమంటావు నన్ను చెప్పు?" అంటాడు. తిట్టాలని ఉన్నా పెద్దావిడను అందరిముందు తిట్టడం తప్పు అనే ఆలోచనకు ఫ్రాయిడ్ ప్రకారం మనిషిలో ఉన్న ఈగో కారణం. ఇక ఆదర్శవంతమైన ప్రవర్తనకు కారణం 'సూపర్ ఈగో'. ఈ నవలలోని ప్రధాన కథానాయకుడి పాత్ర అనేక ఒత్తిడుల వల్ల తన నిజమైన ఆలోచనలను దాచుకోవడం చేత అవి 'తెరవని తలుపులు'గా మిగిలిపోతాయి.

మనిషి తన మానసిక సంఘర్షణలను అధిగమించడానికి పలురకాల రక్షకతంత్రాలను (డిఫెన్స్ మెకానిజమ్స్) అనుసరిస్తాడని ఫ్రాయిడ్ ప్రతిపాదిస్తారు. ఈ నవలలోని అనేక పాత్రలు ఈ తరహా రక్షక తంత్రాలను అనుసరిస్తూ ఉంటాయి. ఉదాహరణకు 'నిరాకరణం' (డినైయల్) అనే రక్షక తంత్రాన్ని కథానాయకుడు అనుసరించే సందర్భం మనకు నవలలో కనిపిస్తుంది. "నాకు ఏ రోగం లేదు. ఏదో రోగముందేమో అనుకొనే రోగం. హైపోకాండ్రియా అనే రోగం" అని కథానాయకుడు అంతరంగంలో అనుకొంటాడు. అలాగే నార్సిజమ్‌కు సంబంధించిన భావనలూ నవలలో ఉన్నాయి. కథానాయకుడు అంతరంగంలో, "మనుషులు ఎవరిని వారు ప్రేమించుకుంటారన్న భావన నాలో తీవ్రంగా ఉంది. నేనూ అంతే గదా! నన్ను నేను నార్సిస్టిక్‌గా ప్రేమించుకొంటాను" అనుకొంటాడు.

ఎరిక్సన్ అనే మనోవిజ్ఞాన శాస్త్రవేత్త తన సాంఘిక మనోవికాస సిద్ధాంతంలో వ్యక్తి అహం ఎనిమిది సాంఘిక దశల ద్వారా పయనిస్తూ వికసిస్తుందని చెబుతారు. ఆ ఎనిమిది దశల్లో ఆరవ దశ అయిన 'సన్నిహితం – ఏకాంతం' అతిముఖ్యమైనది. ఈ దశలోని వ్యక్తులు ఏ కారణం చేతనైనా తమ ఆశలు, సిద్ధాంతాలు, ఆలోచనలను సరిగ్గా ఏర్పరచుకోలేక పోయినప్పుడు ఇతరులతో కలవలేక ఏకాంతంగా గడిపే ప్రయత్నం చేస్తారు. ఈ నవలలోని కథానాయకుడు ఈ తరహాకు చెందినవాడే.

సార్త్ర్ అస్తిత్వవాద అంశాలు కూడా నవలలో కనిపిస్తాయి. ఉదాహరణకు: "సిగరెట్‌కు ఉన్న అస్తిత్వం నీ ఆలోచనల్లో ఉంది. సిగరెట్కై సిగరెట్‌కు అస్తిత్వం లేదు. నీకు అది ఉంది. దానికి నీవు లేవు. సార్త్ర్... మెల్లకన్ను సార్త్ర్... బీఇంగ్ అండ్ నథింగ్‌నెస్... అస్తిత్వమూ అస్తిత్వ రాహిత్యమూ.. రాహిత్యం... నా రాహిత్యం... నేన్లేకపోతే నాయీ ప్రపంచం నాకు లేదు...".

'తెరవని తలుపులు' నవల కాశీభట్ల వేణుగోపాల్ సాహిత్య ప్రతిభకు నిదర్శనం. మనోవిశ్లేషణాత్మక దృక్కోణం నుంచి ఈ నవలను చూసినప్పుడు ఇది మనిషి మనస్సులోని సంక్లిష్టతలను, అస్తిత్వ సంక్షోభాన్ని, సామాజిక ఒత్తిడులను అద్భుతంగా చిత్రీకరిస్తుంది. ఫ్రాయిడ్, ఎరిక్సన్, సార్త్ర్ వంటి సిద్ధాంతకర్తల దృక్కోణాల ద్వారా ఈ నవలను పరిశీలించడం వల్ల పాత్రల్లోని అంతర్గత సంఘర్షణలు స్పష్టమవుతాయి. ఈ నవల తెలుగు సాహిత్యంలో మైలురాయిగా నిలిచిపోతుంది.

■ మారుతి పౌరోహితం
✆ 94402 05303

సోమవారం 4 ఆగష్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

గరిక పూలు



1
వెంటాడడంలో
నీడకీ
జ్ఞాపకానికీ
పోటీ పెడితే,

ఓటమెప్పుడూ
నీడదే!

2
పూలతోటలోకి
నీ ప్రవేశాన్ని
నిషేధిస్తున్నాను!

ఏది పువ్వో
ఏది నువ్వో
తెల్చుకోలేక!





3
అతను,
ఆమె
ఆత్మహత్య చేసుకున్నారు!

ఒకరి ఫోన్లో ఒకరు
మారుపేర్లతో
మిగిలిపోయారు!

4
నువ్వెంత ఇష్టం అంటే
నీతో కలిసి నడిచిన దారుల్లో
ఒక్కణ్ణే
తిరగలేనంత!






5
జీవితం
పుల్లఐస్ బండి లాంటిది!
దాని వెనకాలే పరిగెత్తే
పిల్లలం
మనం!

6
కూలిన
చెట్టుకింద..

నీడ
ముక్కలైన
శబ్దం!





7
నా మనసు
లోతట్టు ప్రాంతంలో ఉందో ఏమో

తరచూ నీ జ్ఞాపకాలముంపుకి
గురౌతూనే ఉంటుంది!

8
ఆటబొమ్మలు
దిగాలుగా
చూస్తున్నాయి

జ్వరం వచ్చిన
పాపాయిని!



■ భాస్కరభట్ల
bbpoet@gmail.com

భావోద్వేగాల్లో అవిభక్త కవలల్లాంటి వాళ్లం, కాబట్టే మేం కలిసి ఈ నవల రాయగలిగాం!

పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ సంస్థ ఈ మధ్య ప్రచురించిన 'రెక్కచాటు ఆకాశం' నవల అనేక అంశాల రీత్యా ప్రత్యేకమైనది. ఇప్పటితరం స్త్రీల జీవితాల్లోని అనేక పార్శ్వాలను క్రమపద్ధతిలో చర్చలోకి తీసుకురావడం అందులో మొదటిది. ఇద్దరు రచయిత్రులు కలిసి దాదాపు మూడువందల యాభై పేజీల నవలని నిర్వహించడం మరొకటి. భిన్న శైలీ ప్రత్యేకతలు కలిగిన వీరు 'సిస్టర్‌హుడ్' భావన పట్ల ప్రేమతో అల్లిన కలనేత ఈ నవల. ఈ సందర్భంగా తొలి జంట నవలా రచయిత్రులు సుజాత వేల్పూరి, ఉమా నూతక్కిలతో ముఖాముఖి.

జంటగా ఇంత పెద్ద నవల రాయడానికి మీ ఇద్దరినీ కలిపిన అంశాలు ఏమిటి?

'రెక్కచాటు ఆకాశం' నవలని మేమిద్దరం కలిసి రాయాలనే ఆలోచన అసంకల్పితంగా మొదలైంది. ఆ తర్వాత ప్రయత్నపూర్వకంగా ముందుకు సాగింది. మా ఇద్దరిలో బలంగా ఉన్న జెండర్ కాన్షస్‌నెస్, అణచివేయబడి నిశ్శబ్దమైపోతున్న నిస్సహాయ అనుభవాలకి గొంతుకనివ్వాలనే కాంక్ష బహుశా ఈ రచనకి పురికొల్పాయని అనుకుంటున్నాము. స్పష్టంగా చెప్పాలంటే నవల ఇతివృత్తం మమ్మల్ని కలిపిన ప్రధానాంశం. 'రెక్కచాటు ఆకాశం' కేవలం ఒక కథ కాదు- ఆత్మగౌరవ పతాక, ధిక్కార ప్రకటన. స్త్రీత్వం చుట్టూ సాలెగూడులా అల్లుకున్న పితృస్వామ్య భావజాలం, బయటికి హింసగా కనపడని వేధింపులు, మనసు మీద నిఘా, స్వేచ్ఛని అణచివేసే ప్రయత్నాలు, వేచివేచి వాటిమీద విరుచుకుపడిన ఆక్రోశం, ఇవన్నీ నవల్లో చర్చకు వస్తాయి. కథాంశపు తీవ్రత, మా ఏకీకృత స్త్రీవాద దృక్పథం, ఆలోచనల్లో సమన్వయం- ఇవన్నీ కలిసే 'రెక్కచాటు ఆకాశం' నవల సృజనకి మమ్మల్ని పురికొల్పిన అంశాలు.

జమిలి రచనలోని సాధకబాధకాలు?

సహజంగా మా ఆలోచనా ధోరణి కొంతవరకూ ఒకేలా ఉంటుంది కాబట్టి, నవల సాఫీగా సాగిపోతుందనే అనుకున్నాం. నవల్లో ఒకటికి మించి ప్రధానపాత్రలు ఉన్నప్పుడు సాధారణంగా దేనికీ ప్రత్యేకత లేకుండా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అటువంటి ప్రమాదంలో పడకుండా, ప్రతి పాత్రనూ వైవిధ్యంగా తీర్చిదిద్దడ మన్నది జమిలి రచన వల్లే సాధ్యమైంది. ఒకరు మొదలు పెట్టిన దాన్ని మరొకరు అందిపుచ్చుకుని సమర్థవంతంగా నెరుపుతూ ముందుకు తీసుకువెళ్ళగలిగే ప్రేరణ జమిలి రచన వల్లే సాధ్యమైంది.

సవాళ్ల విషయానికి వస్తే, ఇద్దరు కలిసి ఒక కథను రాస్తున్నపుడు, ఒకరి వ్యక్తీకరణ మరొకరికి అతిగానో, అనవసరంగానో అనిపించే అవకాశం ఉంది. అటువంటి సందర్భంలో జంటస్వరాల మధ్య గందరగోళం పాఠకులకి కూడా అందే అవకాశం ఉంది. అయితే భావోద్వేగాల పరంగా మేం అవిభక్త కవలల వంటివాళ్లం కాబట్టి దాన్ని సులభంగానే దాటేశాం. కథ, కథనం కల్లోకం కాకుండా కాచింది అదే. ప్రతి రచయితకూ ఒక స్వరం, ఒక దృష్టికోణం ఉంటాయి. ఇద్దరు కలిసి రాస్తున్నపుడు, సహ రచయిత మీద నమ్మకం, రచన లక్ష్యంమీద ఉమ్మడి నిబద్ధత ఉండటం, ఆ స్వరాన్నీ దృష్టినీ సమర్థవంతంగా మరొక స్వరంతో దృష్టితో ఏకీకృతం చేయడానికి సహకరిస్తాయి. మా విషయంలోనూ అదే జరిగి 'రెక్క చాటు ఆకాశం' రూపుదిద్దుకుంది.



సుజాత వేల్పూరి



ఉమా నూతక్కి

నవలా వస్తువు కొత్తగా చెపుతున్నది ఏమిటి?

'పెళ్లి', ముఖ్యంగా 'మాతృత్వం' వంటి వ్యక్తిగత అంశాలని సామాజికం చేసి, సాధారణీకరించి వాటికి 'పవిత్రత' పేరిట పలుపుతాళ్లు, గుదిబండలూ విధించడాన్ని ఈ నవల ప్రశ్నిస్తుంది. సన్నిహిత సంబంధాలలో కూడా అధికార నిర్మాణాలు చొచ్చుకుపోయి విధ్వంసక ధోరణులకు ఎలా దారితీస్తాయో వివరిస్తుంది. ఒక స్త్రీ సెక్సువాలిటీని ఆమె బలహీనతగా భావించి, ఆమెను పాతాళానికి తొక్కేయాలనుకుంటే, ఆమె రెట్టింపు శక్తితో అగ్నిపర్వతంలా ఎగిసిపడి అటువంటి శక్తుల అంతు చూడగలదనేది ఈ నవలలో కొత్తగా మేము చెప్పిన అంశం. ఇటువంటి కథాంశంతో ఇంతకు ముందు నవల ఏదీ రాలేదని చెప్పగలం. ఈ నవల గాయాల ప్రదర్శన ఎంతమాత్రం కాదు. గాయాల పునరుక్తికి కారణమౌతున్న అణచివేత వ్యవస్థలకు వ్యతిరేకంగా తిరుగుబాటు స్వరంతో సవాలును విసురుతుందీ నవల. వ్యక్తిగత విషాదాలను ఈదటం నుంచి, సామూహిక సాధికారత దిశగా కొద్దిమంది స్త్రీలనైనా ఈ నవల ఆలోచింప చేస్తుందని ఆశిస్తున్నాం.



ఇద్దరు కలిసి రాస్తున్నపుడు, సహ రచయిత మీద నమ్మకం, రచన లక్ష్యం మీద ఉమ్మడి నిబద్ధత ఉండటం, ఆ స్వరాన్నీ దృష్టినీ సమర్థవంతంగా మరొక స్వరంతో దృష్టితో ఏకీకృతం చేయడానికి సహకరిస్తాయి. మా విషయంలోనూ అదే జరిగి 'రెక్క చాటు ఆకాశం' రూపుదిద్దుకుంది.

ఈ నవల ఎటువంటి పాఠకుల కోసం?

ఈ నవల జెండర్‌కి అతీతంగా, స్త్రీ పురుష సీరియస్ పాఠకుల కోసం. హాపిలీ ఎవర్ ఆఫ్టర్ ఎండింగ్‌లూ, ఫీల్ గుడ్ ఫాక్టర్ల కోసమూ కాక, పుస్తకం మూశాక, ఒక్క క్షణం కూచుని ఈ నవలలో ఏదో ఒక అంశాన్ని గురించి కాసేపు ఆలోచించగలిగే పాఠకుల కోసం. చదువుకుని సంపాదిస్తూ తమ కాళ్ళ మీద తాము నిలబడిన స్త్రీలంతా భద్రలోకంలో ఉన్నారనుకునే వారు కూడా ఈ నవలను చదవాలి. లింగ సమానత, స్త్రీల జీవితాల చుట్టూ అల్లుకున్న అనేక రాజకీయాలు, వంటి లోతైన అంశాల మీద ఆసక్తిని, ఆలోచనలను రేకెత్తించే సాహిత్యాన్ని ఇష్టపడేవారి కోసం ఈ నవల. స్వీయనిర్ణయాధికారం కోసం, తమదైన ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాటం చేసే స్త్రీలను అభిమానించే పాఠకుల కోసమే మా 'రెక్కచాటు ఆకాశం' నవల. స్త్రీలను సాటి స్త్రీల కంటే ఎవరూ లోతుగా అర్థం చేసుకోలేరని, సిస్టర్‌హుడ్‌తో స్త్రీలు మాత్రమే ఒకరి బాధల్ని సంతోషాల్ని మరొకరు embrace చేసుకోగలరని నమ్మే పాఠకుల కోసం ఈ నవల.

ఇంటర్వ్యూ ■ కె.ఎన్. మల్లీశ్వరి



అనధికారానికి హోలో చెప్పేద్దాం!

శరన్నవరాత్రుల్లో వీఐపీ దర్శనాలకు కొత్త విధానం

- ముద్రించిన టికెట్లు జారీ చేయాలని నిర్ణయం
- వాటిపై హోలోగ్రామ్ అతికించే యోచన
- ఈ టికెట్లు ఉన్న వారికి 'ఓం' దగ్గర నుంచి ప్రవేశం



వీఐపీ... శరన్నవరాత్రుల్లో పోలీసులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు, రెవెన్యూ అధికారులను ఇబ్బంది పెడుతున్న పదవి ఇది. ప్రతి ఏడాది ఇదొక సమస్యగా మారుతోంది. ఇదే వివాదాలకు కారణమవుతోంది. అసలు వీఐపీల కంటే అనధికార వీఐపీలతోనే అసలు సమస్య వస్తోందని గుర్తించిన అధికారులు ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో కొత్త విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. అనధికార వీఐపీలకు చెక్ పెట్టడానికి ముద్రణ టికెట్లు జారీ చేయాలని నిర్ణయించారు. వాటి ద్వారా నకిలీ టికెట్లు పుట్టకుండా ముద్రించిన టికెట్లపై హోలోగ్రామ్ స్టిక్కర్‌ను అతికించాలని నిర్ణయించారు. ఇటీవల నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశంలో ఈ రెండు నిర్ణయాలపై చర్చ సాగింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు శరన్నవరాత్రులు జరుగుతాయి. ప్రతి ఏడాది పది రోజులపాటు సాగే ఉత్సవాలు ఈ ఏడాది తిథుల వృద్ధి కారణంగా 11 రోజులపాటు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రికి వీఐపీల తాకిడి సాధారణ రోజులకంటే ఎక్కువగా ఉంటుంది. వీఐపీలు స్వయంగా రావడంతోపాటు మిగతా 6లో..


నిబంధనలు పాటించకుండా వాదనలు

ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారిని చిన్న రాజగోపురం వద్ద నుంచి ఆలయ అధికారులు తీసుకెళ్లి దర్శనాలు చేయిస్తారు. ఇక సిఫార్సులతో వచ్చే వీఐపీల కోసం ఘాట్‌రోడ్డులోని ఓం మలుపు వద్ద ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తారు. అందులో నుంచి వాళ్లంతా దర్శనాలకు వెళ్లాల్సి ఉంటుంది. సిఫార్సులతో వచ్చే భక్తులు ఈ నిబంధనను పాటించడం లేదు. ఓం మలుపు వద్ద ఏర్పాటు చేసిన క్యూలో నుంచి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీంతో అక్కడ ఏర్పాటు చేసే చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న అధికారులతో వివాదాలకు దిగుతున్నారు. అక్కడి నుంచే సిఫార్సు చేసిన వీఐపీలకు ఫోన్లు చేయడం, వారు తిరిగి అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేయడం జరుగుతోంది.

కృష్ణమ్మ పరవళ్లతో పులకింత

కృష్ణానదికి ఎగువ నుంచి వచ్చిన వరదను ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. పరవళ్లు తొక్కుతూ కడలి వైపు పరుగులు తీస్తున్న కృష్ణమ్మను చూసేందుకు నగర వాసులు భారీగా తరలివస్తున్నారు. కనులారా నీటి ప్రవాహాన్ని చూసి పులకించిపోతున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద సాయంత్ర వేళ రద్దీ ఏర్పడుతోంది. -ఆంధ్రజ్యోతి- విజయవాడ





పంచాయతీలకు బకాయిల బండ!

సీఆర్‌డీఏ నుంచి రావాల్సింది రూ.100 కోట్లపైనే..

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామ పంచాయతీలను బకాయిల బండ వేధిస్తోంది. డెవలప్‌మెంట్ చార్జీల కింద సీఆర్‌డీఏ నుంచి రూ.100 కోట్లపైనే బకాయి ఉంది. ఏళ్ల తరబడి ఈ బకాయిలు రాక గ్రామ పంచాయతీలు విలవిల్లాడుతున్నాయి. విస్తరిస్తున్న నిర్మాణ రంగానికి తగినట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నాయి. ప్రజల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకుంటున్నాయి. విధిలేని పరిస్థితుల్లో కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి విషయం తీసుకెళ్లాయి. ఆయన సీఆర్‌డీఏ కమిషనర్‌కు లేఖ రాశారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఒక్క గొల్లపూడికే రూ.65 కోట్ల బకాయి

- పదేళ్లుగా పంచాయతీలకు డెవలప్‌మెంట్ చార్జీలు ఇవ్వని సీఆర్‌డీఏ
- ఈ జాబితాలో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి, నిడమానూరు, గన్నవరం..
- ఇబ్రహీంపట్నం, కొండపల్లి , మైలవరానికి అందని డెవలప్‌మెంట్ చార్జీలు
- నిధులు లేక మౌలిక సదుపాయాలకు నోచుకోని గ్రామాలు
- కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేసిన గ్రామ పాలకవర్గాలు
- బకాయిలు చెల్లించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామాలుగా గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి, నిడమానూరు, గన్నవరం తదితర గ్రామాలు ఉన్నాయి. విజయవాడ నగరంతో సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. గత దశాబ్ద కాలంగా ఆయా గ్రామాల్లో నిర్మాణ రంగం ఊపందుకుంది. గ్రూప్ హౌస్‌లు, మల్టీస్టోర్డ్ బిల్డింగ్‌లు, భారీ అపార్ట్‌మెంట్లు వంటివి నిర్మిస్తున్నారు. వీటికి సంబంధించి సీఆర్‌డీఏ వసూలు చేస్తున్న డెవలప్‌మెంట్ చార్జీలో స్థానిక గ్రామ పంచాయతీలకు క్రమం తప్పకుండా ఇవ్వాల్సిన వాటా మొత్తాన్ని విడుదల చేయటం లేదు. దీంతో విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామ పంచాయతీలకు రూ.100 కోట్లు మిగతా 6లో..



గొల్లపూడిలో భారీగా నిర్మితమైన అపార్ట్‌మెంట్లు

రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ నిల్

గ్రామ పంచాయతీ పరిధిలోని ఆస్తులకు సంబంధించి జరిగిన రిజిస్ట్రేషన్లకు ట్రాన్స్‌ఫర్ డ్యూటీ (టీడీ) కూడా ఇప్పటి వరకు ఏ పంచాయతీలకు జమ కావటం లేదు. గొల్లపూడి మేజర్ గ్రామ పంచాయతీకి రూ.2.50 కోట్ల మేర టీడీ బకాయిలు రావాల్సి ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలకు కూడా రూ.కోట్లలో కాకపోయినా రూ. లక్షలలోనైనా రావాల్సి ఉంది.

భక్తజనకీలాద్రి



శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీకే శీనానాయక్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. -ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి

రాజధానితో సమానంగా విజయవాడ అభివృద్ధి
● ఎంపీ కేశినేని చిన్ని
6
స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం
● కలెక్టర్ లక్ష్మీశ

స్టాంపింగ్ దోపిడీ!

తూనికలు, కొలతల శాఖ లైసెన్స్‌డ్ రిపేరర్ల కక్కుర్తి!

చౌక దుకాణాల కాటాల స్టాంపింగ్ విషయంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు తమ అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇటీవల మైలవరంలో కాటాల స్టాంపింగ్ పేరుతో లైసెన్స్‌డ్ రిపేరర్లు అడ్డగోలుగా డబ్బులు దండుకున్నారు. స్టాంపింగ్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


- కాటాల స్టాంపింగ్‌లో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్
- సర్వీస్ ప్రొవైడర్స్‌ను కాదని లైసెన్సింగ్ ఏజెన్సీలతో పనులు
- ఒక్కొక్కరి నుంచి రూ. 1000 వసూలు!



మైలవరంలో జరుగుతున్న కాటా స్టాంపింగ్ ప్రక్రియ

ఆంధ్రజ్యోతి-విజయవాడ: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాలశాఖలో నూతన సంస్కరణలను ప్రవేశ పెట్టారు. పేదలకు ఇస్తున్న బియ్యంలో తూకం మోసాలను అరికట్టడానికి, జవాబుదారీ తీసుకురావటానికి వీలుగా అప్పటి వరకు ఉన్న రాళ్ల కాటాలను తొలగించి ఎలక్ట్రానిక్ కాటాలను ప్రవేశపెట్టారు. ఎలక్ట్రానిక్ కాటాలకు ఈ పోస్ యంత్రాన్ని అనుసంధానం చేసే విధానాన్ని తీసుకు వచ్చారు. ఈ విధానంతో రేషన్ దుకాణాల్లో అప్పటి వరకు తలెత్తే కాటాల మాయాజాలానికి తెరపడింది. మాన్యువల్ కాటాలను రెండు సంవత్సరాలకు ఒకసారి తనిఖీ చేసి తూకం రాళ్లకు సీల్ వేసే విధానం పోయి ఎలక్ట్రానిక్ కాటాలకు సంవత్సరానికి ఒక సారి సీల్ వేసే విధానం వచ్చింది. రేషన్ దుకాణాలకు ఇచ్చిన కాటాలను అప్పటి ప్రభుత్వం 'కాల్ ఆన్ కంపెనీ' నుంచి కొనుగోలు చేసింది. కాటాకు ఏవిధమైన మరమ్మతులు వచ్చినా 'కాల్ ఆన్ కంపెనీ' చేయాలి. కానీ సంవత్సరానికి ఒక సారి తూనికలు, కొలతల అధికారులు సీల్ పేరిట వచ్చి రేషన్ డీలర్ల నుంచి అక్రమంగా రూ. 1,000, 1,500 చొప్పున వసూలు చేసేవారు. గత ఏడాది ఇదే విషయంపై రేషన్ డీలర్ల సంఘాలు కమిషనరేట్ అధికారులకు ఫిర్యాదు మిగతా 6లో..





ఆసుపత్రిలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ (ఇన్‌సెట్‌లో) వసంత రాయులు (ఫైల్)

అవయవదానం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృత్తివెన్ను మండలం చందాల వాసి

- గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- వసంత రాయులు అవయవాలు దానం చేయడానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆరా.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్

కృత్తివెన్ను, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మరణించిన తర్వాత కూడా జీవించే అవకాశం అవయవదానంతోనే సాధ్యమని నమ్మిన ఓ కుటుంబం వారి కుటుంబ పెద్ద బ్రెయిన్‌డెడ్ కావటంతో ఆయన అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచింది. కృత్తివెన్ను మండలం చందాల గ్రామానికి చెందిన మిగతా 6లో..

జోరుగా ఇసుక దందా!

మునేటి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో తరలింపు

- తెలంగాణలోని ఖమ్మం, హైదరాబాద్‌కు రవాణా
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఇసుక
- పట్టించుకోని అధికారులు



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

నందిగామ డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో మునేటి ఇసుకను రాత్రి సమయాల్లో గుట్టుగా లారీలకు లోడ్ చేసి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీగా సొమ్ము ఆర్జిస్తున్నారు. సరిహద్దుల్లో పకడ్బందీగా తనిఖీలు లేకపోవటం అక్రమార్కులకు వరంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విధానం వల్ల జిల్లాలో ఇసుకకు పెద్దగా గిరాకీ లేదు. డివిజన్ పరిధిలో కీసర కంచెల, మోగులూరు, మున్నలూరు తదితర స్టాక్ యార్డుల్లో పెద్దయెత్తున ఇసుక నిల్వ చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు వర్షాకాలంలో ఇసుక తవ్వకాలు జరపకూడదు. ఇందుకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు మునేటిలో ఇసుక తవ్వుతున్నారు. కంచెల, అనాసాగరం, అంబారుపేట, పెనుగంచిప్రోలు, శనగపాడు తదితర ప్రాంతాల్లో అక్రమార్కులు మునేటి చెరపడుతున్నారు. అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో కొంత మంది స్థానిక అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా మునేటి నుంచి ఇసుక తీసుకువెళుతున్నారు. అయితే అక్రమార్కులు మాత్రం రాత్రి సమయాల్లో జేసీబీలతో మునేటి ఇసుకను కొల్లగొడుతున్నారు. మునేటిలో దిగటానికి ప్రత్యేకంగా బాట (ర్యాంప్) ఉన్నట్లయితే నేరుగా లారీలను తీసుకువెళ్లి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. లారీలు వెళ్లటానికి వీలు పడని పక్షంలో ట్రాక్టర్ల ద్వారా ఒడ్డు మీద డంపింగ్ చేసి, తర్వాత లారీలకు లోడ్ చేస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మంతో పాటుగా తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానమైన రోడ్లపై కాకుండా అక్రమార్కులు ఎక్కువగా డొంక రూట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం సరిహద్దుల్లో పకడ్బందీగా తనిఖీలు జరగకపోవటం అక్రమార్కులకు కలిసి వచ్చింది. గతంలో మాదిరిగా ప్రధాన రోడ్లపై చెక్ పోస్టులు పనిచేయటం లేదని అంటున్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతుండటంతో ఇసుక అక్రమ రవాణా కాసుల వర్షం కురిపిస్తోంది. రెండు రోజుల క్రితం నందిగామ మండలం కంచెల వద్ద మునేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను నందిగామ పోలీసులు పట్టుకున్నారు. అంతకు ముందు చిల్లకల్లు పోలీసులు ఒక లారీని పట్టుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి నిందితుడి పరారీ

- తర్వాత పట్టుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు
- విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయితో చిక్కిన నిందితుల్లో ఒకరు పోలీసు స్టేషన్ నుంచి పారిపోయాడు. తర్వాత అతడిని పట్టుకుని తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఘటన పశ్చిమ డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. రాయనపాడుకు చెందిన రేవంత్, గుంటుపల్లికి చెందిన రాహుల్ స్నేహితులు. ఇద్దరూ ఏవోబీ నుంచి గంజాయిని తేవడంలో సిద్ధహస్తులు. వీరితో రాయనపాడుకు చెందిన వసంత్, కల్యాణ్, అయ్యప్పస్వామి ఆలయ రోడ్డుకు చెందిన రఘు గంజాయిని రప్పించుకున్నారు. కిలో గంజాయికి రూ.5వేల చొప్పున డబ్బులిచ్చారు. ఈవిధంగా వసంత్ రూ.5వేలు, కల్యాణ్ రూ.5వేలు. రఘు రూ.10వేలు ఇచ్చాడు. రేవంత్, రాహుల్ తెచ్చిన గంజాయిని రాయనపాడు ప్రాంతంలో శనివారం పంపిణీ చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రఘు తానిచ్చిన రూ.10వేలకు 2కిలోల గంజాయిని తీసుకుని పారిపోయాడు. పోలీసులు రాహుల్, రేవంత్, వసంత్, కల్యాణ్‌ను సుమారు కిలో గంజాయితో పట్టుకున్నారు. అనంతరం వారిని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. సాధారణంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించిన తర్వాత పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో అది జరగలేదు. ఈ నలుగురినీ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. వీరిలో వసంత్ అరెస్టు విషయం తెలుసుకుని అతడి భార్య స్టేషన్‌కు వచ్చింది. పోలీసులు ఆమెతో మాట్లాడుకునే అవకాశం కల్పించారు. భార్యతో మాట్లాడుతున్నట్టు నటించిన వసంత్ పారిపోయాడని తెలిసింది. ఈ విషయాన్ని మూడో కంటికి తెలియకుండా గోప్యంగా ఉంచారు. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో ఆగమేఘాలపై ప్రత్యేక బృందాలను నియమించారు. వసంత్‌ను పరామర్శించడానికి వచ్చిన అతడి భార్యను పోలీసులు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. ఈలోపు బృందాలు అతడిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకొచ్చాయి.

మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

● డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి



ఆసుపత్రికి వచ్చేవారికి మొక్కలు పంచుతున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి తన జీవిత కాలంలో మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకోవాలని డయాబెటిస్ స్పెషలిస్ట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నగరంలోని వీజీఆర్ ఆసుపత్రిలో ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల పరిరక్షణ జీవన వైవిధ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 15ఏళ్ల నుంచి పల్లె ప్రాంతాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటడం, తన వద్దకు వచ్చే పేషెంట్లకు మొక్కలు అందజేయడం చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా 600 మామిడి మొక్కలు మండలపల్లి నర్సరీ నుంచి తెప్పించి ఆసుపత్రి ఆవరణలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. మొక్కలు పెంచాలనే ఆసక్తి ఉన్నవారు ఆసుపత్రికి వచ్చి మామిడి మొక్కలు తీసుకెళ్లవచ్చన్నారు. గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత క్లిష్టమైన సర్జరీ విజయవంతం

● క్యాపిటల్ ఆసుపత్రి డాక్టర్ హేమకృష్ణ సాయి



సర్జరీ తరువాత కుమారుడితో పాములు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అత్యంత క్లిష్టమైన బడుల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌ను 84 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా నిర్వహించినట్టు క్యాపిటల్ ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ కే హేమకృష్ణ సాయి తెలిపారు. ఆదివారం క్యాపిటల్ ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమేవేశంలో ఆయన మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన ఆరెపల్లి పాములు రెండేళ్లుగా తీవ్రమైన డబుల్‌వాల్వ్ వ్యాధితో బాధపడుతున్నారని, దీర్ఘకాలికంగా వైద్యం చేయించుకున్నప్పటికీ పరిస్థితి దిగజారిందన్నారు. శ్వాస బలహీనంగా ఉండడం, గుండె వైఫల్యంతో రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకోలేని పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన రోగికి సంక్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. సీఎం సహాయనిధి కింద ఆపరేషన్‌ను నిర్వహించామన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ హరీష్ మన్నే, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పోరాటాలతోనే హక్కులకు రక్షణ

● ఉపాధ్యాయులకు పీఆర్సీ డీఏ బకాయిలు చెల్లించాలి

● మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, నాగేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే ఉపాధ్యాయులు ప్రయోజనాలు సాధించుకోవాలని, హక్కులను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కృష్ణా జిల్లా యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీఆర్సీ ప్రకటించలేదన్నారు. డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామన్న మంత్రి లోకేష్ హామీ నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాలయాలను ఇంకా ప్రైవేటీకరణ చేసేందుకు యోచిస్తున్నాయన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ షౌకత్ హుస్సేన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్పీ మనోహరకుమార్‌తో పాటు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ కనకారావు, కోశాధికారి ఎం వరప్రసాద్, జిల్లా సహాధ్యక్షురాలు జే ఝాన్సీ, కార్యదర్శి టీ సీతారామయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు జే లెనిన్‌బాబు, సీహెచ్ రాజాశ్రీధర్, యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు పార్వతీశం, ఆశీర్వాదం, రాందేవ్ మాట్లాడారు. అనంతరం పీఆర్సీ నివేదికను ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి టీచర్లను పాత విధానంలో చేర్చి పెన్షన్లు ఇవ్వాలని తీర్మానించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన నేతలతో సమావేశం ఆద్యంతం చర్చనీయాంశంగా జరిగింది.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి



కోడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరాలి గ్రామానికి చెందిన గంజాల కొండాలమ్మ (30) పిడుగుపాటుకు గురై ఆదివారం మృతి చెందింది. వ్యవసాయ పనులకు వెళ్లిన ఆమె విగత జీవిగా మారటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ కొండాలమ్మ, వీరబాబు దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు మగ పిల్లలు. కాగా రోజులానే ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. తోటి కూలీలతో కలిసి కొండాలమ్మ కోడూరు శివారు నరసింహాపురం గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. ఇంతలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. అదే సమయంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కొండాలమ్మ అకాల మృతిని భర్త వీరబాబు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఉదయం పనికి వెళ్లిన భార్య సాయంత్రం విగతజీవిగా రావటంతో తట్టుకోలేక తన పిల్లలను హత్తుకుని భోరున విలపించాడు. ఆమెతోపాటు నాటు వేస్తున్న గంజాల జ్యోతి, గంజాల పార్వతి పిడుగు తాకిడికి గాయపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చరిత్ర మరువదు మీ సేవా నిరతి

● మాజీ మంత్రి మండలి కృష్ణారావు శత జయంతి నేడు



అవనిగడ్డ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దివిసీమ పేరు వినగానే ఎవరికైనా ముందుగా గుర్తుకొచ్చే పేరు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావుదే. గాంధేయ వాదాన్ని రాజకీయాల్లో ప్రయోగించి ఆడంబరాలకు దూరంగా, సేవే పరమావధిగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి దివి ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న గొప్ప వ్యక్తి మం డలి వెంకట కృష్ణారావు. దివిసీమ ఉప్పెన అనంతరం ఈ ప్రాంత పునర్నిర్మాణానికి ఆయన చేసిన అలుపెరగని పోరాటం ప్రజల మనసుల్లో చెరగని తీపి గుర్తుగా నిలిపింది. తన జీవితాన్ని దివిసీమ అభివృద్ధికి అంకితం చేసిన మండలి కృష్ణారావు శత జయంతి నేడు. కొల్లేటి సీమలోని పల్లెవాడలో 1926 ఆగస్టు 4న జన్మించిన ఆయన నాగాయలంక మండలం భావదేవరపల్లి, అవనిగడ్డలో విద్యాభ్యాసం సాగించారు. 1957 నుంచి 62 వరకు ఎంపీగా 1963 నుంచి 1969 వరకు జడ్పీ ఉపాధ్యక్షుడిగా, 1969 నుంచి 72 వరకు అవనిగడ్డ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. 1972లో అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికై పీవీ నరసింహారావు మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమం, మత్స్య పరిశ్రమల శాఖలను నిర్వహించారు.

రాజధానితో సమానంగా విజయవాడ అభివృద్ధి

● ఘనంగా ఎంపీ చిన్ని జన్మదిన వేడుకలు ● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేతలు



ఎంపీ చిన్నిని అభినందిస్తున్న ఎమ్మెల్యేలు బొండా ఉమా, తంగిరాల సౌమ్య, కొలికపూడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు

వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో సమానంగా విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆదివారం తన జన్మది వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జాతీయ రహదారి - 30లో ఇబ్రహీంపట్నం, చంద్రగూడెం మార్గంలో డబుల్ లైన్ ఆర్‌వోబీకి, విజయవాడ - మచిలీపట్నం ఆరు లైన్ల హైవేకు మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారన్నారు. సీఎం చంద్రబాబు అభ్యర్థన మేరకు హైదరాబాద్ - విజయవాడ ఆరు లైన్ల గ్రీన్ హైవే ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ పున్నమిఘాట్ వరకు పొడిగించేందుకు గడ్కరీ అంగీకరించి అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. తొలుత గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు ఎంపీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేయగా, మాజీ ఎమ్మెల్సీ భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ చిన్ని మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, ఎంపీ సానా సతీష్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్స్ అండ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జీ రఘురామరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, వివిధ విభాగాల అధ్యక్షులు, కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎంపీ కుటుంబం



ఇంద్రకీలాద్రి: ఎంపీ కేశినేని చిన్ని జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దుర్గగుడిలో దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వేదాశీర్వచన మండపంలో వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో ఎంపీ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో వీఎంసీ కమిషనర్

స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం

● పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



విద్యాధరపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ విజయవాడ సాధించుకుందామని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. స్వచ్ఛ విజయవాడ సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం హరిత బెరంపార్క్‌లో సంప్రదాయ నృత్య పోటీలను కలెక్టర్, వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు దోహదపడతాయన్నారు. విజయవాడ నగరం ప్రతిభావంతులైన కళాకారులకు కేంద్రంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణపై తరచుగా ఇలాంటికి నిర్వహిస్తే ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. వీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పతుల నిషేధంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు వివిధ కళారూపాలతో చేసే ప్రచారంలో భాగంగా వరుసగా ఐదు ఆదివారాలు నృత్యపోటీలు జరుగుతాయన్నారు. 5వ ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, మేరీటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య పాల్గొన్నారు.

కారు ఢీకొని సంగమూడి వాసి దుర్మరణం

కృత్తివెన్ను, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని సంగమూడికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం కృత్తివెన్నులో జరిగింది. సంగమూడి గ్రామానికి చెందిన కూనసాని వీర నారాయణస్వామి (55) కృత్తివెన్నులో చర్చికి వెళ్లి అక్కడ నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కృత్తివెన్ను ప్రధాన సెంటర్‌లో పల్లెపాలెం వైపు నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. నారాయణస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా రాజీనామాలపై ఎమ్మెల్యే సౌమ్య ఫైర్

నందిగామ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పార్టీకి రాజీనామాలు చేస్తున్న నేతలను ఉపేక్షించేది లేదంటూ మరో మారు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిని చూసి మరొకరు తమ అసంతృప్తులను సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పార్టీకి నష్టం కలుగుతుందని భావించిన ఆమె హెచ్చరికలు చేసి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. ఇటీవల అనాసాగరానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు చలమల కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. జనసేన నేతలకిచ్చిన గౌరవం తనకు ఇవ్వడం లేదన్న ఆరోపణలతో సోషల్ మీడియాలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.ఇదే క్రమంలో తాజాగా పట్టణంలోని 18వ వార్డు పార్టీ ఇన్‌చార్జి తోటకూర సూర్యనారాయణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రకటించారు. ఇటీవలే వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ టీడీపీలో చేరారు. దీంతో కొత్తగా వచ్చిన కౌన్సిలర్ వర్గానికి పార్టీలో ప్రాధాన్యత పెరిగింది. అందుకే అవకాశం వచ్చిన ప్రతిచోటా సూర్యనారాయణ తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వచ్చాడు. ఫలితం లేక చివరకు శనివారం సోషల్ మీడియాలో రాజీనామా ప్రకటన చేశాడు. దీనికి తోడు గతంలోనూ పలు సంఘటనలు ఎమ్మెల్యే సౌమ్యను అసహనానికి గురి చేశాయి. ముప్పాళ్లలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన సమీక్షలో పలువురు నేతలు వ్యక్తపరిచిన అసంతృప్తిపై మనస్తాపానికి గురయ్యారు. తాజాగా ఆర్థిక మంత్రి పయ్యావుల పర్యటనలో సౌమ్య సమక్షంలో బీసీ నేత యలగాని నూకానమ్మ ఏకంగా బీసీలకు అన్యాయం జరుగుతుందంటూ చేసిన ప్రకటన సౌమ్యను ఒకింత అసహనానికి గురిచేసింది. ఇలా ప్రతి ఒక్కరూ ఇలాగే సోషల్ మీడియాలో రాజీనామాలు చేయడం, బహిరంగ సభల్లో అసంతృప్తిని వ్యక్తం చేయడం వంటి అంశాలపై సౌమ్య తీవ్రంగా స్పందించారు. ఇకపై ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. సమస్యలుంటే మాట్లాడి పరిష్కరించుకోవాలని, ఇలా ప్రచారం చేస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. మొత్తం మీద పార్టీకి నష్టం కలిగేలా ప్రవర్తిస్తున్న వారిపై సౌమ్య తన స్పష్టమైన దృక్పథాన్ని వ్యక్తం చేశారు.

అవయవదానం

(5వ పేజీ తరువాయి)

జనసైనికుడు చందు వీర వెంకట వసంత రాయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. దీంతో రాయులు అవయవాలు దానం చేసేందుకు కుటుంబం ముందుకొచ్చింది. వసంత రాయులు కుమారుడు సీతారామరాజు మాట్లాడుతూ తన తండ్రి మరణానంతరం కూడా ఏదో ఒక రూపంలో.. ఎవరో ఒకరి రూపంలో వారి దేహంలో తన తండ్రి బతికే ఉంటాడన్న నమ్మకంతో అవయవదానానికి అంగీకరించామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవా స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో కూడా అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అవయవదానం చేసేందుకు ముందుకొచ్చిన జనసైనికుడి కుటుంబాన్ని పరామర్శించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తమను పంపారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులను ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. తమ పార్టీ నిబద్ధత గల ఓ సైనికుడ్ని కోల్పోయిందని పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల గురించి ఆరా తీసి, అవయవదానంపై అభినందించారన్నారు. పార్టీ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికారానికి హోలో చెప్పేద్దాం!

(5వ పేజీ తరువాయి)

వారికి తెలిసిన వారికి దర్శనాలను సిఫార్సు చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో ఇదొక సంప్రదాయంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ ప్రొటోకాల్ జాబితాలో ఉంటారు. వాళ్లంతా శరన్నవరాత్రుల్లో దర్శనాలకు వస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అనుచరులు, కార్యకర్తలను, అధికారులు, న్యాయాధికారులు వారి బంధువులను దర్శనాలకు పంపుతారు.

నకిలీల బెడద

ఇదంతా ఒక సమస్య అయితే నకిలీ రెండో సమస్యగా మారింది. వీఐపీలకు ఆలయ అధికారులు కొన్ని టికెట్లను ఇస్తుంటారు. వాటికి నకిలీలను తయారు చేయించి కొన్ని ముఠాలు వాటిని అధిక ధరకు అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయి. స్వయంగా దర్శనాలకు వచ్చే వీఐపీలకు ప్రొటోకాల్ ఉంటుంది కాబట్టి ఆ సిఫార్సులతో వచ్చే అనధికార వీఐపీలను కట్టడి చేయడానికి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఒక్కో వీఐపీకి ఎన్ని టికెట్లు కావాలో తెలుసుకుని వాటిని ముద్రించి, వాటిపై హోలోగ్రామ్ అతికించే బాధ్యతలను అధికారులకు అప్పగించారు. ఈ టికెట్లు ఉన్న వారిని ఓం మలుపు వద్ద నుంచి వీఐపీ క్యూలోకి అనుమతించాలని నిర్ణయించారు. అదేవిధంగా టికెట్లపై హోలోగ్రామ్ ఉండడంతో చూడగానే నకిలీ టికెట్లను గుర్తించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

స్టాంపింగ్ దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

చేయడంతో ఉన్నతాధికారులు లైసెన్స్‌డ్ రిపేరర్లు, డీలర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. కాటాలు ప్రభుత్వానికి విక్రయించిన వారే రిపేర్లు, సర్వీస్ చేస్తున్నందున కాటా రిపేర్లు, సర్వీసింగ్, క్యాలిబరేట్ చేసినందుకు లైసెన్స్‌డ్ రిపేరర్లకు చెల్లించాల్సిన పనిలేదని వాదించారు. స్టాంపింగ్ చేసే ముందు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయానికి సమాచారం ఇచ్చి కాటాల సర్వీస్ ప్రొవైడర్‌కు సమన్వయం చేసుకుని టెక్నీషియన్‌తో కాటా రిపేర్లు ఉంటే చేయించాలని ఆ సమావేశంలో డీలర్లు కోరారు. కాటాలు ప్రామాణికంగా ఉన్నాయా లేదా అన్న కాలిబరేషన్ కోసం ప్రభుత్వానికి రూ.300 ఫీజు ఎప్పటిలాగే చెల్లిస్తామని చెప్పారు. దీంతో వివాదానికి తెరపడింది.

సమాచారం లేదు.. సర్వీస్ ప్రొవైడర్ టెక్నీషియన్ లేడు

ఎన్టీఆర్ జిల్లాలో కాటాలకు స్టాంపింగ్ చేసేటపుడు తూనికలు, కొలతలశాఖ అధికారులు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయానికి సమాచారం ఇచ్చి కాటాల సర్వీస్ ప్రొవైడర్ టెక్నీషియన్‌ను సమన్వయం చేసుకుని కాటాలకు మరమ్మతులు ఉంటే చేయించి, అపుడు సీల్ చేయాలి. కానీ, ఇటీవల మైలవరం తదితర ప్రాంతాల్లో ఇటువంటిది ఏమీ లేకుండా సీల్ వేసే కార్యక్రమం చేస్తున్నారు. పైగా ప్రతి రేషన్ డీలర్ నుంచి రూ.1000 చొప్పున వసూలు చేసి ఒకటే బిల్లు ఇస్తున్నారు. వాస్తవానికి డీలర్లు ప్రభుత్వానికి చెల్లించే రూ.300 సీఎఫ్‌యంఎస్ ద్వారా చెల్లించి రసీదును సంబంధిత అధికారికి అందజేస్తేనే .. వారు వచ్చి సీల్ వేయాలి. కాని అందుకు విరుద్ధంగా మైలవరంలో గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం జరిగిపోతోంది.

పోలంపల్లి ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు సహకరించండి

● తెలంగాణ డిప్యూటీ సీఎం విక్రమార్కను కలిసి తాతయ్య



తెలంగాణ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోలంపల్లి వద్ద మునేరు ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు తెలంగాణలో పెద్ద మండవ రైతులను ఒప్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారం మధిరలో కలిసి కోరారు. మునేరు ఆనకట్ట ముంపునకు గురైన పెద్దమండవ గ్రామానికి 40మంది రైతులకు త్వరలో పరిహారం ఇప్పిస్తామన్నారు. పెద్ద మండవ రైతుల అభ్యంతరంతో తాత్కాలిక మరమ్మతులు ఆగి 30 వేల ఎకరాల్లో మునేరు ఆనకట్ట ఆయకట్టులో వరినాట్లు నిలిచే పరిస్థితి వస్తుందని, 50 వేల మంది రైతులు, రైతుకూలీల భవితవ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. మునేరులో కలిసిపోయిన రైతుల భూములకు ఏపీ ప్రభుత్వం మార్కెట్ ధర చెల్లిస్తుందని, ఆర్థికశాఖ క్లియరెన్స్ రాగానే చెల్లిస్తామని, ఇప్పటికే కౌలు చెల్లిస్తున్నామన్నారు. ఆయనతో పాటు మునేరు ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొరారు సత్యనారాయణ ప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ విశ్వనాథం, చిట్యారి మల్లేశ్వరరావు, ఉప్పుకొండూరు గురు ప్రసాద్, అబ్బూరు వెంకటేశ్వరరావు, మల్నేడి ప్రసాద్, తోట వెంకటాద్రి, లగడపాటి శ్రీహరిరావు, బోడేపుడి శ్రీహరి ఉన్నారు.

మరో 20 ఏళ్లు చంద్రబాబు అధికారంలో ఉండాలి

తిరుపతి వెంకన్న కొండకు పాదయాత్ర: పెన్మత్స శ్రీనివాసరాజు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు, చిత్రంలో ఎమ్మెల్యే బోడె , కొమ్మారెడ్డి

గుణదల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో గాడితప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరో 20 ఏళ్ల అధికారంలో ఉండాలని ఆకాంక్షిస్తూ తిరుపతి వెంకన్న కొండకు పాదయాత్రగా వెళ్తున్నానని ఎస్ఎల్‌వీ అధినేత పెన్మత్స శ్రీనివాసరాజు తెలిపారు. రామవరప్పాడులోని ఎస్ఎల్‌వీ గ్రీన్ మిడోస్‌లోని రత్న గణపతి ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రియల్‌ఎస్టేట్ రంగాన్ని కుదేలయ్యేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సంస్థలు సైతం నష్టాల్లో కూరుకుపోయి సంస్థలను నడపలేని దుస్థితికి చేరుకున్నాయన్నారు. కూటమి అధికారంలోకి రావడంతోనే చంద్రబాబు మొదటగా రియల్ ఎస్టేట్ రంగానికి బాసటగా నిలిచి పలు రాయితీలు ప్రకటించడంతో తిరిగి నిర్మాణాలు చేపట్టగల్గుతున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతున్న విజన్ గల నేత చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ తిరుపతికి పాదయాత్రగా వెళుతున్నానన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గోకరాజు

ఆర్థికంగా కుదేలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగల సామర్థ్యం గల నేత చంద్రబాబు ఒక్కడేనని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. అటువంటి నేత కూటమి సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలతో మంచి పాలన అందించాలని కోరుకుంటూ ఎస్ఎల్‌వీ అధినేత శ్రీనివాసరాజు తిరుపతికి పాదయాత్రగా వెళ్లడం గర్వించదగిన విషయమన్నారు.

చంద్రబాబుకే నిధులు తెచ్చే సామర్థ్యం: బోడె

నష్టాల ఊబిలో కూరుకున్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం అనేది విజన్ ఉన్న నేత చంద్రబాబుకే సాధ్యమని ఏడాదిలోనే నిరూపించబడిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, ఎస్ఎల్‌వీ సీఈవో, డైరెక్టర్ వెగెశ్న అప్పల నరసింహరాజు (నాని), ఎస్ఎల్‌వీ డైరెక్టర్ ఉప్పుపాటి చైతన్య వర్మ, టీడీపీ రామవరప్పాడు నేతలు కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివనాగరాజు (సాంబు) పాల్గొన్నారు.

పంచాయతీలకు బకాయిల బండ!


(5వ పేజీ తరువాయి)

పైబడి సీఆర్‌డీఏ బకాయిలు పడింది. ఈ బకాయిలు 2016 నుంచి రావాల్సి ఉంది. చూస్తుండగానే కొండలా బకాయిలు పేరుకుపోయాయి. గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల్లో ప్రధానంగా జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామ పంచాయతీలకు సింహభాగం డెవలప్‌మెంట్ చార్జీలను సీఆర్‌డీఏ బకాయి పడింది. ఎన్‌హెచ్ - 65 వెంబడి ఉండే గొల్లపూడి గ్రామ పంచాయతీ, ఎన్‌హెచ్ - 16 వెంబడి ఉండే రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, గూడవల్లి, కేసరపల్లి, గన్నవరం గ్రామ పంచాయతీలు, ఎన్‌హెచ్ - 30 వెంబడి ఉన్న ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామ పంచాయతీలకు సీఆర్‌డీఏ అత్యధిక వాటా బకాయి పడింది.

భారీ నిర్మాణాలతో పెరుగుతున్న విస్తరణ

జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామాల్లో నిర్మాణ రంగం మిగిలిన వాటికంటే ఎక్కువగా ఉంది. ఈ కారణం చేత భారీ గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లు ఏర్పడుతున్నాయి. గొల్లపూడి గ్రామ పంచాయతీలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ నిర్మాణాలు వచ్చాయి. గొల్లపూడి నడిబొడ్డే కాకుండా శివారు ప్రాంతం కూడా భారీ నిర్మాణాలతో విస్తరించింది. ఈ కారణంగా ఒక్క గొల్లపూడి గ్రామపంచాయతీకే డెవలప్‌మెంట్ చార్జీల కింద సీఆర్‌డీఏ రూ. 65 కోట్ల మేర బకాయి పడింది. సింహభాగం వాటా ఒక్క గొల్లపూడి గ్రామ పంచాయతీకే బకాయి పడింది. 2016 నుంచి ఈ బకాయిలు రావాల్సి ఉంది. గొల్లపూడి మేజర్ గ్రామ పంచాయతీ కావటంతో ఆర్థిక వనరులు కలిగి ఉండటంతో ... గత పదేళ్లుగా తన పరిధిలో స్థానికంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. గొల్లపూడి పంచాయతీకి ఎన్నికలు జరగకపోవటంతో .. ఫైనాన్స్ గ్రాంట్స్ కూడా రావటం లేదు. దీంతో గ్రామపంచాయతీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. భారీ అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించరా అంటూ పంచాయతీ అధికారులను నిలదీస్తున్నారు. బకాయిలలో కనీసం రూ. 15 కోట్లు అయినా వచ్చినా .. అత్యవసర మౌలిక సదుపాయాలు చేపట్టాలని గొల్లపూడి గ్రామ పంచాయతీ భావిస్తోంది. రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, గూడవల్లి, గన్నవరం ప్రాంతాలకు కలిపి రూ.10 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని తెలుస్తోంది. ఈ విషయం గ్రామ పంచాయతీల పాలకవర్గాలు కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి ఇటీవల తీసుకువచ్చాయి. గ్రామ పంచాయతీలకు బకాయిలు ఉన్న డబ్బులను తక్షణం విడుదల చేయాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుకు కలెక్టర్ లక్ష్మీశ లేఖ రాశారు. సీఆర్‌డీఏ నుంచి బకాయిలు వస్తాయేమోనని గ్రామ పంచాయతీలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

సమస్యలను ఎలా పరిష్కరించగలం



మా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణ రంగం పతాక స్థాయిలో ఉంది. సీఆర్‌డీఏకు పెద్ద మొత్తంలో డెవలప్‌మెంట్ చార్జీల రూపేణా ఆదాయం వస్తోంది. గ్రామ పంచాయతీకి ఇవ్వాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలు కూడా ఇవ్వటం లేదు. ఎప్పటి నుంచో ఈ డబ్బులను ఇవ్వమని అడుగుతున్నా స్పందన లేదు. రూ. 65 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. గ్రామంలో ఏం చేయాలన్నా.. చేయలేకపోతున్నాం. జాతీయ రహదారి వెంబడి ఉండటం వల్ల వాటి పారిశుధ్య నిర్వహణ అంతా కూడా ఆయా పంచాయతీలే నిర్వహిస్తున్నాయి. పంచాయతీల పరిధిలో ఎన్నో సమస్యలుంటాయి. ఆ సమస్యలను పరిష్కరించాలంటే డబ్బులు కావాలి. మా పంచాయతీ ఉత్తమ అవార్డు సాధించింది. ఇలాంటి పంచాయతీని నిర్లక్ష్యంగా వదిలేస్తే మాకే చెడ్డపేరు వస్తుంది. ఉత్తమ పంచాయతీకైనా బకాయిలు ఇవ్వాలనిపించటం లేదు. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని సీఆర్‌డీఏ నుంచి బకాయిలను ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

- బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ : బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పేదలపాలిట సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు

పటమట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పటమట ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, మ్యాక్స్ విజన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీరరాజు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా దృక్పథం ద్వారా సమాజం పట్ల అంకితభావం కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నుపాటి గాంధీ, రాజేశ్వరీ, గాయత్రీ, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాచవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 4న ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఫిలిం కాలనీ, క్రీస్తురాజుపురం, అరుణ్‌నగర్, మైత్రీ నగర్, దళితవాడ, సంజీవిని హాస్టల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



పుస్తక పఠనం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ స్కూల్స్ విద్యార్థులు

ఫన్‌టైమ్ క్లబ్‌లో సాముహిక పుస్తక పఠనం

భారతీనగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సముపార్జనతో పాటు, మనోవికాసానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని, ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తక పఠనం క్రమక్రమంగా కనుమరుగైపోతుందన్నారు. ఫన్‌టైమ్ క్లబ్ రోడ్డులోని ఫన్‌టైమ్ క్లబ్‌లో పేజ్ క్లబ్ నిర్వాహకులు వేములపల్లి విహన్ సాయి, నిమ్మగడ్డ ఈషాన్ని, అవిర్నేని జైదేవ్ చౌదరి, మోక్షిత, ఆర్ స్వప్న ఆధ్వర్యంలో సాముహిక పుస్తక పఠన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పుస్తక పఠనంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో పేజ్ క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో చిన్నారుల నుంచి వయోవృద్ధుల వరకు, విద్యార్థుల నుంచి వివిధ రంగాల్లో ప్రముఖులు కూడా పాల్గొని పుస్తక పఠనం చేశారన్నారు. కార్యక్రమంలో పేజ్ క్లబ్, ఫన్‌టైమ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘ నేతలపై కేసు

విజయవాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్పొరేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థినిని ప్రేమిస్తున్న ఓ విద్యార్థి వేరే పేరుపై ఇన్‌స్టా అకౌంట్ తెరిచి, దీనికి దిగువన ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని, ఎవరైనా సహాయం చేయాలని రాశాడు. దీన్ని గమనించిన విద్యార్థిని స్నేహితులు విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లికి చెప్పడంతో శనివారం పాఠశాలకు వెళ్లి తన కుమార్తె గురించి ఇన్‌స్టాల్ పోస్టు చేసిన విద్యార్థి సంగతి చూస్తానని హడావుడి చేసింది. ఆమెను తరగతి గదిలోకి వెళ్లనీయకపోవడంతో టీసీ ఇస్తే తీసుకుని వెళ్లిపోతానడంతో పాఠశాల సిబ్బంది టీసీని సిద్ధం చేశారు. ఇది తీసుకోకుండా ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయి ఓ విద్యార్థి సంఘాన్ని ఆశ్రయించింది. తన కుమార్తె టీసీ ఇవ్వడం లేదని చెప్పడంతో విద్యార్థి సంఘ నాయకులు పాఠశాలలో బయోమెట్రిక్ పరికరం, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రావడంతో అక్కడి నుంచి విద్యార్థిని తల్లి తప్పుకుంది. విద్యార్థి సంఘ నేతలపై పోలీసులు చేయి చేసుకున్నారు. తమపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని వేడుకున్న విద్యార్థి సంఘ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయి ప్రభుత్వాసుపత్రిలో చేరారు. పోలీసులు తమపై చేయి చేసుకున్నారని ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) రాయించారు. దీనితో మాచవరం పోలీసులు జరిగిన ధ్వంసంపై కేసు నమోదు చేశారు.

ఘనంగా ఎంపీ కేశినేని చిన్ని పుట్టిన రోజు వేడుక

గవర్నర్‌పేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని నిర్మల హృదయ భవన్‌లో అనాథలకు పండ్లు, బ్రెడ్స్ కేకులు పంపిణీ చేశారు. చిన్ని తనయుడు కేశినేని వెంకట్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. తెలుగు యువత జిల్లా కార్యదర్శి కోటి పాల్గొన్నారు.

పాయకాపురం: ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుక సందర్భంగా ఆదివారం టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో వాంబే కాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ విజయవాడ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. సూరవరపు నాగరాజు, పరుచూరి ప్రసాద్, దాసరి కనకారావు, ఆకుల సూర్యప్రకాష్, పుల్లగూర చరణ్‌సాయి, పాల్గొన్నారు.

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఖాళీ స్థలాలు

- నివాసాల మధ్య నిలిచిపోతున్న నీరు
- వెదజల్లుతున్న దుర్గంధం
- భయాందోళనలో స్థానికులు

రామలింగేశ్వరనగర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిల్వ, డ్రెయిన్లు అస్తవ్యస్తంగా తయారైయ్యాయి. 15వ డివిజన్ మాదు తిరుపతిరావు నగర్ 2వ లైన్‌లో కురుస్తున్న వర్షాలకు నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోతున్నాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలగా అవి మారుతున్నాయని పరిసరాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు ఎక్కువ రోజులు అలా నిలిచిఉండటంతో పచ్చ రంగులోకి మారుతున్నాయి. కనీసం డ్రెయినేజీలను కూడా శుభ్రపరుస్తున్న దాఖలాలు లేవు. దీంతో మురుగు దుర్గంధం వెదజల్లుతుంది. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులంటున్నారు. ఖాళీ స్థలంలోనే చెత్తా, చెదారం, వ్యర్థాలు పడవేస్తున్నారు. పందులు సంచరిస్తున్నాయి. కలరా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులుప్రబలే ప్రమాదముందని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిల్వ ఉన్న వర్షపు నీటిని శుభ్రపరిచాలి.



నివాసాల మధ్య ఖాళీ స్థలంలో పసర్లు కమ్మిన వర్షపు నీరు

నీరు తొలగించాలి



నివాసాల మధ్యనే ఉన్న ఖాళీస్థలంలో వర్షపు నీరు పాకుడు పట్టి పచ్చ రంగు దాల్చి నిల్వ ఉన్న పట్టించుకునే వారు లేరు దీనివలన దోమలు వృద్ధి చెంది కలరా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు భారిన పడే ప్రమాదముంది తక్షణమే అధికారులు స్పందించాలి.

- ఏడుకొండలు, స్థానికుడు

దుర్గంధం భరించలేకపోతున్నాం



డ్రెయిన్లు శుభ్రపరచకపోవడం వలన పేరుకు పోయిన మురుగు దుర్గంధం వెదజల్లుతూంది. దుర్వాసన భరించ లేకపోతున్నాము. ఖాళీగా ఉన్న స్థలంలోనే చెత్తా, చెదారం,వ్యర్థాలు పడవేస్తున్నారు. అందులోనే పందులు సంచరిస్తున్నాయి.

- రవితేజ, స్థానికుడు

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మాచవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు తనకున్న పాలనానుభవం, సమర్థతతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నాయకులు అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 6.వ డివిజన్‌లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగులో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. ఇద్దరికి జీవనోపాధి నిమిత్తం రూ.45 వేలతో టిఫిన్ బండి, ఇస్త్రీ బండిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కామ్‌లో డబ్బులు లెక్కిస్తున్న వీడియోలు చూపించినా కేసుతో మాకేమి సంబంధం లేదని వైసీపీ నేతలు బుకాయిస్తున్నారన్నారు. ప్రత్యేక విమానాల్లో డబ్బులు విదేశాలకు తరలించారన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్, అమిర్నేని కరుణ కుమారి, పల్లి దుర్గాప్రసాద్, వడ్డేపల్లి కేశవ్, మొకర గురునాథం, పిట్టల గోవింద్, సోమినాయుడు, వడ్డీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న గద్దె రామ్మోహన్

వేంకటేశ్వరస్వామి చల్లగా చూడాలి

పటమట : శ్రీవేంకటేశ్వరస్వామి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తిరుపతికి కాలినడకన బయలుదేరిన ఎస్‌ఎల్‌వీ శ్రీనివాసరాజుకు గద్దె రామ్మోహన్ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో నిర్మలా కాన్వెంట్ సిగ్నల్స్ వద్ద స్వాగతం పలికారు. ఈసందర్భంగా శ్రీనివాసరాజును గద్దె రామ్మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని రక్షించడానికి కూటమి ప్రభుత్వం రావాలని ఎన్నికల సమయంలో శ్రీనివాసరాజు శ్రీవారిని మొక్కుకున్నాడన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది కాలినడకన స్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గత ఏడాది కూడా తిరుపతి వెళ్ళి మొక్కు చెల్లించుకున్నాడని, ఈఏడాది కూడా తిరుపతి వెళుతున్న శ్రీనివాసరాజును అభినందించారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి

వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్‌భవన్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన ఆరుగురు లబ్ధిదారులకు 8,30,482 రూపాయల చెక్కులను ఎంపీ కేశినేని చిన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద, బడుగు బలహీనవర్గాల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. నాయకులు ఎం.జయప్రకాష్, కార్పొరేటర్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

ఆంధ్రా ఆసుపత్రిలో అత్యధికంగా చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు

- కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధికంగా నెలకు 50 నుంచి 60 చొప్పున సంవత్సరానికి 600 మంది పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు చేసున్నట్టు ఆంధ్ర హార్ట్ అండ్ బ్రెయిన్ ఆసుపత్రి కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఆంధ్ర ఆసుపత్రిలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటివరకు 4800 శస్త్రచికిత్సలు, ఇంటర్వెన్షన్స్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. పిడియాట్రిక్ కార్డియాలజీ టీం డాక్టర్ విక్రమ్, నవజాతి శిశువులు, పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందం వలనే ఇది సాధ్యపడిందన్నారు. పిడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ బి.ఆర్.జగన్నాథ్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో హీలింగ్ లిటిల్‌హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో 35వ ఉచితంగా పిల్లల గుండెసర్జరీల క్యాంపు గత నెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 11 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కార్డియాక్ ఎనస్తీటిస్ట్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రఘురాం, డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ , శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం కానూరులో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరానికి షుమారు 550 మందికి పైగా స్థానికులు, వృద్ధులు హాజరై కంటి వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. 33వ డివిజన్ అధ్యక్షుడు సుంకర సాయి అధ్యక్షతన జరిగిన ఈ కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బోడె సతీమణి హేమచౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, బోడె వెంకట్రామ్‌లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శంకర ఐ ఫౌండేషన్ వైద్యులు చరిత, తన్మయి పరీక్షలు నిర్వహించారు.



కాకాని విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాధవ్, కాకాని తరుణ్

మహనీయులను స్మరించుకోవాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పటమట, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మన ప్రాంత అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తులను స్మరించుకోవడం మన కర్తవ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. కాకాని ఆశయ సాధన సమితి కమిటీ అధ్యక్షుడు తరుణ్ కాకాని ఆధ్వర్యంలో కాకాని వెంకటరత్నం జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాధవ్ మాట్లాడుతూ కాకాని వెంకటరత్నం వ్యవసాయ అభివృద్ధి కోసం విశేష కృషి చేశారన్నారు. స్వతంత్ర్య ఉద్యమ సమయంలో మహాత్మాగాంధీని తమ సొంత ఊరికి తీసుకువచ్చారన్నారు. తెలుగు ప్రజల ఉనికి కోసం జై ఆంధ్ర ఉద్యమం నడిపారన్నారు. కాకాని తరుణ్ మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా కాకాని పనిచేశారని, జై ఆంధ్ర ఉద్యమంలో విశేష కృషి చేశారని, ఉక్కు పోరాటాన్ని ముందు ఉండి నడిపించడంతో ఆయనను ఉక్కు కాకానిగా పిలిచారన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బొల్లినేని కీర్తిని, మదర్ థెరెస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు గోగినేని ధనశేఖర్‌ను మాధవ్ ఘనంగా సత్కరించారు. మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ నేతలు అడ్డూరి శ్రీరామ్, పోతంశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఆఫ్‌టెర్రస్ గార్డెన్ సొసైటీ సేవలు అభినందనీయం

మొగల్రాజపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ (సీటీజీ) స్వచ్ఛందంగా మొక్కలు పెంపకం, వంటింటి వ్యర్థాల ద్వారా కంపోస్టు తయారీ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అని స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. సీటీజీ నాల్గో వార్షికోత్సవం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్టాభి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛంద్ర కార్యక్రమాలో సీటీజీ కూడా భాగస్వామ్యం కావాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో పండించే కూరగాయల అమ్మకానికి తగిన వసతి కల్పిస్తామన్నారు. వక్కలగడ్డ భాస్కర్‌రావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో పీవీడీ నాగేశ్వరరావు, గూడవల్లి సురేష్‌బాబు, కోగంటిశ్రీదేవి, సేగుసుజాత, సీటీజీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి



కళాశాల అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భారతీనగర్, ఆగస్టు 3: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాలలో ఆదివారం జరిగింది. ఈ సభకు ప్రిన్సిపాల్ ఎం.విజయసారధి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశా ల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే పూర్వ విద్యార్థులు సహాయం అందిస్తూ కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. పూర్వ విద్యార్థులు నీలకంఠేశ్వరరావు రూ.25 వేలు, ఎన్. పాపారావు రూ.10వేలు, సాగి కాంతారావు, రూ.10వేలు, వై.దేవేంద్రప్రసాద్ రూ.5 వేలు ను కళాశాల అభివృద్ధికి విరాళంగా అందించారు. సమ్మేళనంలో 1962 సంవత్సరం నుంచి చదువుకున్న విద్యార్థులు పాల్గొని అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అల్యూమిని అసోసియేషన్ కమిటీ సభ్యుడు ఎం.వి.బాబు, ఎన్.గోపీచందు, బి.శ్రీనివాస రెడ్డి , భానుమూర్తి, కోట్లయ్య, దేవరకొండ వెంకటేశ్వర్లు, మధు, కోనేరు బోస్, శేషయ్య, సుబ్బారావు, రామకృష్ణ, పరమహంస, నీలకంఠేశ్వరరావు, వినయ్ పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం సోమవారం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేయవచ్చన్నారు. వివరాల కోసం 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

దిక్సూచి



క్యాట్ 2025

దేశంలోని ప్రీమియర్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్‌కు ఉద్దేశించిన 'కామన్ అడ్మిషన్ టెస్ట్'(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎమ్) మాత్రమే కాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ-ఢిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లోని ఎంబీఏ కోర్సులు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ల కోసం కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహించనున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఎంట్రెన్స్‌కు గత సంవత్సరం 2.93 లక్షల మంది హాజరయ్యారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగులకు 45 శాతం చాలు.

పరీక్ష విధానం: గత సంవత్సరం ప్రశ్నపత్రం ఇలా ఉంది. మొత్తం మార్కులు 204. మొత్తం ప్రశ్నలు 68. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 48, నాన్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 20. ప్రతీ విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం సమయం రెండు గంటలు ఉంటుంది. ఎంసీక్యూలకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయి. నాన్ ఎంసిక్యూలకు నెగెటివ్ మార్కులు లేవు.

- వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ - 24 ప్రశ్నలు
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ - 22 ప్రశ్నలు
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ - 22 ప్రశ్నలు

ఈ సంవత్సరం కూడా పెద్దగా మార్పులు లేకుండా ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు సిద్ధం అయితే మంచిది.

ప్రిపరేషన్ టిప్స్: భారతదేశంలో అత్యంత పోటీ ఉన్న పరీక్షల్లో 'క్యాట్' ఎంట్రెన్స్ ఒకటి. వంద పర్సంటైల్ ఉన్నవారికి కూడా అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. సీటు సాధించడంలో పర్సంటైల్‌తోపాటు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పరీక్షలో మంచి మార్కులు వస్తేనే ఆ దశకు చేరుకోగలుగుతారు. అందుకోసం కొన్ని మెలకువలను పాటించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్: క్యాట్ ప్రిపరేషన్‌లో ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రతీ సెక్షన్ సమాధానాలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అందుకోసం ప్రిపరేషన్ సమయంలో స్పీడ్, ఆక్యురసీపై బాగా దృష్టిపెట్టాలి.

షార్ట్‌కట్ టెక్నిక్: నిర్ణీత సమయంలో సమాధానాలు గుర్తించాలంటే షార్ట్‌కట్ పద్ధతులు అనుసరించాల్సిందే. ప్రిపరేషన్ సమయంలో మెంటార్లు చెప్పే మెలకువలను బాగా గుర్తుంచుకుని పాటించాలి. ముఖ్యమైన వాటిని ఒక దగ్గర రాసుకుని తరచుగా రివ్యూ చేసుకుంటూ ఉండాలి.

గత ప్రశ్నపత్రాలు సాల్వ్ చేయడం: గత సంవత్సరాల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం ద్వారా డిఫికల్టీ లెవెల్ బాగా అర్థం అవుతుంది. అలాగే మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల నిర్ణీత సమయంలో సాల్వ్ చేయగలుగుతున్నారా లేదా అనేది చెక్ చేసుకోగలుగుతారు. అలాగే తమ బలాలు, బలహీనతలు తెలుస్తాయి.

- క్యాట్‌లో మరో ముఖ్యమైన విషయం ఏమంటే చాయిస్ ఆఫ్ క్వశ్చన్స్. అటెంప్ట్ చేయకముందే దానిని పూర్తి చేయగలం అనే నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే దానిని సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.
- వొకాబులరీ, రీడింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలు, అందులోని ఎడిటోరియల్స్, జర్నల్స్ క్రమం తప్పకుండా చదవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 13
పరీక్ష తేదీ: 2025 నవంబర్ 30
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: https://iimcat.ac.in

ఐబీపీఎస్‌లో 10,277 క్లర్క్ పోస్టులు

క్లర్క్ పోస్టుల భర్తీకి 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్'(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం 10,277 పోస్టులు ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 261, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ సర్టిఫికెట్ లేదా స్కూలు, కాలేజీలో కంప్యూటర్ సబ్జెక్ట్ అయినా ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుంది. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

పరీక్ష విధానం: ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 60 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి వంద మార్కులు ఉంటాయి.

ఇంగ్లిష	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు

ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్షకు పిలుస్తారు. ఇది కూడా ఆబ్జెక్టివ్ పరీక్షనే. ఇక్కడ 200 మార్కులు 155 ప్రశ్నలు ఉంటాయి. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40 ప్రశ్నలు	50 మార్కులు	20 నిమిసాలు
జనరల్ ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	40 ప్రశ్నలు	60 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్	35 ప్రశ్నలు	50 మార్కులు	30 నిమిషాలు

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఆగస్టు 2 నుంచి 2005 ఆగస్టు1 లోపు జన్మించి ఉండాలి(రెండు తేదీలను కలుపుకొని). ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు, వితంతువులు/ విడాకులు పొందిన మహిళలు 35 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాజీ మిలిటరీ ఉద్యోగులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఖాళీలు ఉన్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

దరఖాస్తు ఫీజు: రూ.850/-. ఎస్సీ/ ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎమ్/డీఈఎస్ఎమ్ అభ్యర్థులకు రూ.175/-.
ప్రిలిమినరీ పరీక్ష: 2025 అక్టోబర్
మెయిన్స్ పరీక్ష: 2025 నవంబర్
చివరి తేదీ: 2025 ఆగస్టు 21

వెబ్‌సైట్: ibps.in

జాబ్ కార్నర్

పదో తరగతితో ఐబీలో..

మొత్తం ఖాళీలు 4,987

కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో తెలంగాణకు 117 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు 115 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. స్థానిక భాష రాయడం, మాట్లాడడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 17 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు వయో పరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం:

టైర్-1: వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఉంటుంది. 60 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాలి. ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/అనలిటికల్, లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: యాభై మార్కులకు భాషా అనువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి ఒక గంట. ఇది క్వాలిఫైయింగ్ టెస్ట్ మాత్రమే.

టైర్-3: ఇంటర్వ్యూ యాభై మార్కులకు ఉంటుంది.

చివరి తేదీ: ఆగస్టు 17 **వెబ్‌సైట్:** www.mha.gov.in/en

ఎయిమ్స్ & ఇతర సంస్థల్లో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)తోపాటు, ఇతర జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ పోస్టుల భర్తీ జరగనుంది. ఎయిమ్స్, జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా నింపనున్నారు.

అర్హత: బీఎస్సీ నర్సింగ్/ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతోపాటు, కనీసం 50 పడకల ఆస్పత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్‌లను బట్టి సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 ఆగస్టు 11
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్14న స్టేజ్-1 పరీక్ష, 2025 సెప్టెంబర్ 27 స్టేజ్-2 పరీక్ష.
వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది

- సత్యదేవ్



'కింగ్‌డమ్' సినిమా మొదటి ఆట చూసినప్పటి నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. నటుడిగా నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది' అని సత్యదేవ్ అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రేక్షకాదరణతో కొనసాగుతోన్న సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సత్యదేవ్ మీడియాతో మాట్లాడారు. 'శివ పాత్ర కోసం దర్శకుడు గౌతమ్ మొదట నా పేరే రాసుకున్నారట. కథ నచ్చి వెంటనే ఓకే చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. 'కింగ్‌డమ్'లో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక..ఆ కష్టమంతా మరచిపోయాను' అని సత్యదేవ్ చెప్పారు.

వేతన పెంపు లేకుంటే షూటింగ్స్ బంద్

- ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం

వేతనాలు పెంచేవరకూ 24 కార్మిక సంఘాలు షూటింగ్స్‌లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వేతనాల పెంపు డిమాండ్‌పై చర్చించేందుకు ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ సర్వసభ్యసమావేశం నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. నేటి (ఆగస్టు 04) నుంచి 30 శాతం వేతనాలు పెంచుతామని హామీ పత్రం ఇచ్చిన నిర్మాతల షూటింగ్స్‌కు మాత్రమే వెళ్లాలి, వేతనాల పెంపు అమలు చేయని సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని తీర్మానించింది. పెంచిన వేతనాలను ఏ రోజుకారోజే చెల్లించే విధానం అమలు చేయాలనీ, ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతనే షూటింగ్స్‌లో పాల్గొనాలని 24 కార్మిక సంఘాలకు తెలిపింది.

కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం

ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఫిల్మ్ ఛాంబర్ స్పందించింది. 'ఫెడరేషన్ పక్షపాతంతో 30 శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేనివారికి కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం. ఈ సమ్మె నిర్ణయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఫెడరేషన్‌తో కలసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అంతవరకూ నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్యలు గానీ సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు గానీ చేసుకోకుండా ఛాంబర్ మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం ఐక్యతతో ఉండాలి. మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

ఈ సినిమాను పవన్ చూడాలి

- నిర్మాత అల్లు అరవింద్



'మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారు. 'మహావతార్ నరసింహ' సినిమాని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్ నరసింహ' సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'భారతదేశమంతటా ప్రేక్షకులు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

నవ్వుల పండగ



కన్నడనాట ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న చిత్రం 'సు ఫ్రమ్ సో'. తాజాగా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈనెల 8న మైత్రీ మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. జేపీ తుమినాడ్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించారు. షనీల్ గౌతమ్, సంధ్య అరకెరె ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్.బి.శెట్టి, శశిధర్ శెట్టి బరోడా, రవిరాయ్ కలస నిర్మించారు. ఆసక్తికరమైన కథ, కథనంతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వుల పండగను అందిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

యువతా నీ గమ్యం ఎటు వైపు?



హీరో కృష్ణసాయి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డేంజర్'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు? అంటూ సందేశాత్మకంగా సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యవంతమైన గీతాన్ని రూపొందించాం. మా ప్రయత్నాన్ని గవర్నర్లు, పోలీస్ అధికారులు ప్రశంసించారు. ఈ సినిమా ప్రజలను ప్రభావితం చేస్తుంది. యువతలో మార్పు తీసుకొస్తుందనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

కొరియోగ్రాఫర్ కృష్ణపై పోక్సో కేసు

టాలీవుడ్‌లో మరో లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలపై కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లయిన మహిళతో కృష్ణ మాస్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, ఈ క్రమంలో ఆమె కూతురిపై కూడా కృష్ణ లైంగిక దాడి చేశాడంటూ సదరు మహిళ జూలై 9న ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ముగింపును మార్చడం నన్ను బాధించింది

- ధనుష్



ధనుష్ కథానాయకుడిగా ఆనంద్.ఎల్.రాయ్ తెరకెక్కించిన 'రాంఝనా' 2013లో విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులోని పాటలు, భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకోగా, ముగింపు చాలా మందిని కంటతడి పెట్టించింది. ఇటీవలె ఈ సినిమాను తమిళనాడులో రీ రిలీజ్ చేశారు. అయితే, ఏఐ సాయంతో ఇందులోని క్లైమాక్స్‌ను నిర్మాతలు మార్చారు. 2013లో విడుదలైన ఒరిజినల్ వెర్షన్ ముగింపులో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిన హీరో చికిత్స తీసుకుంటూ చనిపోతాడు. అయితే, కొత్తగా విడుదల చేసిన వెర్షన్‌లో హీరో కోలుకున్నట్టు చూపించారు. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వెర్షన్ చూసిన ఫ్యాన్స్ కొందరు ఆనందం వ్యక్తం చేస్తుండగా, దీనిపై ధనుష్, ఆనంద్.ఎల్.రాయ్‌తో పాటు మరికొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ సినిమా ముగింపును మార్చడం నన్ను కలచి వేసింది. క్లైమాక్స్ మార్పు, సినిమా ఆత్మను దెబ్బతీసింది. నేను వద్దంటున్నా ఈ రీ రిలీజ్‌కు ముందుకెళ్లారు. 12 ఏళ్ల క్రితం నేను చేసిన సినిమా ఇది కాదు. ఇలా ఏఐతో సినిమా కంటెంట్‌ను మార్చడం కళతో పాటు కళాకారులకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పనులు కథ చెప్పే విధానానికీ, సినిమా వారసత్వానికీ ప్రమాదకరం. భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను' అని ధనుష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలా కృత్రిమ మేధ సాయంతో సినిమా కంటెంట్‌ను మార్చే ప్రయత్నం అర్థరహితమైంది. 12 ఏళ్లుగా ఈ సినిమాను తమ హృదయాల్లో పదిలంగా దాచుకున్న అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేయడమే' అని ఆనంద్.ఎల్.రాయ్ విమర్శించారు.

అలరించే కామెడీ థ్రిల్లర్



ప్రవీణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్ జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో హీరో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. 'బకాసురు రెస్టారెంట్' ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో హీరోగా పెట్టి సినిమా తీసిన మా దర్శక నిర్మాతలకు నా ధన్యవాదాలు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది' అని చెప్పారు. దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

పర్యావరణానికి మేలు చేసే అడవి జామ!



చాలా మందికి పర్యావరణానికి మేలు కలిగించే ఏదో ఒక పని చేయాలని ఉంటుంది. అలాంటి వారు తమ చుట్టుపక్కల ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో అడవి జామ మొక్కను నాటితే చాలు. సీతాకోకచిలుకలు, రకరకాల పక్షులు దాని మీదకు చేరతాయి. దీని ఆకులు చిన్న చిన్న గాయాలు మాన్పటానికి ఔషధంలా కూడా ఉపయోగపడతాయి.

అడవి జామ ఆకులు పెద్దగా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ ఆకులు రాలిపోయే ముందు ఎర్రగా అవుతాయి. ఈ మొక్క పువ్వులు పింక్ రంగులో పెద్దగా ఉంటాయి. సాధారణంగా వేసవిలో ఈ మొక్కకు కాయలు కాస్తాయి. ఈ కాయల్లో ఎక్కువ గింజలు ఉంటాయి. ఈ కాయలు పళ్లుగా మారిన తర్వాత వీటిలోపల ఉన్న గింజలను పక్షులు తింటాయి. కొన్నింటిని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పడేస్తాయి. వాటి నుంచి కూడా మొక్కలు వస్తాయి. ఇలా ఒక ప్రాంతంలో ఉన్న పర్యావరణ చక్రాన్ని నిరంతరం కాపాడటంలో అడవి జామ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఆదివాసీ ప్రాంతాల్లో ఈ చెట్టు పువ్వులతో పచ్చడి చేసుకుంటారు. ఆకులను నూరి చిన్న చిన్న గాయాలపై పూస్తే అవి వెంటనే తగ్గిపోతాయి. ఆయుర్వేద మందుల్లో కూడా అడవి జామను వాడతారు.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

పువ్వులతో అందం!



అమ్మాయిలు సున్నితం అని చెప్పడానికి వారిని పువ్వులతో పోల్చుతారు. పూలను సౌందర్య ఉత్పత్తుల తయారీలో వాడతారు. అయితే ఇంటి పెరట్లో పెంచుకునే పువ్వులు కూడా అనేక చర్మ సమస్యలను దూరం చేసి సొగసుకు సొబగులు అద్దుతాయి. ఆ సంగతులివీ..

● కేశాల సంరక్షణలో ముందుండే మందార పూలు చర్మ సంరక్షణకూ తోడ్పడతాయి. ఇందులోని విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై మచ్చలను, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. విటమిన్ సి చర్మం నిగారించేలా చేస్తుంది. మందారపూలను రుబ్బి ఫేస్‌ప్యాక్ వేసుకుంటే పలు చర్మ సమస్యలు దూరమవుతాయి.

● మల్లెపూలు సుగంధాలను వెదజల్లడంతో పాటు చర్మ ఆరోగ్యానికీ సహాయపడతాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు మొటిమలు, మచ్చలను నివారిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షణ కల్పిస్తాయి. మల్లెపూలు చర్మంపై దురద, వాపు, మచ్చలు వంటి సమస్యలు దూరం చేస్తాయి. మల్లెపూలను రుబ్బి ఆ పేస్టులో కొంచెం కొబ్బరి నూనె కలిపి ఫేస్‌ప్యాక్ వేసుకుంటే చర్మం నిగారిస్తుంది.

● బంతి పూలలో యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలం. ఇవి చర్మంపై గాయాలను మాన్పుతాయి. ముడతలు, వృద్ధాప్య ఛాయలను నివారించడంలోనూ బంతిపూలు ఉపయోగపడతాయి. బంతిపూలను మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేసుకుని ముఖానికి రాసుకోవాలి.



విభిన్నం

సహజసిద్ధమైన రంగులు... సంప్రదాయ డిజైన్లు... నవీనతకు సాక్ష్యాలు పుట్టపాక చేనేతలు. తేలియా రుమాల్... డబుల్ ఇక్కత్ పట్టు చీరలు... ఇక్కడి కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న వస్త్రాలు... వేటికవే ప్రత్యేకతను చాటే అపురూపాలు.

ఈ అరుదైన కళను విశ్వవ్యాప్తం చేసి... చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తేవడంలో విశేష కృషి చేస్తున్నారు **గజం నర్మదానరేందర్**. ఇందుకుగానూ ఆమెకు ఇటీవల కేంద్ర చేనేత, జౌళి శాఖ మార్కెటింగ్ విభాగంలో జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది.

ఈ సందర్భంగా 'జియోగ్రాఫికల్ ఇండెక్స్' (జీఐ) కూడా పొందిన పుట్టపాక వస్త్రం విశేషాల సమాహారం 'నవ్య'కు ప్రత్యేకం.

ప్రకృతి రంగుల పుట్టపాక చీర



యాదాద్రి భువనగిరి జిల్లా... సంస్థాన్ నారాయణపురం మండలం... పుట్టపాక గ్రామం. ఇక్కడ వెయ్యి కుటుంబాలు చేనేత పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రాచీన కాలంనాటి తేలియా రుమాలుతో పాటు డబుల్ ఇక్కత్ పట్టు చీరలు ఈ ప్రాంతంలో తయారవుతున్నాయి. ఇక్కడ ప్రతి కార్మికుడూ ఒక అద్భుత కళాకారుడే. మగ్గంపై నేసే ప్రతి వస్త్రమూ దేనికదే ప్రత్యేకతను చాటుతుంది. సృజనాత్మక డిజైన్లను రూపొందించడంలో ఇక్కడి కార్మికులు దిట్టలు. ప్రస్తుతం చీరలతోపాటు దుపట్టాలు, డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ తయారు చేస్తున్నారు.

ఆరు నెలల శ్రమ...

తేలియా రుమాల్ చీర తయారీకి నాణ్యమైన పత్తి నుంచి తీసిన నూలు ఉపయోగిస్తారు. కరక్కాయ పొడి లాంటి ప్రకృతిసిద్ధమైన పదార్థాలతో ఆ నూలును శుద్ధి చేస్తారు. బంతి పూలు, దానిమ్మ పండ్లు, కొత్తిమీర, ఉల్లిగడ్డ పొట్టు, వివిధ మొక్కల ఆకులు, వేర్లు, వనమూలికలతో రంగులు తయారు చేస్తారు. సహజసిద్ధమైన రంగులను మల్బరీ పట్టు దారానికి అద్ది... తేలియా రుమాల్‌తో పట్టుచీర రూపొందిస్తారు. డబుల్ ఇక్కత్ పద్ధతిలో డిజైన్లు, కొన్ని చిహ్నాలను ఎంపిక చేసుకుని గ్రాఫ్ తయారు చేస్తారు. డిజైన్లు గడుల్లో ఇమిడి, ఏడు గజాల చీర పొడవునా రావడానికి... 135 పాయలతో చిటికి తయారు చేస్తారు. అంగుళానికి 72 పోగులు వచ్చేలా చూస్తారు. ఎంతో శ్రద్ధగా, ఓపిగ్గా చేయాల్సిన ప్రక్రియ ఇది. ఒక చీర రూపొందించడానికి ఆరు నెలల సమయం పడుతుంది. వైవిధ్యమైన తేలియా రుమాల్‌కు భౌగోళిక సూచీ (జీఐ: జియోగ్రాఫికల్ ఇండెక్స్) కూడా లభించడం మరో విశేషం.

దేశవిదేశీ ప్రతినిధుల అధ్యయనం...

హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న పుట్టపాక చేనేత కళను అధ్యయనం చేసేందుకు దేశవిదేశీ ప్రతినిధులు వస్తుంటారు. నిఫ్ట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఫ్యాషన్ డిజైనర్లు వీరిలో ఉన్నారు. పుట్టపాకలో మగ్గంపై నేసిన వస్త్రాన్ని... అపురూప కళాఖండాలను భద్రపరిచే లండన్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. అమెరికా అధ్యక్షుడి భవనం వైట్‌హౌస్‌లో ఇక్కడ తయారు చేసిన వస్త్రాన్ని అలంకరణకు ఉపయోగిస్తున్నారు. దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో ఈ చేనేతలు ప్రదర్శిస్తుంటారు. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారు చేసిన ఘనత ఇక్కడి కళాకారులది. గ్రామానికి చెందిన గజం గోవర్ధన్, గజం సత్యనారాయణ పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. పుట్టపాక నుంచి ఇప్పటివరకు 30మంది కళాకారులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి.

మరో ఇద్దరికి...

ఇటీవలే పుట్టపాకకు చెందిన ఇద్దరు కళాకారులు కేంద్ర చేనేత, జౌళి శాఖ ప్రకటించిన జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. ఇక్కత్ వస్త్రాల తయారీలో నూతన పద్ధతులు అవలంబించి, కొనుగోలుదారులను ఆకట్టుకొంటున్న గజం నర్మదానరేందర్‌కు చేనేత మార్కెటింగ్ విభాగంలో అవార్డు దక్కింది. అదేవిధంగా సహజసిద్ధమైన రంగులతో తేలియా రుమాల్, డబుల్ ఇక్కత్ డాబీబోన్ చీర, డబుల్ ఇక్కత్ డాబీబోన్ దుప్పటి తయారు చేసిన గూడ పవన్ యంగ్ వీవర్ విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆరు నెలల పాటు శ్రమించి... 6.25 మీటర్ల పొడవు, 46 ఇంచుల వెడల్పుతో పవన్ తయారు చేసిన ఈ చీరలో... తేలియా రుమాల్‌కు సంబంధించి 16 ఆకృతులు ఉన్నాయి. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

- యాదాద్రి, ఆంధ్రజ్యోతి

ఉపాధి కల్పిస్తూ... కళను కాపాడుతూ...




చేనేత కళను కాపాడుతూ, నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. అందులో భాగంగా మహిళల అభిరుచులకు తగ్గట్టు సంప్రదాయ డిజైన్లను నవీకరిస్తూ, విభిన్న శ్రేణుల చీరలు రూపొందిస్తున్నాం. తేలియా రుమాల్ వస్త్రాలను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేయడంతో లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన మా వ్యాపారం ఇప్పుడు కోట్లల్లో టర్నోవర్ జరుగుతోంది. మా వద్ద రూ.10 వేల నుంచి రూ.75 వేల ధర పలికే చీరలు ఉన్నాయి. సీజన్, ఆర్డర్లను బట్టి చీరలు తయారు చేస్తాం. ప్రస్తుతం 300 మగ్గాలపై పని జరుగుతోంది. ఈ వృత్తిపై ఆధారపడిన చేనేత కుటుంబాలన్నీ ఆర్థికంగా నిలదొక్కుకోనేందుకు అవసరమైన పని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నా సేవలు గుర్తించి, కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది. ఇది నా ఒక్కదాని ఘనత కాదు. నాకు చేయూత అందించిన నా భర్త, చేనేత రంగం గురువులు, కళాకారులు అందరిదీనని భావిస్తున్నాను.

- గజం నర్మదానరేందర్

మార్పు కోసమే ఈ స్టార్టప్...





అగ్ని ప్రమాదాలకు కారణమౌతున్న వ్యర్థాల నిర్వహణ, పంట దిగుబడి పెంచడం, మహిళలకు ఉపాధి కల్పన...

వీటన్నిటికీ ఒక స్టార్టప్‌తో పరిష్కారం చూపించారు మేఘా సక్సేనా.

వైద్య వృత్తిని వదిలేసి పల్లె బాట పట్టిన ఆమె... ఇది తాను కోరుకుంటున్న మార్పు దిశగా ఒక చిన్న అడుగు మాత్రమేనంటున్నారు.

"మా ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని దేవభూమి అని పిలుస్తారు. దాదాపు 71 శాతం అడవులున్న రాష్ట్రం మాది. ఈ అడవుల్లో పదహారు శాతానికి పైగా పైన్ చెట్లు ఉన్నాయి. పైన్ చెట్ల ఆకులు సూది మొనల్లా ఉంటాయి. అందుకే వాటిని 'పైన్ నీడిల్స్' అంటారు. అవి ఎండిపోయి, నేల మీద పడి, అక్కడే పేరుకుపోతాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు చాలా వేగంగా వ్యాపించడానికి అవి ప్రధాన కారణం. రాష్ట్రంలో గత పాతికేళ్ళుగా... సంభవించిన అగ్ని ప్రమాదాల్లో లక్షన్నర ఎకరాలకు పైగా అడవులు దగ్ధమైపోయాయి. ఇది పర్యావరణానికి, వృక్ష జాతుల వైవిధ్యానికి, ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రమాదకరం. ఆ ప్రాంతంలో పుట్టి పెరిగిన నాలాంటివారందరికీ ఈ సమస్య తీవ్రత తెలుసు. కానీ దీనికి పరిష్కారం ఎలా? అనేదే ప్రశ్న.

నా వంతుగా...

'డాక్టర్' అని పిలిపించుకోవాలని, పేదలకు సేవ చేయాలని నా ఆశయం. దానికోసం ఎంతో కృష్టపడ్డాను. ఎంబీబీఎస్ పూర్తి చేశాక... అల్మోరాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిగా పని చేశాను. గ్రామాల్లో వైద్య శిబిరాలు కూడా నిర్వహించాను. గ్రామస్తుల ఇబ్బందులు మరింత స్పష్టంగా తెలుసుకొనే అవకాశం వాటిద్వారా కలిగింది. పంట దిగుబడిని పెంచడం కోసం ఎరువులు, పురుగుల మందులు కొనే స్తోమత చాలామంది రైతులకు లేదు. అలాగే సంప్రదాయికమైన సాగు పద్ధతులనే వారు పాటిస్తూ ఉంటారు. ఇక... మహిళలకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆర్థిక స్వావలంబనకు దూరంగా ఉన్నారు. 'వారికి నా వంతుగా ఏదైనా చెయ్యగలనా?' అని ఆలోచిస్తున్న సమయంలో... కొవిడ్ వచ్చింది. అప్పుడు నేను గర్భవతిని కావడంతో విధులకు సెలవు తీసుకున్నాను. ఆ తీరిక సమయంలో... పైన్ ఆకులు, వాటి ప్రయోజనాల గురించి అధ్యయనం చేశాను. వాటితో పౌల్ట్రీలు, చేపల పెంపకానికి ఆహార సప్లిమెంట్లను, వ్యవసాయం కోసం బయో ఫెర్టిలైజర్స్‌ను తయారు చేయవచ్చని తెలిసింది. మరిన్ని వివరాల కోసం కొందరు నిపుణులను సంప్రతించాను. వారి ప్రోత్సాహంతో... ఉద్యోగం వదిలేసి, 2021లో 'ఎకోఛార్' అనే స్టార్టప్ ప్రారంభించాను.

ఫలితాలు నిర్ధారించాక...

మా ఉత్పత్తుల్లో బయోఛార్, ఉడ్ వెనిగార్ ప్రధానమైనవి. ఎండిపోయిన పైన్ ఆకులను ప్రత్యేకమైన పద్ధతుల్లో, నిర్దిష్టమైన ఉష్ణోగ్రత దగ్గర కాల్చితే బొగ్గు తయారవుతుంది. ఈ ప్రక్రియలో పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఆ బొగ్గును ఉపయోగించడం వల్ల నేల సారవంతం అవుతుంది. రసాయనాలు, పురుగు మందుల వాడకం వల్ల నేలలో విషపూరితమైన అవశేషాలు మిగిలిపోతాయి. ఈ బొగ్గు వినియోగం వల్ల ఆ సమస్య ఉండదు. దిగుబడి ఎక్కువగా వస్తుంది. అలాగే పైన్ ఆకులతో తయారు చేసే ఉడ్ వెనిగార్ ద్వారా దిగుబడి పెరుగుతుంది. మొదట్లో ప్రయోగాత్మకంగా వినియోగించి... ఫలితాలను నిర్ధారించుకున్నాక ఉత్పత్తిని ప్రారంభించాం. స్థానిక రైతులకు వీటివల్ల ఖర్చు తగ్గడం, భూసారం పెరగడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. హరియాణా, గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో కూడా వీటికి ఆదరణ లభిస్తోంది.

సేకరణ పూర్తిగా మహిళలద్వారానే...

పైన్ ఆకుల సేకరణ పూర్తిగా మహిళలే చేస్తారు. దీనికోసం పలు గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేశాం. అడవుల్లో పైన్ ఆకులు సేకరించి... మా కేంద్రాలకు తీసుకవస్తే... దానికి ప్రతిఫలాన్ని మేము అందిస్తున్నాం. మా ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే మొత్తంలో ఎక్కువ భాగం వారికోసమే వినియోగిస్తున్నాం. ఇప్పుడు అనేక ప్రాంతాల్లో ఇదివరకటిలా నేల మీద ఎండిన పైన్ ఆకులు కనిపించడం బాగా తగ్గిపోయింది. ఈ విధంగా... పర్యావరణానికి, రైతులకు, మహిళలకు ఒక పరిష్కారాన్ని చూపించడం ఎంతో సంతోషంగా ఉంది. విద్య, వైద్యం, మహిళా సాధికారత, అందరికీ సమాన అవకాశాలు... ఇలా ఎన్నో అంశాల్లో పని చేయాలనేది నా కోరిక. ఇవన్నీ సాధ్యం కావాలంటే సమాజంలో మార్పు రావాలి. నా స్టార్టప్... ఆ దిశగా నేను వేసిన ఒక చిన్న అడుగు.

పిల్లల చేతి రాత అందంగా...



కొంతమంది పిల్లల చేతిరాత అంత అందంగా ఉండదు. అక్షరాలను ఒక క్రమంలో కాకుండా ఎగుడు దిగుడుగా, కొన్నింటిని పెద్దగా మరికొన్నింటిని చిన్నగా రాస్తుంటారు. ఎంత బాగా చదివినప్పటికీ చేతి రాత సరిగా లేకపోతే పరీక్షల్లో మార్కులు కూడా తగ్గుతుంటాయి. అలాకాకుండా పిల్లల చేతిరాత చక్కగా ఉండాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

● ముందుగా పిల్లలు పెన్సిల్‌ను ఎలా పట్టుకుంటున్నారో పరిశీలించాలి. చూపుడు వేలు, మధ్యవేలు, బొటనవేలు మధ్య పెన్సిల్ సరిగా అమరేలా చూడాలి. ఈ మూడు వేళ్లతో పెన్సిల్‌ను గట్టిగా పట్టుకోవడం నేర్పించాలి. చాలామంది పిల్లలు పెన్సిల్‌ను చూపుడు వేలు, బొటనవేలుతో మాత్రమే పట్టుకుంటూ ఉంటారు. దీనివల్ల సరైన గ్రిప్ దొరకక చేతిరాత సరిగా రాదు.

● పిల్లలకు అక్షరాలను సరళరేఖ వెంబడి ఒకే రీతిలో రాయడం నేర్పించాలి. రూల్డ్ నోట్‌బుక్స్‌లో రాస్తూ ఉంటే కొద్ది రోజుల తరవాత తెల్ల కాగితం మీద కూడా చక్కగా రాయడం వస్తుంది.

● అరచేతులు, వేళ్ల వేగంగా కదిలిస్తూ చేసే పనులను పిల్లలకు చెప్పి చేయించాలి. మట్టితో బొమ్మలు చేయడం, సూదిలో దారం ఎక్కించడం, సొంతంగా ఆహారాన్ని తినడం, బొమ్మలతో పజిల్స్ పూర్తిచేయడం లాంటివి చేయిస్తూ ఉంటే ఏకాగ్రత కుదురుతుంది. చేసే పనికి తగ్గట్టు వేళ్లను కదిలించడం పిల్లలకు అలవాటవుతుంది. క్రమంగా చేతిరాత మెరుగవుతుంది.

● పిల్లల చేత అక్షరాలను సరైన క్రమంలో దిద్దించాలి. తరవాత వాటిని వరుసలో రాయమని చెప్పాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే అక్షరాలు రాసే విధానం పిల్లలకు అర్థమవుతుంది. వాటిని అందంగా ఎలా రాయాలో తెలుస్తుంది. క్రమంగా పదాలు, వాక్యాలు రాయడాన్ని పిల్లలకు నేర్పించాలి.

● వాక్యాలు రాసేటప్పుడు పదాల మధ్య చిన్న ఖాళీ ఉంచాలని పిల్లలకు చెప్పాలి. పదాలు రాసేటప్పుడు అక్షరాల సైజు ఒకేలా ఉండేలా సాధన చేయించాలి. రాయడానికి కష్టంగా ఉన్న పదాలను విడిగా పలుమార్లు రాయిస్తే పిల్లలు సులువుగా వాక్యాలు రాయగల్గుతారు. చేతిరాత కూడా పొందికగా మారుతుంది.

బూట్లు శుభ్రంగా ఇలా...



వర్షాకాలంలో తరచూ బురద అంటుకోవడం వల్ల బూట్లు మురికిగా మారుతూ ఉంటాయి. వాటిని శుభ్రం చేయడం కష్టంగా అనిపిస్తుంటుంది. ముఖ్యంగా తెల్లటి బూట్లకు అంటిన మరకలు త్వరగా వదలవు. చిన్న చిట్కాలు పాటించి బూట్లను ఎలా మెరిపించాలో తెలుసుకుందాం...

● వాతావరణంలో తేమ కారణంగా ఒక్కోసారి బూట్ల మీద ఫంగస్ చేరుతూ ఉంటుంది. అలాంటప్పుడు బూట్లకు నిమ్మరసం రాయాలి. పది నిమిషాల తరవాత టిష్యూ పేపర్ లేదా పలుచని వస్త్రంతో తుడిస్తే మురికి పూర్తిగా వదిలిపోతుంది. వెనిగర్‌లో ముంచిన దూదితో బూట్లను తుడిచినా మంచి ఫలితం కనిపిస్తుంది.

● ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, కొన్ని నీళ్ల చుక్కలు వేసి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని బూట్లకు అంటిన మరకల మీద రాయాలి. అయిదు నిమిషాల తరవాత తడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.

● ఒక గిన్నెలో రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్ వేసి రెండు చెంచాల వేడినీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బూట్లకు పట్టించాలి. అయిదు నిమిషాల తరవాత మెత్తని బ్రష్‌తో రుద్ది తడి స్పాంజ్‌తో శుభ్రంగా తుడిచేస్తే బూట్లు కొత్తవాటిలా మెరుస్తాయి.

● లెదర్ బూట్ల మీద కొద్దిగా బాడీ లోషన్ రాయాలి. అయిదు నిమిషాల తరవాత పలుచన్ని వస్త్రంతో తుడిచేస్తే మురికి మొత్తం వదిలిపోతుంది.

● కాన్వాస్ బూట్ల మీద పాత టూత్‌బ్రష్‌తో మెల్లగా రుద్దితే చాలావరకు మురికి తొలగిపోతుంది. తరవాత తడిగుడ్డను అద్దుతూ తుడిస్తే బూట్లు పూర్తిగా శుభ్రమవుతాయి.

● తెల్లటి బూట్లు మారికిగా మారినప్పుడు వాటి మీద తెల్లని టూత్‌పేస్ట్ రాయలి. రెండు నిమిషాల తరవాత వాటిపై కొన్ని నీళ్ల చుక్కలు చల్లాలి. వెంటనే పాత టూత్‌బ్రష్‌తో రుద్ది పొడిగుడ్డ లేదా స్పాంజ్‌తో తుడిచేస్తే మరకలన్నీ తొలగిపోతాయి.

స్పోర్ట్స్

అనిరుధ్ జోడీకి 'లెక్సింగ్టన్' ట్రోఫీ



లెక్సింగ్టన్(యూఎస్): హైదరాబాద్ టెన్నిస్ ఆటగాడు అనిరుధ్ చంద్రశేఖర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. సహచరుడు రామ్‌కుమార్‌తో కలిసి యూఎస్‌లో జరిగిన లెక్సింగ్టన్ చాలెంజర్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అనిరుధ్/రామ్ జోడీ 6-4, 6-4తో తైపీ జంట యు హిషియు-హో హువాంగ్‌పై గెలిచింది.

భారత జోడీలకు రన్నరప్ టైటిళ్లు



న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో భారత జోడీలు రన్నరప్ టైటిళ్లతో సరిపెట్టుకున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో భారత ద్వయం మానుష్ షా/దియా చిటాలే 4-11, 11-8, 11-5, 5-11, 2-11తో జపాన్ జంట సతోషి/హానాకొ చేతిలో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ టైటిల్‌పోరులో భారత జోడీ మానుష్/మానవ్ 3-11, 11-7, 7-11, 15-13, 5-11తో జర్మనీకి చెందిన బెనెడిక్ట్/డాంగ్ చేతిలో పరాజయం పాలైంది. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మనికా బాత్రా 7-11, 6-11, 7-11తో హషిమోటో (జపాన్) చేతిలో ఓడింది.

శ్రీశంకర్ వరుసగా మూడోసారి..

న్యూఢిల్లీ: భారత లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ వరుసగా మూడో అంతర్జాతీయ టైటిల్ సాధించాడు. కజకిస్థాన్‌లోని అల్మాటీలో జరిగిన కొసనోవ్ మెమోరియర్ అథ్లెటిక్స్ మీట్‌లో శ్రీశంకర్ 7.94 మీటర్లు లంఘించి విజేతగా నిలిచాడు. ఇటీవలే ఇండియన్ ఓపెన్, పోర్చుగల్ మీట్‌లో శ్రీశంకర్ గెలిచాడు.

రసపట్టులో..

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 339/6

రూట్, బ్రూక్ శతక మోత

ఆఖరి టెస్టు

విజయానికి

35 రన్స్ దూరంలో ఇంగ్లండ్

4 వికెట్ల వేటలో భారత్


ప్రసిద్ధ్ కృష్ణ (3/109)

లండన్: ఓవల్ టెస్టులో హైటెన్షన్.. నాలుగో రోజే ముగుస్తుందనుకున్న మ్యాచ్ ఆఖర్లో వర్షం ఇచ్చిన ట్విస్ట్‌కు ఐదో రోజుకు చేరింది. అయితే హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) అద్భుత శతకాలతో ఆఖరి మ్యాచ్‌నే కాదు, సిరీస్ కూడా కోల్పోయినట్టే అనుకున్న వేళ.. భారత జట్టు అనూహ్యంగా పుంజుకుంది. చివరి సెషన్‌లో కేవలం 57 పరుగుల కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును భారత పేసర్లు వణికించారు. ప్రసిద్ధ్ కృష్ణ వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే వర్షం రావడంతో గంటన్నర ముందుగానే ఆటను ముగించారు. విజయానికి ఇంగ్లండ్ 35 పరుగుల దూరంలో ఉండగా.. వోక్స్ బరిలోకి దిగితే భారత్‌కు మరో 4 వికెట్లు కావాల్సిందే. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 339/6 స్కోరుతో ఉండగా.. క్రీజులో జేమీ స్మిత్ (2), ఒవర్టన్ (0) ఉన్నారు. ప్రసిద్ధ్‌కు మూడు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. సోమవారం తొలి గంట ఆట ఇరు జట్లలో విజయం ఎవరిదో తేల్చనుంది.

పోటీ సమంగా..: ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు ఇంగ్లండ్ భారీ ఛేదనను ఆరంభించింది. అయితే ఈ సెషన్‌లో ఇరుజట్ల నుంచి పోటాపోటీ ప్రదర్శన ఎదురైంది. ముఖ్యంగా పేసర్ సిరాజ్ అలుపెరుగని ఎనిమిది ఓవర్ల స్పెల్‌తో డకెట్, పోప్‌లను ఇబ్బందిపెట్టాడు. అయితే జోరుమీదున్న డకెట్‌ను తొలి గంటలోనే ప్రసిద్ధ్ అవుట్ చేశాడు. అటు పోప్ మాత్రం ప్రసిద్ధ్ ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడిని సిరాజ్ అవుట్ చేశాడు. ఇక బ్రూక్ నిలదొక్కుకునేందుకు కాస్త సమయం తీసుకున్నా.. ఆకాశ్ ఓవర్‌లో 4,6తో టచ్‌లోకి వచ్చాడు. తర్వాతి ఓవర్‌లోనే 6,4,4తో 16 రన్స్ పిండుకున్నాడు. ఈ సెషన్‌లో ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయినా 114 పరుగులు రాబట్టింది.

బ్రూక్ భళా: రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తమ బాజ్‌బాల్ గేమ్‌ను బయటికి తీసింది. విజయానికి 210 పరుగుల దూరంలో ఉండగా.. బ్రూక్ ఒక్కసారిగా బ్యాట్‌కు పనిజెప్పాడు. దీంతో సెషన్ ముగిసేసరికి అతను అద్భుత శతకం పూర్తిచేసుకోగా.. అటు రూట్ 98 రన్స్‌తో బ్రేక్‌కు వెళ్లాడు. దీంతో.. ఇంగ్లండ్ విజయానికి కేవలం 57 పరుగుల దూరంలో నిలిచి భారత్‌లో ఓటమి భయాన్ని పెంచింది. కాగా.. ఆరంభ ఓవర్‌లోనే బ్రూక్ రెండు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. అటు భారత పేసర్లు తీవ్రంగా అలసిపోయినట్టు కనిపించారు. ఈ క్రమంలో 39 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన బ్రూక్, ఆ తర్వాత కూడా చెలరేగి 91 బంతుల్లో కెరీర్‌లో పదో శతకం అందుకున్నాడు. అయితే ఆ వెంటనే ఆకాశ్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు బాది మిడాఫ్‌లో సిరాజ్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. అప్పటికే రూట్‌తో కలిసి అతను నాలుగో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. ఈ సెషన్ ముగియగానే వర్షం రావడంతో ఆఖరి సెషన్ పది నిమిషాలు ఆలస్యంగా ఆరంభమైంది.

బౌలర్లు పుంజుకుని..: చివరి సెషన్‌లో పట్టు వీడని భారత బౌలర్లు మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చారు. ఈ సెషన్ ఆరంభంలోనే రూట్ శతకాన్ని పూర్తి చేయగా.. మరో ఎండ్‌లో బెథెల్ (5) నిర్లక్ష్యపు షాట్‌తో భారత్‌కు చాన్స్ ఇచ్చాడు. బెథెల్‌ను ప్రసిద్ధ్ బౌల్డ్ చేశాడు. అటు బంతి కూడా చక్కగా మూవ్ కావడంతో బౌలర్లకు పట్టు దొరికింది. సిరాజ్ కూడా వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతులు విసరడంతో ఇంగ్లండ్‌కు పరుగులు రావడమే గగనమైంది. 39వ టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్న రూట్ వికెట్‌ను కూడా ప్రసిద్ధ్ తీయడంతో భారత్‌కు మ్యాచ్‌పై పట్టు లభించింది. ఆట ఆగే సమయానికి చివరి ఆరు ఓవర్లలో ఇంగ్లండ్ 8 పరుగులే చేసి 2 వికెట్లు కోల్పోయింది.


హ్యారీ బ్రూక్ (111)

1 ఓ టెస్టు సిరీస్‌లో 9 మంది బ్యాటర్లు 400+ స్కోరు నమోదు చేయడం ఇదే తొలిసారి. అలాగే వీరి నుంచి రికార్డు స్థాయిలో 21 శతకాలు రావడం విశేషం.


జో రూట్ (105)

1 భారత్‌తో జరిగిన సిరీస్‌ల్లో ఎక్కువ సార్లు (3) 500+ పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్. అలాగే ఒకే జట్టు (భారత్)పై ఎక్కువ (13) సెంచరీలు బాదిన రెండో బ్యాటర్‌గా గవాస్కర్ (విండీస్‌పై)తో రూట్ సమంగా నిలిచాడు. బ్రాడ్‌మన్ (ఇంగ్లండ్‌పై 19) టాప్‌లో ఉన్నాడు. ఓవరాల్‌గా స్వదేశంలో ఎక్కువ (24) సెంచరీలు సాధించిన ప్లేయర్‌గానూ రూట్ రికార్డులకెక్కాడు. అంతేకాదు.. ఛేజింగ్‌లో ఎక్కువ (13) 50+ స్కోర్లలోనూ గేల్, చందర్‌పాల్, గ్రేమ్ స్మిత్‌తో సమంగా నిలిచాడు.

సిరాజ్ నియంత్రణ కోల్పోయి..

ఐదో టెస్టు నాలుగో రోజు ఆటలో హ్యారీ బ్రూక్ మెరుపు శతకం అత్యంత కీలకంగా నిలిచింది. అయితే అతను 19 పరుగుల వద్దే వెనుదిరగాల్సింది. ప్రసిద్ధ్ ఓవర్‌లో బ్రూక్ భారీ షాట్ ఆడగా గాల్లోకి లేచిన బంతిని ఫైన్ లెగ్‌లో సిరాజ్ అందుకున్నాడు. కానీ నియంత్రణ కోల్పోయిన సిరాజ్ బౌండరీ లైన్‌ను తాకడంతో అది కాస్తా సిక్స్‌గా మారింది. ఇక అదే ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన బ్రూక్ మరో 91 పరుగులు సాధించి సెంచరీ పూర్తి చేయడమే కాదు.. రూట్‌తో కలిసి భారీగా పరుగులు జత చేసి భారత్‌పై తీవ్ర ఒత్తిడి పెంచాడు. బ్రూక్ ముందే అవుటై ఉంటే ఈ టెస్టులో గిల్ సేన పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది .





స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224;
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247;
భారత్ రెండో ఇన్నింగ్స్: 396;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54, పోప్ (ఎల్బీ) సిరాజ్ 27, రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105, బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్ 111, బెథెల్ (బి) ప్రసిద్ధ్ 5, స్మిత్ (బ్యాటింగ్) 2, ఒవర్టన్ (బ్యాటింగ్) 0, ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 76.2 ఓవర్లలో 339/6; వికెట్ల పతనం: 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337; బౌలింగ్: ఆకాశ్ దీప్ 20-4-85-1, ప్రసిద్ధ్ కృష్ణ 22.2-3-109-3, సిరాజ్ 26-5-95-2, వాషింగ్టన్ సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

మరోసారి ఏసీఏ పీఠంపై చిన్ని, సతీష్!

ఏకగ్రీవం కానున్న అధ్యక్ష, కార్యదర్శి పదవులు


రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీ సానా సతీష్

మంగళగిరి (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)కు వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, కార్యదర్శిగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ ఎన్నికవడం లాంఛనమైంది. మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్‌కు తన నామినేషన్ పత్రాలను సతీష్ ఆదివారం అందజేశారు. కేశినేని చిన్ని తరఫున డాక్టర్ కే.గోవిందరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఆదివారంతో గడువు ముగిసింది. జాయింట్ సెక్రటరీకి మినహా అన్ని పదవులకు ఒక్కో నామినేషనే పడడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈనెల 6న నామినేషన్లను పరిశీలిస్తారు. 11వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. అప్పటికీ జాయింట్ సెక్రటరీ పదవికి పోటీలో ఇద్దరుంటే 16న పోలింగ్ నిర్వహించి, అధికారికంగా కొత్త కార్యవర్గ సభ్యుల పేర్లను ప్రకటిస్తారు. అధ్యక్ష పదవికి చిన్ని, ఉపాధ్యక్ష పదవికి బండారు నరసింహారావు, కార్యదర్శి పదవికి సతీష్, కోశాధికారి పదవికి శ్రీనివాస్, కౌన్సిలర్ పదవికి విష్ణు తేజ్ మాత్రమే నామినేషన్లు వేశారు. జాయింట్ సెక్రెటరీ పదవికి విజయ్‌కుమార్, శ్రీనివాసరాజు నామినేషన్లు దాఖలు చేశారు.

చివరి బంతికి హోల్డర్ బౌండరీ


పాకిస్థాన్‌తో రెండో టీ20లో వెస్టిండీస్ ఉత్కంఠ గెలుపు

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): పొట్టి క్రికెట్ ఫ్యాన్స్‌లో ఎందుకంత క్రేజో నిరూపించింది వెస్టిండీస్-పాకిస్థాన్ రెండో టీ20. శనివారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోరులో ఆఖరి బంతికి విజయం అందుకున్న విండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. బౌలింగ్‌లో తొలుత నాలుగు వికెట్లతో పాకిస్థాన్‌ను కట్టడి చేసిన ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ (4/19, 16 నాటౌట్)..చివరి బంతికి బౌండరీ బాది విండీస్‌ను విజయ పథాన నిలిపాడు. మ్యాచ్‌లో తొలుత పాక్ 20 ఓవర్లలో 133/9 స్కోరుకు పరిమితమైంది. హసన్ నవాజ్ (40) టాప్ స్కోరర్. మోటీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసి నెగ్గింది. మోటీ (28), హోప్ (21) పర్లేదనిపించారు. ఆఖరి ఓవర్లో 8 రన్స్ కావాల్సిన వేళ..అఫ్రీది రెండో బంతికి షెపర్డ్‌ను అవుట్ చేశాడు. హోల్డర్‌తోపాటు కొత్త బ్యాటర్ షామర్ జోసెఫ్ తుదుపరి మూడు బంతుల్లో మూడు పరుగులే చేశారు. మరుసటి బంతిని అఫ్రీది వైడ్‌గా వేయడంతో.. చివరి బంతికి విండీస్ మూడు రన్స్ చేయాలి. ఈ దశలో ఒత్తిడిని అదిమిపట్టిన హోల్డర్ బంతిని బౌండరీకి తరలించి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు.

డబ్ల్యూసీఎల్‌పై పీసీబీ నిషేధం

లాహోర్: వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో పాక్ ఆటగాళ్లు పాల్గొనకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిషేధం విధించింది. అంతేకాకుండా డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పీసీబీ ఆరోపించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత వెటరన్ జట్టు.. లీగ్ దశలో, సెమీస్‌లో పాక్‌తో మ్యాచ్‌లను బహిష్కరించింది. అయితే, ఆడేందుకు నిరాకరించినా భారత్‌కు నిర్వాహకులు పాయింట్లు కేటాయించడాన్ని పీసీబీ తప్పుబట్టింది. భవిష్యత్‌లో ఈ టోర్నీలో పాక్ ప్లేయర్లు ఆడకుండా మొత్తంగా నిషేధం విధించింది.

బిజినెస్

ఆటుపోట్లు తప్పవు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. అమెరికా సుంకాల ప్రభావం తక్కువే అయినప్పటికీ మారుతున్న అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నాయి. పైగా అమెరికాలో నిరుద్యోగ డేటా, ద్రవ్యోల్బణం వంటివి ప్రతికూలంగా మారాయి. బెంచ్ మార్క్ సూచీలు స్వల్ప, మధ్య కాలంలో బలహీనతను సూచిస్తున్నాయి. మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

హ్యుండయ్ మోటార్స్: తాజా గరిష్ఠం తర్వాత ఈ షేరు పుల్‌బ్యాక్ అయ్యింది. 20 రోజుల మూవింగ్ యావరేజెస్ వద్ద మద్దతు తీసుకున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు, డివిడెండ్‌తో ఇన్వెస్టర్లు ఆసక్తిని కనబరుస్తున్నారు. మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.2,181 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,150 శ్రేణిలో ప్రవేశించి రూ.2,280 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,120 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్: మార్చిలో ట్రెండ్ రివర్సల్ అయిన తర్వాత ఈ షేరు ప్రస్తుతం ఎగువ స్థాయిలో సైడ్‌వేస్‌లో చలిస్తోంది. నష్టాల మార్కెట్లోనూ బలం ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. మీడియం, షార్ట్‌టర్మ్ మూమెంటమ్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.706 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.650 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఇమామీ: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. డెలివరీ పరిమాణం పెరుగుతోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.619 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.600 ఎగువ స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.680 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.585 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అంబుజా సిమెంట్: ఆరు నెలలుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. హయ్యర్ హై.. హయ్యర్ లో ఫామ్ చేస్తోంది. ప్రస్తుతం కీలక స్థాయి వద్ద ఉంది. గత శుక్రవారం రూ.607 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.570/580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.640/680 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.550 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: మంచి అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరు కన్సాలిడేట్ అవుతోంది. అనిశ్చితి తొలగిపోయింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.2,858 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,825 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,800 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



25,900 పైన బుల్లిష్

(ఆగస్టు 4-8 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 24,565 (-272)

నిఫ్టీ గత వారం 25,889-24,535 పాయింట్ల మధ్యన కదలాడి 272 పాయింట్ల నష్టంతో 24,565 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,900 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,769, 24,834, 24,970, 25,189 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,900 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,200
నిరోధ స్థాయిలు: 24,775, 24,875, 24,975 (24,675 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,350, 24,250, 24,150 (24,450 దిగువన బేరిష్)

ఆస్ట్రో నిఫ్టీ

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	470
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	92		
గోదావరి	99	అనంతపురం	97

'ఐటీ'లో కొలువుల్లేవ్..!

7 త్రైమాసికాలుగా ఇదే పరిస్థితి ● రిక్రూట్‌మెంట్ సంస్థ క్వెస్ కార్ప్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) సంస్థల్లో నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. గడచిన 6-7 త్రైమాసికాలుగా పలు ఐటీ కంపెనీలు నియామకాలను దాదాపు పక్కనబెట్టినట్లు రిక్రూట్‌మెంట్ సేవలందించే క్వెస్ కార్ప్ సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసే ద్వితీయ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుందని తెలిపింది. ప్రస్తుతం ఐటీ నిపుణుల డిమాండ్‌లో దాదాపు 73 శాతం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ), నాన్ ఐటీ కంపెనీల నుంచే వస్తోంది తప్ప.. ఐటీ కంపెనీల నుంచి పెద్దగా లేదని క్వెస్ కార్ప్ సీఈఓ,ఈడీ గురుప్రసాద్ శ్రీనివాసన్ చెప్పారు. సేవలపై ఎక్కువగా ఆధారపడిన ఐటీ కంపెనీలైతే గత ఆరేడు త్రైమాసికాలుగా నియామకాలను పూర్తిగా నిలిపివేసాయని ఆయన తెలిపారు. కొన్ని ఐటీ సేవల కంపెనీలైతే ఉన్న ఉద్యోగులకే ఇక సెలవు అని చెబుతున్నాయి. జీసీసీలు, నాన్ ఐటీ కంపెనీలు కూడా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులనే ఎక్కువగా నియమించుకుంటున్నాయని శ్రీనివాసన్ తెలిపారు.

ఇతర ప్రధానాంశాలు

- నియామకాలు పెంచిన తయారీ, బీఎఫ్ఎస్ఐ కంపెనీలు
- కన్స్యూమర్ రిటైల్, టెలికాం కన్స్యూమర్ రంగాల్లోనూ పెరిగిన నియామకాలు
- టెలికాం, ఫార్మా, రిటైల్ రంగాల్లో స్వల్పంగా తగ్గిన నియామకాలు
- వృత్తి నిపుణులకు మరింత డిమాండ్
- ఫార్మా, రిటైల్, ఆటో, తయారీ కంపెనీలను వెంటాడుతున్న టారిఫ్‌ల భయం

డిసెంబరు నాటికి 35 షోరూమ్‌లు: విన్‌ఫాస్ట్

చెన్నై: వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల సంస్థ విన్‌ఫాస్ట్ అనుబంధ సంస్థ విన్‌ఫాస్ట్ ఆటో ఇండియా సంవత్సరాంతం నాటికి కొత్తగా 35 షోరూమ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆదివారం నాడు చెన్నైలో దేశంలోనే అతిపెద్ద రిటైల్ అవుట్‌లెట్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ సందర్భంగా విన్‌ఫాస్ట్ ఏషియా సీఈఓ ఫామ్ సన్ చౌ మాట్లాడుతూ.. ఈ ఏడాది చివరి నాటికల్లా భారత్‌లోని 27 నగరాల్లో 35 షోరూమ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా విన్‌ఫాస్ట్ ఇప్పటికే గుజరాత్, సూరత్‌లో తొలి షోరూమ్‌ను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు.

హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ వేతనం రూ.94.6 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ విజయ్ కుమార్ వేతనం విషయంలో ప్రస్తుతం దేశంలోని టెక్ దిగ్గజాల సారథుల కన్నా ఎంతో ముందున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ.94.6 కోట్లు (1.085 కోట్ల డాలర్లు). దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ టీసీఎస్ సీఈఓ కృతివాసన్ (రూ.26.52 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ (రూ.80.62 కోట్లు) ఆయన కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు. అంతేకాదు... 2025-26 ఆర్థిక సంవత్సరానికి విజయ్ కుమార్ వేతనం 71% మేర పెంచేందుకు (అంటే రూ.154 కోట్లు లేదా 1.86 కోట్ల డాలర్లు) హెచ్‌సీఎల్ టెక్ డైరెక్టర్ల బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. మరోవైపు విప్రో సీఈఓ శ్రీనివాస్ పల్లియా (రూ.53.64 కోట్లు), టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి (రూ.53.9 కోట్లు) కూడా విజయ్ కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు.

విజయ్ వేతనంలో మూల వేతనం 19.6 లక్షల డాలర్లు కాగా పనితీరు ఆధారిత బోనస్‌గా 17.3 లక్షల డాలర్లున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ వార్షిక నివేదికలో తెలిపింది. 2016లో విజయ్ కుమార్ హెచ్‌సీఎల్ టెక్ పగ్గాలు చేపట్టారు. ఈయన సంస్థ బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.1,15,000 కోట్లుగా ఉన్న హెచ్‌సీఎల్ టెక్ మార్కెట్ విలువ 2025 మార్చి 31 నాటికి ఏకంగా రూ.4,32,000 కోట్లకు పెరిగింది. అంటే 2016 నుంచి 3.8 రెట్ల వృద్ధి నమోదైందన్న మాట. ఇదే సమయంలో మిగతా నాలుగు అగ్రగామి ఐటీ సర్వీసెస్ దిగ్గజ సంస్థల వృద్ధి 2.5 రెట్లు మాత్రమే ఉంది.

24,500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారంలో కూడా నిఫ్టీ మైనర్ రికవరీతో ప్రారంభమైనా కీలక స్థాయి 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం మొత్తానికి 270 పాయింట్ల నష్టంతో 24,565 వద్ద ముగిసింది. గత ఐదు వారాలుగా నిరంతర డౌన్ ట్రెండ్‌లో ఉన్న మార్కెట్ గరిష్ఠ స్థాయి 25,670 నుంచి 1,000 పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 సూచీ 1,370 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 625 పాయింట్లు నష్టపోయాయి. అలాగే నాలుగు నెలల వరుస ర్యాలీ అనంతరం జూలై నెలలో నిఫ్టీ 750 పాయింట్ల మేరకు నష్టపోయి ఇటీవల ఏర్పడిన బాటమ్ 24,500 సమీపంలోకి వచ్చింది.

బుల్లిష్ స్థాయిలు: భద్రత కోసం నిఫ్టీ 24,500 వద్ద తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఇప్పుడు రికవరీ బాట పట్టినట్టయితే మైనర్ నిరోధం 24,700 పైన నిలదొక్కుకున్నప్పుడే మైనర్ అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రధాన నిరోధం 25,000. ఇదే స్వల్పకాలిక నిరోధ స్థాయి. గత రెండు మాసాలుగా ఇక్కడే ప్రధాన కన్సాలిడేషన్ చోటు చేసుకుంటోంది.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం 24,500-24,450 స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 24250, 24000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 910 పాయింట్లు నష్టపోయి 55,600 సమీపంలో ముగిసింది. ప్రధాన బాటమ్ 55,500 చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి. అలాగే ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 56,100 వద్ద నిలదొక్కుకోవాలి.

పాటర్న్: నిఫ్టీ 100 డిఎంఏకి చేరువవుతోంది. అలాగే 24,500 సమీపంలో "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" సమీపంలోకి వస్తోంది. సానుకూలత కోసం ఇక్కడ బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి. గతంలో ఇక్కడే నాలుగు మేజర్ బాటమ్‌లు ఏర్పడ్డాయి. ఈ కీలక స్థాయిలో నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	24,640, 24,700
మద్దతు:	24,450, 24,390

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

వస్తున్నాయ్.. 'భారత్' సహకార ట్యాక్సీలు

న్యూఢిల్లీ: సహకార రంగంలోని కొన్ని సహకార సంఘాల కన్సార్షియం ఈ ఏడాది చివరి నాటికి "భారత్" బ్రాండ్‌తో దేశంలో సహకార ట్యాక్సీ సర్వీసును ప్రవేశపెట్టబోతోంది. ప్రస్తుతం దేశంలో నడుస్తున్న ఓలా, ఉబర్ వంటి ట్యాక్సీ సర్వీసులకు సవాలు విసిరేందుకు సహకార సంఘం సంసిద్ధం అవుతోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే రూ.300 కోట్ల అధీకృత మూలధనంతో ఢిల్లీ, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రల్లో 200 మంది డ్రైవర్లను నియమించుకుంది. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ), ఇఫ్కో, గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) సహా ఎనిమిది సంఘాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. డ్రైవర్లకు మెరుగైన రాబడులు అందించడంతో పాటు ప్రయాణికులకు సరసమైన ధరల్లో ట్యాక్సీ సర్వీసును అందుబాటులోకి తేవడం లక్ష్యమని ఎన్‌సీడీసీ తెలిపింది.

- బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. ఈక్విటీ సేవింగ్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ పథకం. ఈక్విటీ, ఆర్బిట్రేజ్, డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ముగింపు తేదీ ఈ నెల 11.
- వచ్చే ఏడాది ఏప్రిల్ 22-24 తేదీల్లో ఢిల్లీలో పర్యావరణ సాంకేతిక టెక్నాలజీలపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ ప్రకటించింది.
- విజయవాడలో 10 నిమిషాల్లో ఉత్పత్తుల డెలివరీకి అనూహ్యమైన స్పందన లభిస్తోందని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. ఈ డెలివరీల్లో నిత్యావసర ఉత్పత్తులే అగ్రస్థానంలో ఉంటున్నాయని, ఇందులో హెయిర్ కేర్ ఉత్పత్తులు, బాత్, బాడీ విభాగం వృద్ధి రేటు ఏకంగా 114 శాతంగా ఉన్నట్లు తెలిపింది. అలాగే ఇన్‌స్టామార్ట్ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా మరింత మంది వినియోగదారులకు చేరువైనట్లు తెనాలి డబుల్ హార్స్ ప్రకటించింది.

మగ్గాలపై మ్యాజిక్..!

▸ చేనేతపురి ఉత్పత్తులకు దేశవిదేశాల్లో మంచి ఆదరణ

▸ జీఐ ట్యాగ్ వస్తే అంతర్జాతీయంగా మరింత పేరు

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

పోగు పోగు వడికి అందమైన వస్త్రాలు తయారుచేసే చేనేత కార్మికుల కళానైపుణ్యం చూసి అబ్బురపడని వారుండరు..! కాళ్లు, చేతులతో పనిచేస్తూనే.. కళ్లను మగ్గంపై కేంద్రీకరించి ఎన్నో అద్భుత కళాఖండాలు సృష్టించే చేనేతల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నేతన్నలది ప్రత్యేక శైలి..! మగ్గాలపై మ్యాజిక్ చేసినట్టుగా ఇక్కడి 'చేనేతపురి'లో రూపం పోసుకుంటున్న బర్డ్స్ ఐ తువాళ్లు, జిందగీ దుప్పట్లు, చేతిరూమాళ్లకు దేశవిదేశాల్లో మంచి ఆదరణ ఉంది. మరమగ్గాల పోటీని తట్టుకుంటూ సహజమైన రంగులు, విభిన్న డిజైన్లతో చెక్క మగ్గాలపై రూపొందించిన ఈ ఉత్పత్తులు ప్రపంచమార్కెట్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో ఇక్కడి నేతన్నల శ్రమకు తగిన గుర్తింపు లభించేందుకు మార్గం సుగమం అవుతోంది. ఇక్కడ ఉత్పత్తి చేసే బర్డ్స్‌ఐ తువాళ్లు, జిందగీ దప్పట్లకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) తీసుకొచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన 'రిజల్యూట్ బీ2బీ' సంస్థ కృషి చేస్తోంది.

దేశంలో తనకంటూ ఒక బ్రాండ్..

కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో ఎమ్మిగనూరు ఒకటి. 1930వ దశకంలో పేదరికం, నిరుద్యోగం, కరువు, ఆకలి మరణాలతో ఆ ప్రాంతం అల్లాడిపోయేది. ఆ సమయంలో చేనేత కార్మికులకు ఉపాధి చూపించి ఆకలి తీర్చాలనే సంకల్పంతో పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్'ను స్థాపించారు. ఇది క్రమేపీ దేశంలోనే అత్యుత్తమ చేనేత వస్త్ర ఉత్పత్తికి బ్రాండ్‌గా మారింది. దుప్పట్లు (బెడ్‌షీట్లు), తువాళ్లు, లుంగీలు, చేతి రుమాళ్లు, దోమతెరలు, చొక్కాలు క్లాత్, ధోవతులు, చీరలు.. వంటి వివిధ చేనేత ఉత్పత్తులకు కేంద్రంగా మారి.. 'చేనేతపురి'గా ఖ్యాతి గడించింది. ఒకప్పుడు 2వేల మందికిపైగా చేనేత కార్మికులు సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం 450 మంది వరకు ఉన్నారు. వీళ్ల తయారుచేసే ఉత్పత్తుల్లో జిందగీ దుప్పట్లు, బర్డ్స్ ఐ తువాళ్లు ఎంతో ఆదరణ పొందాయి. ఇక్కడి వస్త్రాలకు 'నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఎన్‌హెచ్‌డీసీ) గుర్తింపు పొందిన తమిళనాడులోని కోయంబత్తూరు, కర్నాటకలోని దావణగేరి డిపోల ద్వారా సరఫరా చేసే నూలు దారాలు వినియోగిస్తున్నారు. ఇక్కడి వస్త్రాలను హైదరాబాద్, విజయవాడ, అమరావతి, కాకినాడ, అనంతపురం, రాయచూరు, గుల్బర్గ సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు ఒక నిర్దిష్ట ప్రాంతానికి చెందిన ఉత్పత్తులకు ఇచ్చే భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లేదు. ఈ నేపథ్యంలోచేనేతపురి ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ సాధించేందుకు 'రిజల్యూట్ బీ2బీ' సంస్థ కృషి చేస్తోంది. దీనికోసం అవసరమైన పత్రాలను సిద్ధం చేస్తోంది. ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఉత్పత్తిలో వినియోగిస్తున్న నూలు దారాలు, రంగులు, చెక్క మగ్గాలపై నేత నైపుణ్యం, విక్రయాలు, ఎగుమతులు.. ఇలా పలు అంశాలను పరిశీలించారు. ఆ సంస్థ ప్రతినిధులు సమగ్ర వివరాలతో కూడిన పత్రాలు, వీడియోలు సేకరించి.. భౌగోళిక గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తున్నారని ఏపీ చేనేత, జౌళి శాఖ కర్నూలు జిల్లా ఏడీ నాగరాజు యాదవ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జీఐ సర్టిఫికెట్ వస్తే బర్డ్స్ ఐ తువాళ్లు, జిందగీ దుప్పట్లకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.



చేనేతలు ఉత్పత్తి చేసిన తువాళ్లు, దుప్పట్లు



ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం (వైడబ్ల్యూసీఎస్)లో నేత కార్మికులు ఉత్పత్తి చేసిన జిందగీ టవళ్లు

ఆకట్టుకునే దుప్పట్లు.. భళా అనిపించే తువాళ్లు..

ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో మగ్గంపై నేతన్నలు తయారుచేసే 'జిందగీ దుప్పట్లు' నేత నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. ఒక దుప్పటి పొడవు 2.29 మీటర్లు, వెడల్పు 1.52 మీటర్లు ఉంటుంది. వీటి తయారీకి 2/70 కౌంట్ యారాన్ వినియోగిస్తారు. తొక్కుడు చెక్క మగ్గంపై వీటిని నేస్తారు. ఈ దుప్పట్లు చాలా మృదువుగా ఉంటాయి. ఒక్కో మగ్గంపై రోజుకు రెండు దుప్పట్లు ఉత్పత్తి చేస్తారు. తువాళ్లను పరిశీలిస్తే 'పక్షి కన్ను' రూపంలో కనిపిస్తాయి. అందుకే వీటిని 'బర్డ్స్ ఐ' తువాళ్లు అని పిలుస్తారు. తొక్కుడు చెక్క మగ్గాలపై నేసే ఈ తువాళ్లు మృదువుగా ఉంటాయి. ఒక్కో తువాలు 1.60 మీటర్లు పొడవు, 0.75 మీటర్లు వెడల్పు ఉంటుంది. రోజుకు 5-6 తువ్వాళ్లు నేత నేస్తారు. పర్యావరణాన్ని కాపాడే సహజసిద్ధమైన రంగులు వేస్తారు.

భౌగోళిక గుర్తింపు వస్తే కూలీ రేట్లు పెరుగుతాయి



'మా తాతల కాలం నుంచి చేనేత మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఎమ్మిగనూరు చేనేత సహకారం సంఘం ఆధ్వర్యంలో బర్డ్స్ ఐ తువాళ్లు నేస్తున్నాను. ఒక తువాలు నేస్తే రూ.35-40 కూలీ ఇస్తున్నారు. రోజుకు నాలుగైదు తువాళ్లకు మించి ఉత్పత్తి చేయలేకపోతున్నాం. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ వచ్చి సర్వే చేసింది. మా తువాళ్లకు భౌగోళిక గుర్తింపు వస్తే డిమాండ్ పెరుగుతుంది. కూలీ రేట్లు కూడా పెరుగుతాయి. ప్రభుత్వం ఆప్కో ద్వారా ఇచ్చే రాయితీలు పెంచి చేనేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలి.'

- పొబ్బతి నాగరాజు, బర్డ్స్ ఐ తువాళ్ల నేత కార్మికుడు, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

15 ఏళ్లుగా జిందగీ దుప్పట్లు నేస్తున్నాను



'నలభై ఏళ్లుగా మగ్గంపై వివిధ చేనేత వస్త్రాలు నేస్తున్నాను. 15 ఏళ్ల నుంచి ఎమ్మిగనూరు చేనేత సొసైటీ ఇచ్చే జిందగీ దుప్పట్లు నేస్తున్నాను. ఒక దుప్పటి నేస్తే రూ.150 ఇస్తున్నారు. రోజుకు రెండు దుప్పట్లు కూడా నేయలేకపోతున్నాం. కూలీ రేట్లు పెంచి ఒక్కో దుప్పటికి రూ.250-300 ఇవ్వాలి. భౌగోళిక గుర్తింపు కోసం కొంత మంది వచ్చి సర్వే చేసి వెళ్లారు. మా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తే మాకూ ఎంతో గర్వంగా ఉంటుంది.'

- కె ఆదెమ్మ, చేనేత కార్మికురాలు, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

నేతన్నలకు మెరుగైన ఉపాధి



'ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు దేశవిదేశాల్లో మంచి ఆదరణ ఉంది. దేశవ్యాప్తంగా 16 విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడి బర్డ్స్ ఐ తువాళ్లు, జిందగీ దుప్పట్లు ఎంతో ప్రత్యేకమైనవి. ఇప్పటివరకు వీటికి జీఐ ట్యాగ్ రాలేదు. హైదరాబాద్‌కు చెందిన 'రిజల్యూట్ బీ2బీ' సంస్థ ప్రతినిదులు ఎమ్మిగనూరులో పర్యటించి జీఐ రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన పత్రాలు సిద్ధం చేశారు. జీఐ సర్టిఫికెట్ వస్తే ఇక్కడ ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది. సొసైటీ మరింత అభివృద్ధి చెందుతుంది. కూలీ రేట్లు కూడా పెరుగుతాయి.'

- ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్ ఏడీ అప్పాజీ

ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

▸ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడగానే పారిశ్రామికవేత్తల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, ఏడాదిలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాలిస్తే దేశంలోనే ఏపీ నంబరు-1 రాష్ట్రంగా మారనుందని పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.4-5 వేల కోట్ల పెట్టుబడులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టడంతోపాటు 20 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. "ఏపీ బ్రాండ్‌ను గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసింది. చంద్రబాబు సీఎం అయ్యాక పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ సంస్థలు ముందుకు వస్తున్నాయి. సింగపూర్ పర్యటనలో క్షణం తీరికలేకుండా చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టే దిశగా ఆ దేశ అధ్యక్షుడు, మంత్రులు, ప్రముఖ పారిశ్రామిక దిగ్గజాలతో వరుస భేటీలు నిర్వహించారు" అని భరత్ చెప్పారు. మరోవైపు ఏపీపై విషం కక్కుతూ ఆ దేశ ప్రముఖ కంపెనీల ప్రతినిధులకు వైసీపీ నేతలు ఈ-మెయిళ్లు పంపారని, దీనిపై ప్రభుత్వం విచారణ చేయిస్తుందని తెలిపారు. ఈ-మెయిళ్లు పంపిన వ్యక్తులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. తమిళనాడు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వంతో కలసి వస్తాయని, మన రాష్ట్రంలో విచ్ఛిన్నం కోసం పని చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే అత్యున్నత పాలసీ తీసుకొస్తున్నామని, దీనిపై మంత్రి లోకేశ్ కసరత్తు చేస్తున్నారని వివరించారు. "రేపే ఎన్నికలు వచ్చినట్లు.. రేపే సీఎం అయిపోతున్నట్లు జగన్ వ్యవహరిస్తున్నారు. కానీ, రాష్ట్రంలో రెండు దశాబ్దాల పాటు కూటమి ప్రభుత్వమే ఉంటుంది. జగన్ వందేళ్లు ఉండాలి. అది కూడా ప్రతిపక్షంలోనే ఉండాలి. చంద్రబాబు వందేళ్లు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాం." అని అన్నారు. మద్యం కుంభకోణం కేసులో 'ప్యాలెస్ కింగ్' అరెస్టు తప్పదని, ఆ అరెస్టు ఎప్పుడనేది ఇప్పుడే చెప్పలేమన్నారు.

లిక్కర్ స్కామ్ విచారణలో స్పీడ్ పెరిగింది: అనిత

శ్రీకాకుళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లిక్కర్ స్కామ్‌పై విచారణలో స్పీడ్ పెరిగిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం ఆమె శ్రీకాకుళం జిల్లాలో అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి, శ్రీకూర్మనాథస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. అరసవల్లిలో మంత్రి మాట్లాడుతూ "ఏడాది కాలంలో పోలీసు వ్యవస్థలో ఎన్నోమార్పులు తెచ్చాం. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయితే.. పోలీసు వ్యవస్థతోపాటు ఇతర వ్యవస్థల్లోనూ సంస్కరణలు తెచ్చాం. రాష్ట్రాన్ని గంజాయి రహిత ఏపీగా మార్చు చేసేందుకు 'ఈగల్ టీమ్'ను తీసుకు వచ్చాం. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టాం. పోక్సో కేసుల విషయాల్లో కన్విక్షన్ రేటు పెరిగింది. ఆరు నెలల్లోనే విచారణ పూర్తయి.. శిక్షలు పడుతున్నాయి. లిక్కర్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని అన్నారు.

అడ్డంగా దొరికిపోయారు: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతి స్కీమూ ఓ పెద్ద స్కామ్ అని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికిపోయి కూడా జగన్ అండ్ కో అడ్డగోలుగా బుకాయిస్తున్నారన్నారు. నాసిరకం మద్యంతో పేదల రక్తమాంసాలతో వ్యాపారం చేసిన పాపం ఊరికే పోతుందా? అని ప్రశ్నించారు. పేదల కష్టాన్ని కరెన్సీ కట్టలుగా మార్చుకుని డెన్‌లలో దాచుకున్నారని, ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో నిందితుల అరెస్టులతో కల్తీ మద్యంతో చనిపోయిన వారి కుటుంబాలన్నీ హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. తప్పు చేసిన వారెవరూ చట్టం చేతుల్లో నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు.

ముగిసిన మంత్రి నారాయణ విదేశీ పర్యటన

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏడు రోజుల పాటు సింగపూర్, మలేషియాలో మంత్రి నారాయణ పర్యటించి ఆదివారం సాయంత్రం విజయవాడ చేరుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి అనువైన పద్ధతులను మంత్రి బృందం అధ్యయనం చేసింది. భవన నిర్మాణాలు, రోడ్లు, మౌలికవసతులు, రోడ్డు రవాణా, కన్వెన్షన్ సెంటర్లు, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లు, పార్కులను మంత్రి బృందం పరిశీలించింది. సింగ్‌పూర్, మలేషియాల్లోని బెస్ట్ ప్రాక్టీస్‌ను అమరావతి నిర్మాణంలో ఉపయోగించే యోచన చేస్తున్నారు.

మాజీ మంత్రి కొడాలి నానికి నోటీసులు

గుడివాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొడాలి నానిపై మరో కేసు నమోదైంది. విచారణ కోసం ఆయనకు పోలీసులు నోటీసులు కూడా జారీచేశారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ గతేడాది విశాఖకు చెందిన అంజనాప్రియ ఫిర్యాదు చేశారు. దీనిపై విశాఖపట్నం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం వారు గుడివాడ వచ్చి కొడాలి నాని ఇంటికి వెళ్లి.. విచారణకు ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని, అందుబాటులో ఉండాలంటూ ఆయనకు 41ఏ సెక్షన్ కింద నోటీసులు అందజేశారు.

గ్రామాల్లో.. 'స్వచ్ఛరథం'

▸ వ్యర్థాల సేకరణకు వినూత్న విధానం

▸ గుంటూరు లాలుపురంలో పైలట్



స్వచ్ఛ రథంలో వ్యర్థాలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన క్యాబిన్

అమరావతి/గుంటూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్ వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'స్వచ్ఛ రథం' పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులు సహా ఐరన్, అట్టపెట్టెలు ఇతర పనికిరాని వస్తువులను తీసుకుని.. దానికి బదులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ రథా'లను ప్రస్తుతం గుంటూరు గ్రామీణ ప్రాంతం లాలుపురంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. వాటర్ బాటిళ్లు, పాలిథీన్ సంచులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు.. ఇలా ఇంట్లో పనికిరాని వాటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా.. స్వచ్ఛరథం ద్వారా సేకరిస్తున్నారు. వ్యర్థాలు తీసుకుని ఇచ్చే నిత్యావసరాల్లో.. పప్పు, ఉప్పు, చింతపండు, సబ్బులు వంటివి ఉంటున్నాయి. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ లాలుపురంలో 'స్వచ్ఛరథం' స్కీంకు శ్రీకారం చుట్టారు.

గతంలో కూడా..

గత టీడీపీ ప్రభుత్వంలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం షెడ్డుల నిర్మాణాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలకు పైగా ఘన వ్యర్థాల షెడ్డులను నిర్మించారు. తెచ్చిన చెత్తను వేరు చేసి వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, వైసీపీ హయాంలో ఈ ప్రక్రియను పక్కన పెట్టేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చాక.. వినూత్న ఆలోచనతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తడి, పొడి చెత్తతో పాటు నిరుపయోగమైన ప్లాస్టిక్ తదితర వేస్టు సేకరణ కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గత వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ)లను రద్దు చేసి రేషన్ షాపుల నుంచి సరుకులు తీసుకునే విధానం ప్రారంభించింది. ఈ క్రమంలో ఆ వాహనాల ఆపరేటర్లకు ఉపాధి కల్పించడంతో పాటు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను సేకరించేందుకు వాటిని వినియోగించాలని నిర్ణయించారు. ఈ వాహనాలకు నెలకు రూ.25 వేల చొప్పున చెల్లించి వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను బయట మార్కెట్‌లో విక్రయించి.. దానికి సరిపడా నిత్యావసర వస్తువులు తెచ్చుకునే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లపై ఉంచారు. ఈ ప్రాజెక్టు వల్ల పంచాయతీలకు, ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉండదు. 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలు స్వచ్ఛరథం కోసం వాడుకోవచ్చు.

గుంటూరులో పైలట్ ప్రాజెక్టు

స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని గుంటూరు రూరల్ మండలంలోని లాలుపురంలో ప్రారంభించారు. మొదట ఏడాది పాటు జడ్పీ సాధారణ నిధులుగాని, 15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంటు గాని దీనికోసం వినియోగించుకోవచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ గుంటూరు జడ్పీ సీఈవోకు అనుమతిచ్చారు. పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేసి మిగిలిన గ్రామాలకు కూడా అంచలంచెలుగా విస్తరించాలని నిర్ణయించారు. ఏడాదిలో రూ.10 లక్షలలోపు నిధులను ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాతో పాటు కృష్ణా జిల్లా రామవరప్పాడు వంటి గ్రామ పంచాయతీల్లో కూడా స్వచ్ఛరథాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీలు, జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొదట జిల్లాకో గ్రామ పంచాయతీని ఎంపిక చేసుకుని స్వచ్ఛరథం ఏర్పాటు చేసి.. తర్వాత అంచలంచెలుగా మండలానికో పంచాయతీలో స్వచ్ఛ రథం ఏర్పాటు చేయనున్నారు.

చెత్త తీసుకుని ఇచ్చేవి ఇవే..

'స్వచ్ఛ రథం' వద్ద పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్, గాజు సీసాలు, స్టీల్, అల్యూమినియం వస్తువులను తీసుకుంటారు. వీటికి విలువ కట్టి.. నిత్యావసరాలైన కొబ్బరినూనె, సర్ఫ్ ప్యాకెట్, బట్టలసబ్బులు, ఒంటి సబ్బులు, టీ, కాఫీ పౌడర్లు, లేస్ ప్యాకెట్లు, పేస్ట్, షాంపూ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, టూత్ బ్రష్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమపిండి, వేరుశనగ గుళ్లు, మినపగుళ్లు, కందిపప్పు తదితర నిత్యావసరాలు ఇస్తున్నారు. కేజీ ప్లాస్టిక్‌కి రూ.20 చొప్పున లెక్క కట్టి సరుకులు ఇస్తున్నారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని స్వచ్ఛరథం ఆపరేటర్లు తెలిపారు. కాగా, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇటీవలే వెంగళాయపాలెం గ్రామానికి వచ్చి పైలట్ ప్రాజెక్టు అమలు తీరును పరిశీలించారు.

చేజారిన ఎంటెక్ చాన్స్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తుంటే.. నియంత్రించాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు మౌనం వహిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నష్టపోతున్నారు. ఇటీవల వందల మంది విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏ అడ్మిషన్లు కోల్పోగా.. ఇప్పుడు బీటెక్ పూర్తిచేసి ఎంటెక్‌లో చేరాలనుకున్న వేల మంది విద్యార్థులు సీట్లు కోల్పోయారు. ఎంటెక్‌లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఆదివారం పూర్తయ్యింది. యూనివర్సిటీలు సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా దాదాపు 600 మంది నష్టపోగా.. ప్రైవేటు కాలేజీల్లోనూ సర్టిఫికెట్ల నిలిపివేతతో ఈ సంఖ్య మొత్తంగా వేలల్లోనే ఉంటుంది. దీంతో బీటెక్ సర్టిఫికెట్లు చేతికి రాని విద్యార్థులు ఎంటెక్‌లో చేరేందుకు మరో ఏడాది ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆ ఆదేశాలు మాకు వర్తించవు

"ఈ విద్యా సంవత్సరం నుంచి నేరుగా కాలేజీలకే ఫీజులు విడుదల అవుతాయి. ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేయకూడదు. పరీక్షలు, తరగతులకు హాజరుకాకుండా ఆపడం, హాల్‌టికెట్లు నిలిపివేయడం లాంటి చర్యలు చట్టవిరుద్ధం. అలాంటి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని గత మార్చిలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఫీజులు చెల్లించిన తర్వాతే సర్టిఫికెట్లు ఇస్తామంటూ వర్సిటీల అధికారులు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వ పరిధిలోని వర్సిటీల్లోనే విద్యార్థులను ఈ స్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నా ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదు. సర్టిఫికెట్లు ఆపేసిన విషయం వారి దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆరు క్వార్టర్ల ఫీజులను ప్రభుత్వం విడుదల చేయాలి. అవి రాకపోయినా మాకు ఫీజులు కట్టాలని వర్సిటీల అధికారులు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. కట్టని వారికి సర్టిఫికెట్లు నిలిపివేశారు.

ఒక్కరిపైనా చర్యలు లేవు!

విద్యార్థులకు సర్టిఫికెట్లు నిలిపివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తరచూ చెప్పే ఉన్నత విద్యాశాఖ.. ఏడాదిగా ఒక్క యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ఫీజులు విడుదల చేస్తామని చెబుతున్నా వినిపించుకోకుండా.. కాలేజీలు బలవంతంగా ఫీజులు కట్టించుకుంటున్నాయి. ప్రభుత్వం తరఫున విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్న అధికార పార్టీ ఎమ్మెల్సీలకు చెందిన కాలేజీలూ దీనికి అతీతం కాదు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు కాలేజీలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తుంటే.. ఒక్కరిపైనా చర్యలు తీసుకోకపోగా, కనీసం ఫిర్యాదులను పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పైగా యూనివర్సిటీల కాలేజీలే సర్టిఫికెట్లు ఆపేస్తుంటే తామెందుకు ఫీజులు కట్టకుండా సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

లాటరీతోనే బార్లకు లైసెన్స్‌లు!

▸ మద్యం దుకాణాల తరహాలోనే!!

▸ ఫీజుల వసూలుకు రెండు ప్రతిపాదనలపై కసరత్తు

▸ ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం.. 15లోగా కొత్త విధానంపై నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త బార్ పాలసీపై ఎక్సైజ్ శాఖ కసరత్తు తుది దశకు చేరింది. మద్యం షాపుల తరహాలోనే బార్లకు కూడా లాటరీ విధానంలోనే లైసెన్స్‌లు ఇవ్వాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. జగన్ హయాంలో వేలం విధానంలో బార్లకు లైసెన్స్‌లు కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత బార్లకు యథావిధిగా లైసెన్స్‌లు పొడిగించి.. కొత్త వాటికి మాత్రం లాటరీ నిర్వహించాలని వ్యాపారులు కోరినా.. మొత్తం బార్లకు కొత్తగానే లైసెన్స్‌లు జారీచేయాలని ఎక్సైజ్ శాఖ నిశ్చయించింది. లైసెన్స్ ఫీజుల విషయంలో రెండు రకాల ప్రతిపాదనలు చేశారు. నగర పంచాయతీ బార్లకు రూ.35 లక్షలు, మున్సిపాలిటీల్లోని బార్లకు రూ.40 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లలోని బార్లకు రూ.45 లక్షలు లైసెన్స్ ఫీజులుగా పెట్టాలన్నది మొదటి ప్రతిపాదన. రెండో ప్రతిపాదనలో నగర పంచాయతీల్లోని బార్లకు రూ.55లక్షలు, మున్సిపాలిటీల్లోని బార్లకు రూ.65లక్షలు, కార్పొరేషన్లలోని బార్లకు రూ.75 లక్షలుగా పేర్కొన్నారు. అయితే మొదటి ప్రతిపాదన వల్ల ప్రభుత్వానికి రాబడి తగ్గుతుంది. దానిని భర్తీ చేసేందుకు బార్ల సంఖ్య పెంచాలని భావిస్తున్నారు. అంటే ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉండగా ఆ సంఖ్యను వెయ్యికి పైగా పెంచాలనే ఆలోచన ఉంది. ఒకవేళ రెండో ప్రతిపాదన ప్రకారం ఫీజులు ఎక్కువగా ఉంటే బార్ల సంఖ్య యథావిధిగా కొనసాగుతుంది. అయితే ఫీజులు తగ్గించి, బార్ల సంఖ్య పెంచడానికే ఎక్కువ అవకాశం ఉందని అంటున్నారు. అలాగే బార్లకు ఇచ్చే ధరను కూడా మద్యం దుకాణాలతో సమానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం షాపులు, బార్లు ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోలు చేస్తాయి. అయితే షాపులతో పోలిస్తే బార్లు 10 శాతం అదనంగా ధర చెల్లిస్తాయి. దానిని తగ్గించడం వల్ల ఏడాదికి దాదాపు రూ.300 కోట్లు నష్టపోవలసి వస్తుందని అంచనా. దానిని లైసెన్స్ ఫీజుల రూపంలో అదనంగా రాబట్టుకోవాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. అలాగే దరఖాస్తు రుసుమును రూ.5 లక్షలుగా నిర్ణయించింది. మొత్తం పాలసీపై ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుని ఈ నెల 15లోగా కొత్త పాలసీకి నోటిఫికేషన్ జారీచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత బార్ పాలసీ గడువు నెలాఖరుతో ముగియనుంది.

కాళేశ్వరంపై సిట్!

▸ అవకతవకలపై విచారణకు ప్రత్యేక బృందం.. అసెంబ్లీలో చర్చ

▸ నేటి మంత్రివర్గ భేటీలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం

▸ సచివాలయంలో భేటీ అయిన అధికారుల కమిటీ


హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిధుల అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించనుందని సమాచారం. ఇదే అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణకు వరంగా గత సర్కారు అభివర్ణించిన కాళేశ్వరం.. ప్రజాధనం వృథా చేసిన ప్రాజెక్టుగా మారిందంటూ విచారణ కమిషన్ చెప్పిన వివరాలను ప్రజలకు వివరించేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై.. సోమవారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, కీలక నిర్ణయం తీసుకోనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కాళేశ్వరం అవకతవకలపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపైనే క్యాబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే.. ఈ ప్రాజెక్టు అవకతవకల వెనుక ఉన్న రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అధికారులపై ఏ విధమైన చర్యలకు ఉపక్రమించాలనే విషయాలపైనా చర్చించనున్నారు. దాంతోపాటు.. శాసనసభ సమావేశాలు నిర్వహించి, సభ్యులందరికీ విచారణ కమిషన్ నివేదికను అందించి.. దానిపై చర్చ జరపాలనే యోచనలోనూ సర్కారు ఉన్నట్టు సమాచారం. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అసలేం జరిగిందనేది ప్రజలకు తేటతెల్లంగా తెలిసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. కాగా కాళేశ్వరంపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికపై అధ్యయనానికి.. సాధారణ పరిపాలన, న్యాయ, సాగునీటి పారుదల శాఖల ముఖ్యకార్యదర్శులతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఆదివారం సాయంత్రం సచివాలయంలో భేటీ అయి చర్చించింది. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ఒక్క అంశంపైనే రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఇలా ఒకే అంశం ఎజెండాగా క్యాబినెట్ భేటీ కావడం ఇదే మొదటిసారి. అలాగే ఇదే అంశంపై శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయిస్తే.. అలా ఒకే అంశంపై అసెంబ్లీ నిర్వహించడం కూడా తొలిసారి అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జగన్‌కు భయం పట్టుకుంది

▸ ఫ్రస్టేషన్‌తోనే చంద్రబాబుపై దూషణలు: కొలుసు

అమరావతి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని చూసి, ఫ్రస్టేషన్‌తో జగన్మోహన్‌రెడ్డి ఉచ్ఛనీచాలు మరిచి, మాట్లాడుతున్నారని మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. సీఎం చంద్రబాబుపై ఆయన వ్యాఖ్యలు చూస్తుంటే జగన్‌లో భయం బయట పడుతోందని వ్యాఖ్యానించారు. 'ఎన్నికల్లో గెలిచినా, ఓడినా నాయకులు హుందాగా ఉండాలి. వ్యక్తిగత దూషణలకు పాల్పడకూడదు. కానీ జగన్ ఇందుకు పూర్తి విరుద్ధం. రౌడీలు, గంజాయి స్మగ్లర్లు, బెట్టింగ్ రాయుళ్ల ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తారా? జగన్‌లో హుందాతనం లేకుండా పోయింది. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి నైతిక విలువలతో రాజకీయాలు చేయాలి. కింది స్థాయి నాయకులకు ఆదర్శంగా ఉండాలి. కానీ జగన్ అనైతికంగా, అప్రజాస్వామికంగా, విధ్వంసకర ఘటనలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి దగ్గర మంత్రులు సరిగ్గా మాట్లాడకపోతే మందలించేవారు. భాష మార్చుకోవాలని చెప్పేవాళ్లు. కక్షపూర్తి రాజకీయాలు వద్దని చంద్రబాబు కూడా చెప్తుంటారు. ప్రజలతో మంచి సంబంధాలు నెరుపుతూ, రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలని చెప్తుంటారు. కానీ జగన్ ఎంత దిగజారి మాట్లాడుతున్నారో ప్రజలు గమనించాలి. వైసీపీ నేతల దోపిడీలు, అరాచకాల నుంచి ప్రజల డైవర్ట్ చేయడానికి నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానంతో.. గత ప్రభుత్వంలో మాదిరిగా దొంగచాటుగా పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే పరిస్థితులు లేవు. లిక్కర్‌స్కామ్‌లో ఇప్పుడు బయటపడుతున్న నగదు చూస్తుంటే దోపిడీ ఏస్థాయిలో జరిగిందో అర్థంచేసుకోవచ్చు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు' అని అన్నారు.


బుడమేరుకు పడిన గండి (ఫైల్)



బుడమేరు గండికి 'కాంక్రీట్' పరిష్కారం


కాలువ పొడవునా నిర్మించిన కాంక్రీట్ గోడ

బుడమేరుకు పడ్డ గండి గుర్తుంది కదా. విజయవాడ నగర వాసులకు కాళరాత్రులను పరిచయం చేసింది. వరద పోటెత్తడంతో రెండు వారాలకు పైగా బెజవాడ జనం నీళ్లలోనే ప్రాణాలరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీశారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకూ జనం చెంతనే ఉండి బాధితులకు అండగా నిలిచారు. ఆనాటి కష్టం పునరావృతం కారాదని ప్రతినబూనిన ప్రభుత్వం దానికి శాశ్వత పరిష్కారం చూపించింది. అనుకున్నదే తడవుగా ఏడాది లోపే కాలువ పొడవునా కాంక్రీట్ గోడను నిర్మించింది. బెజవాడ వాసులకు భవిష్యత్తులో బుడమేరు ముప్పు లేకుండా చేసింది.

తాగుడు కూతలు

(మొదటి పేజీ తరువాయి)

కవరింగ్ మొదలుపెట్టింది. నిందితులను సమర్థించే ప్రయత్నంలో నిజాలకు పాతరేసి, అబద్ధాలు రాస్తూ, వాస్తవాలను వక్రీకరించింది.

చెవిరెడ్డితో అనుబంధం

నంద్యాలలో పుట్టి, హైదరాబాద్‌లో పెరుగుతూ చదువుకున్న వెంకటేశ్ నాయుడుకు వైసీపీ నేత చెవిరెడ్డితో విడదీయరాని అనుబంధం ఉంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా వైసీపీ తరఫున చెవిరెడ్డి పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సహకరించడం కోసమేమో కానీ.. ఒంగోలు లోక్‌స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి వెంకటేశ్ నామినేషన్ వేశాడు. అతడి నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఈసీకి సమర్పించిన అఫిడవిట్‌లో అతని ఏడాది సంపాదన రూ.4.95 లక్షలుగా పేర్కొన్నాడు. అయితే జగన్ పత్రిక ఈ విషయం దాచిపెట్టింది. అతడో పెద్ద రియల్టర్ అంటూ రాసింది. వ్యాపార లావాదేవీల్లో భాగమైన నగదు (35 కోట్లు)ను మద్యం కేసుకు సిట్ ముడి పెడుతోందని రాసుకొచ్చింది. ఏడాది సంపాదన రూ.4.95 లక్షలు ఉన్న వ్యక్తికి రూ.35 కోట్ల నగదు ఎలా వచ్చిందో మాత్రం రాయలేదు. జగన్ పత్రిక చెప్పినట్టు ఈ డబ్బు అతడిదే అయితే ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చి మోసం చేశాడా?

'2000 నోటు' కథ ఇదీ

సిట్ వెలికితీసిన రూ.5 కోట్ల నగదుతో వెంకటేశ్ ఉన్న వీడియోలో నోట్ల కట్టల గుట్టలు ఉన్నాయి. పైభాగంలో రూ.2,000 నోట్ల కట్ట ఉంది. ఆ మొత్తాన్ని అతను రూ.5 లక్షలని చెప్పాడు. మొత్తం రూ.5 కోట్లలో రూ.5 లక్షల నగదు మాత్రమే 2 వేల నోట్లు. మిగతావి రూ.500, రూ.100 నోట్లు ఉన్నట్టు కనిపిస్తోంది. కానీ జగన్ పత్రిక మాత్రం ఆ నోట్ల గుట్టలన్నీ 2 వేల నోట్లనే అర్థం వచ్చేలా రాసింది. ఎన్నికలకు ఏడాది ముందు నుంచే రూ.2,000 నోటు చలామణిలోనే లేదంటూ అడ్డగోలు వాదన అందుకుంది. చలామణి లేని నోట్లను ఎన్నికల సమయంలో ఎలా పంపిణీ చేస్తారంటూ మభ్య పెట్టేందుకు యత్నించింది. కానీ అదే జగన్ పత్రికలో ఇంకా రూ.6017 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు తిరిగి రాలేదని ఆర్‌బీఐ ప్రకటించిందని శనివారం వార్త ప్రచురించింది. 2023 మే 19 నాటికి మార్కెట్లో చలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 98.31 శాతం వెనక్కి వచ్చాయని తెలిపింది. ఎవరి దగ్గరైనా 2000 నోట్లు ఉంటే మార్చుకోవచ్చని తెలిపింది. ఇక ఆర్‌బీఐ ప్రకటించిన రూ.6,017 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లలో కొన్ని మాత్రమే మద్యం ముడుపుల వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు అన్ని వీడియోలు బయటకు రాలేదు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ల నుంచి రిట్రీవ్ అయిన ఒకట్రెండు వీడియోల్లోనే నోట్ల కట్టలు కనిపిస్తున్నాయి. మరి మద్యం ముడుపులు దాచిన మిగతా డెన్‌లలో ఏ స్థాయిలో 2000 నోట్లు ఉన్నాయో?

సిట్‌పై నిందలు

వెంకటేశ్ అరెస్టు అప్పుడు, రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించని నోట్ల కట్టల వీడియో హఠాత్తుగా ఇప్పుడు బయటకు రావడం అనుమానాస్పదంగా ఉందంటూ జగన్ పత్రిక రాసుకొచ్చింది. ఏ స్కాములోనైనా నిందితుడి అరెస్టు, రిమాండ్, విచారణ తర్వాతే అసలు విషయాలు బయటకొస్తాయి. రిమాండ్ రిపోర్టులో ఆ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల గురించి కూడా రాస్తారు. అందులో మొబైల్ ఫోన్ కూడా ఉంటుంది. నిందితులు ఫోన్లలో డిలీట్ చేసిన డేటాను దర్యాప్తు అధికారులు రికవరీ చేయాల్సి ఉంటుంది. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు మొబైల్‌ను పంపి నిపుణులతో రిట్రీవ్ చేయించాలి. దానికి సమయం పడుతుంది. వెంకటేశ్ విషయంలో జరిగింది ఇదే. దీనిపై రోతపత్రిక వక్రీకరణ చేసింది. అరెస్టు, రిమాండ్ రిపోర్టులో రాసినవే ఫైనల్ అనే అర్థం వచ్చేలా ఒక దుష్ప్రచారాన్ని జనాల్లోకి తీసుకెళ్తోంది. హైదరాబాద్ శివారులో ఫామ్‌హౌస్‌లో దొరికిన రూ.11 కోట్ల విషయం కోర్టు పరిధిలో ఉంది. వాదనలు జరుగుతున్నాయి. తప్పుచేసిన వారు చేశానని ఒప్పుకోరు. రాజకీయ కక్షసాధింపులంటూ కోర్టుకెక్కి కొంత హడావుడి చేస్తారు. రాజ్ కసిరెడ్డి అదే చేస్తున్నాడు. మొదట రూ.11 కోట్ల నగదు, తర్వాత రూ.5 కోట్ల నోట్ల కట్టలున్న వీడియోలు బయటపడడం లిక్కర్ మాఫియాకు ఊపిరాడడం లేదు. అవన్నీ అబద్ధాలంటూ, కోర్టు వ్యాఖ్యానాలు వారికి అనుకూలంగా ఉన్నాయంటూ జగన్ పత్రికలో అడ్డగోలుగా రాస్తున్నారు. ఆ వీడియో సిట్, గిట్టని మీడియా సృష్టి అంటూ నిస్సిగ్గుగా ప్రచారం చేస్తోంది.


ఒంగోలు ఎంపీ స్థానానికి వెంకటేశ్ నాయుడు వేసిన నామినేషన్ తిరస్కరించినట్లు చూపిస్తున్న ఈసీ వెబ్‌సైట్

స్విచాఫ్..

నెట్‌వర్క్ బిజీ..!

"హలో.. హలో" అంటుండగానే కట్

- తీవ్రంగా వేధిస్తున్న సెల్ సిగ్నల్స్ సమస్య
- మాట్లాడుతుండగా కాల్ డ్రాప్.. జంప్
- మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టని కంపెనీలు
- సెల్ ఆపరేటర్లకు జరిమానాలు విధించే చాన్స్
- అయినా.. పట్టించుకోని టెలికాం నియంత్రణ సంస్థ

స్నేహితుల దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లో ఉండే బంటీ కూకట్‌పల్లిలోని తన మిత్రుడు చంటీకి శుభాకాంక్షలు చెప్పేందుకు ఫోన్ చేశారు. ఎంతకీ ఫోన్ కలవలేదు. నెట్‌వర్క్ రెస్పాన్స్ లేదు. నెట్‌వర్క్ బిజీనా? కాల్ వెయిటింగా? అనే సమాచారం లేకుండానే.. కాసేపటి తర్వాత కాల్ కట్ అయిపోయింది. చాలా సార్లు ప్రయత్నిస్తేగానీ, చంటీకి ఫోన్ కలవలేదు..!

ఓ పెళ్లికి హాజరైన ఓ పెద్దాయన.. అక్కడ తీసిన ఓ వీడియోను కుటుంబ వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. 5జీ మొబైల్ ఫోన్ అయినా.. అపరేటర్ డాటా ప్యాకేజీలో ఉన్నా.. ఆ వీడియో అప్‌లోడ్ అవ్వడానికి చాలా సమయం పట్టింది..!

ఇవీ మొబైల్ ఫోన్ యూజర్లు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ కష్టాలకు చిన్నచిన్న ఉదాహరణలు మాత్రమే..! గతంలో వేర్వేరు ఆపరేటర్ల మధ్య కాల్ సమస్యలుండేవి.. ఇప్పుడు ఒకే ఆపరేటర్ పరిధిలోనూ ఆ ఇబ్బందులు తప్పడం లేదని సెల్ యూజర్లు వాపోతున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టెలికాం రంగంలో గడిచిన మూడు దశాబ్దాలలో విప్లవాత్మక మార్పులు చూశాం..! పేజర్ల యుగంలోంచి సెల్‌ఫోన్ శకానికి చేరుకున్నాం. 2జీ.. 3జీ.. 4జీని అధిగమించి ఇప్పుడు ఐదోతరం 5జీ మొబైల్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నాం..! 6జీ వైపు వడివడిగా ముందుకు సాగుతున్నాం. అయితే.. సెల్ ఆపరేటర్లకు మాత్రం ఆదాయంపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతులపై చూపకపోవడంతో సగటు వినియోగదారుడు నెట్‌వర్క్ సమస్యలతో సతమతమవుతున్నాడు. 5జీ సేవలను కూడా పూర్తిస్థాయిలో అందించేందుకు అవసరమయ్యే సెల్‌టవర్లు, చానళ్లను ఏర్పాటు చేసుకోని సెల్ ఆపరేటర్లు.. కనీసం 4జీ స్థాయి సేవలను కూడా అందించలేకపోతున్నారు. హైదరాబాద్ లాంటి నగరాల్లోనూ.. నగరం నడిబొడ్డున కూడా సిగ్నల్స్ అందకపోవడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోంది. హైటెక్‌సిటీతోపాటు.. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, కొండాపూర్‌లోనే ఈ పరిస్థితి ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ఇవీ ప్రధాన సమస్యలు

సిగ్నల్ అందకపోవడంతో పాటు.. నెట్‌వర్క్ సమస్యలు అనేకం సెల్ వినియోగదారులను పట్టిపీడిస్తున్నాయి. ఫోన్ మాట్లాడుతుండగా.. మధ్యలోనే కాల్ కట్ అవుతుంది. లేదంటే.. కాల్ జంప్ అవుతుంది. మళ్లీ ప్రయత్నిస్తే.. క్రాస్ కాలింగ్(ఇంకెవరికో కాల్ వెళ్లడం) జరుగుతోంది. లేదంటే.. ఉన్నఫళంగా కాల్ కట్‌అయ్యి.. ఇంకెవరో మాట్లాడే మాటలు వినిపిస్తుంటాయి. కాల్ డ్రాపింగ్ సమస్య తెలుగు రాష్ట్రాల్లో తీవ్రంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉండేవారికి కాల్ చేస్తే.. ఎంతకీ కలవకపోవడం మరో రకమైన సమస్య..! బహుళ అంతస్తులు, ఆకాశ హర్మ్యాల్లో ఉండేవారికి నెట్‌వర్క్ సమస్యలు మరీ తీవ్రంగా ఉంటున్నాయి.

జరిమానాలు వేయొచ్చు..

కాల్‌డ్రాప్స్ సమస్యలపై నెట్‌వర్క్ కంపెనీలకు జరిమానాలను విధించే అధికారం ప్రభుత్వాలకు ఉంటుంది. అయితే.. ఆ దిశలో చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. వినియోగదారులు కూడా కాల్ సమస్యలున్నప్పుడు సర్దుకుపోతున్నారే తప్ప.. సెల్ సంస్థలకు ఫిర్యాదు చేయడం లేదు. సెల్ సంస్థలు పట్టించుకోకుంటే.. ట్రాయ్‌కి ఫిర్యాదు చేయవచ్చు. అక్కడా సమస్యకు పరిష్కారం దొరకలేదనుకుంటే.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీవోటీ)కి ఫిర్యాదు చేస్తే.. సెల్ సంస్థలు వినియోగదారుల ఇళ్లకు పరుగులు పెట్టి, సమస్యను పరిష్కరిస్తాయి. లేదంటే.. ఆయా సంస్థలకు జరిమానాలు తప్పదు.



కారణాలనేకం..!

ఏడాది కాలంగా సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సమస్యలు తీవ్రమవ్వడానికి అనేక కారణాలున్నాయని టెలికాం రంగ నిపుణులు చెబుతున్నారు. డాటా, 5జీ సేవలు, కాల్ క్వాలిటీ, ఆఫర్లు, ఈ-సిమ్ సదుపాయం.. ఇలా వేర్వేరు కారణాలతో చాలా మంది సెల్ వినియోగదారులు ఒకటి కంటే ఎక్కువ నెట్‌వర్క్‌ల సిమ్‌కార్డులను వాడుతున్నారు. దాంతో.. రాష్ట్ర జనాభా కంటే.. సెల్ వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. అధికారికంగా రాష్ట్రంలో 4.15 కోట్ల మంది సెల్ వినియోగదారులు ఉండగా.. ఇతర రాష్ట్రాల్లో సిమ్‌కార్డును తీసుకుని, రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉంటున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుందని అంచనా..! దీంతో.. నెట్‌వర్క్‌పై భారం పెరిగి.. సిగ్నల్ సమస్యలు వస్తుంటాయి. ఉదాహరణకు.. సెల్‌టవర్లు పలు రకాలుగా ఉంటాయి. వాటిని సాంకేతికంగా ఫ్రీక్వెన్సీలను బట్టి 2/2/2, 4/4/4, 8/8/8.. అని పిలుస్తుంటారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల మొబైల్ ఆపరేటర్లు మరిన్ని సెల్‌టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఖర్చుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూకు అనుగుణంగా?

వినియోగదారులు పెరుగుతున్నా.. దానికి తగ్గట్టుగా యావరేజ్ రెవెన్యూ పర్ యూజర్(ఏఆర్‌పీయూ) పెరగకపోవడంతోనే సెల్ ఆపరేటర్లు నిర్వహణను గాలికొదిలేసినట్లు తెలుస్తోంది. 2015-16లో ఏఆర్‌పీయూ సగటున రూ.300గా ఉండేది. ప్రస్తుతం రూ.174.46కు చేరినట్లు ట్రాయ్ గణాంకాలు చెబుతున్నాయి. 2015-16కు ముందు కాల్స్‌కు, డాటాకు వేర్వేరు ప్యాకేజీలు ఉండేవి. 2016 తర్వాత పరిస్థితి మారింది. ఇప్పుడు రోజుకు 1.5 నుంచి 2జీబీ చొప్పున డాటా, అపరిమిత కాల్స్, 100 ఎస్సెమ్మెస్.. వీటికి నెలకు రూ.200 లోపే ఖర్చవుతోంది. ఇలా పోటీని తట్టుకునేందుకు టారీఫ్‌లను తగ్గించిన కంపెనీలు.. వినియోగదారులు పెరిగాక.. అందుకు అనుగుణంగా వసతులను కల్పించడం లేదని నిపుణులు చెబుతున్నారు. యూజర్లకు కాల్స్ కనెక్ట్ అవ్వకుంటే.. వైఫైతో వాట్సాప్ కాల్స్ చేసుకుంటారులే.. అనే ధోరణిలో సెల్ ఆపరేటర్లు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.

బోర్డర్ మందు బంద్

(మొదటి పేజీ తరువాయి)

అమ్మకాలు తగ్గాయి అంటే మంచిదే కదా అనుకుంటే పొరపాటుపడినట్లే. మద్యం అమ్మకాలు తగ్గాయి. కానీ, మందుబాబులు తాగుడుకు దూరం కాలేదు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని మద్యం షాపుల నుంచి(అప్పట్లో ఏపీతో పోల్చితే తక్కువ ధర) మందు కొనుక్కుని తాగారు. దానివల్ల రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తెలంగాణకు పోయింది. జే బ్రాండ్లతో ఏపీ ఖజానా నష్టపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ సీన్ రివర్స్ అయింది. సరిహద్దు రాష్ట్రాల మద్యం బంద్ అయింది. దీంతో జగన్ హయాంలో కర్ణాటకలో.. ఏటా సగటున 10 శాతం ఉన్న వృద్ధి... ఇప్పుడు 0.47 శాతానికి పడిపోయింది. ఉదాహరణకు 2023-24లో కర్ణాటకలో 705 లక్షల కేసుల మద్యం అమ్ముడైంది. 2024-25లో ఇది 10 శాతం చొప్పున పెరిగి సుమారు 775 లక్షల కేసుల మద్యం అమ్మాలి. కానీ, 708 లక్షల కేసుల మద్యమే విక్రయించారు. అంటే, ఏపీ ప్రభావంతో కర్ణాటక మద్యం అమ్మకాలు పెరగలేదు. వాస్తవానికి సాధారణంగా అన్ని రాష్ట్రాల్లోనూ మద్యం అమ్మకాల్లో ఏటా సుమారు 10శాతం వృద్ధి ఉంటుంది. ఏపీ పాలసీతో కర్ణాటకలో ఆ వృద్ధి రేటు మాయమైపోయింది. 2024 వరకు కర్ణాటక మద్యం విచ్చలవిడిగా ఏపీలోకి ప్రవేశించేది. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు కట్టిన మద్యాన్ని ఇక్కడి వినియోగదారులు తాగేవారు. ఫలితంగా మన ప్రజలు తాగిన మద్యానికి ఆ రాష్ట్రానికి ఆదాయం వెళ్లింది. ఇప్పుడు దానికి రివర్స్‌లో ఏపీ మద్యం కర్ణాటకలోకి ప్రవేశిస్తోంది. ఏపీలో క్వార్టర్ రూ.99కే జాతీయ స్థాయి కంపెనీల నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవడంతో అక్కడి వారు కూడా ఏపీ సరిహద్దు జిల్లాలకు వచ్చి వీటిని కొనుగోలు చేస్తున్నారు. దీనిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఒక్క ఫిబ్రవరి నెలలోనే రూ.10 కోట్ల మేర అమ్మకాలు తగ్గిపోయాయి. ఏపీలో మద్యం ధరలు తగ్గిపోవడం, నాణ్యమైన మద్యం అందుబాటులోకి రావడంతో తెలంగాణలో మద్యం కొనేందుకు ఏపీకి చెందిన వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఏపీ మద్యం పాలసీ కారణంగా తమకు 30శాతం అమ్మకాలు పడిపోయాయని నల్గొండకు చెందిన ఓ మద్యం షాపు యజమాని తెలిపారు.

18 వేల కోట్లు పక్కరాష్ట్రాలకు!

పాపులర్ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసి 'జే' బ్రాండ్లు తెచ్చిన గత ప్రభుత్వం.. రాష్ట్ర ఆర్థిక వనరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక దశలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గిపోతే అది జగన్ గొప్పతనం అనీ, తాగేవారు తగ్గిపోయారని అప్పటి ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. కానీ తీరా చూస్తే రాష్ట్రంలో తాగేవారి సంఖ్య ఎక్కడా తగ్గలేదు. వారు ఇక్కడి ధరలు, నాసిరకం మద్యం భరించలేక.. పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేవారు. దీంతో మన రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పక్క రాష్ట్రాలకు తరలిపోయింది. ఫలితంగా జగన్ ఐదేళ్ల పాలనలో మద్యంపై ఏకంగా రూ.18 వేల కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. దీనివల్ల పక్క రాష్ట్రాలు భారీగా లాభపడ్డాయి.

అప్పట్లో.. సరిహద్దులు హాట్ కేక్‌లు!

జగన్ హయాంలో.. అప్పటి తెలంగాణ ప్రభుత్వం మద్యం పాలసీ ప్రకటించినప్పుడు ఏపీ సరిహద్దులోని షాపులను వ్యాపారులు హాట్ కేకుల్లా భావించి.. భారీగా మొత్తాలకు దక్కించుకున్నారు. బోర్డర్‌లో తెలంగాణ మద్యం షాపుల్లో అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. ఒక దశలో దీనిపై తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నతస్థాయి చర్చ కూడా జరిగింది. ఏపీ సరిహద్దు షాపుల్లో మద్యం అమ్మకాలపై నియంత్రణ లేకుండా పోతోందని అప్పటి అధికారులు ప్రభుత్వానికి తెలపగా.. "ఆదాయం వస్తున్నప్పుడు ఎవరు తాగితే ఏంటి?" అని అప్పటి ప్రభుత్వ పెద్దలు వ్యాఖ్యానించారు. 2020-21 ఆర్థిక సంవత్సరం తర్వాత ఏపీలో మద్యం ధరలు కొంత మేరకు తగ్గించడంతో అమ్మకాలు క్రమంగా పెరిగాయి. అయినా సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం అమ్మకాలు పెరగలేదు. కాగా, రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే భారీగా అదనపు ఆదాయం వచ్చింది. లిక్కర్‌లో 23.71శాతం, బీరులో 128.7శాతం అమ్మకాలు పెరిగాయి. విలువ పరంగా చూస్తే 11.33 శాతం పెరిగింది. 2024-25 మొదటి త్రైమాసికంలో మద్యంపై రూ.6,050 కోట్ల ఆదాయం వస్తే, ఈ ఏడాది తొలి 3 మాసాల్లో రూ.6,899 కోట్లకు పెరిగింది. అంటే ఒక్క త్రైమాసికంలోనే రూ.849 కోట్లు అదనపు ఆదాయం సమకూరింది.

నాడు విచ్చలవిడిగా ఎన్‌డీపీఎల్

ఏ రాష్ట్రంలో మద్యం అమ్మితే ఆ రాష్ట్ర ప్రభుత్వానికే పన్నులు చెందాలి. ఉదాహరణకు ఒక కంపెనీ ఏపీకి మద్యం సరఫరా చేస్తే దానిపై 'సేల్ ఓన్లీ ఇన్ ఆంధ్రప్రదేశ్' అని ముద్రిస్తుంది. ఆ మద్యం ఇతర రాష్ట్రాలకు ఎన్‌డీపీఎల్ అవుతుంది. అయితే, గత ప్రభుత్వంలో 'జే' బ్రాండ్ల కారణంగా అనేక మంది ఎన్‌డీపీఎల్ వ్యాపారం చేశారు. ముఖ్యంగా సరిహద్దులకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లో పక్క రాష్ట్రాల మద్యం ఏరులై పారింది. రోజూ వేలకు పైగా కేసులు పక్క రాష్ట్రాల నుంచి ఏపీలోకి ప్రవేశిస్తుంటే అధికారులు మౌనంగా చూస్తూ ఉండిపోయారు. దానికి కారణం అప్పట్లో ఈ అమ్మకాల వెనుక వైసీపీ నాయకులే ఉన్నారు. మాచర్ల ప్రాంతంలో ఓ కీలక నేత సహకారంతోనే ఏపీలో ఎన్‌డీపీఎల్ అక్రమ అమ్మకాలు కొనసాగాయి. అలాగే, ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ నేతలే ఎన్‌డీపీఎల్ వెనుక ఉన్నారు.

ప్రభుత్వం మారాక.. మార్పు ఇదీ!

- జగన్ హయాంలో చివరి ఏడాది అయిన 2023 నవంబరు నుంచి 2024 జూన్ వరకు రూ.44.17 కోట్ల మద్యం అమ్ముడైంది. అందులో 51,644 కేసుల లిక్కర్, 9,916 కేసుల బీర్ ఉంది.
- కూటమి వచ్చిన తర్వాత, 2024 నవంబరు నుంచి 2025 జూన్ వరకు రూ.69.58 కోట్ల మద్యం అమ్మారు. 92,964 కేసుల లిక్కర్, 45,538 కేసుల బీర్ విక్రయించారు. లిక్కర్‌లో 80 శాతం, బీర్‌లో 359% అమ్మకాలు పెరిగాయి. విలువ పరంగా 58 శాతం పెరిగింది.
- అనంతపురం జిల్లా రాయదుర్గంలో వైసీపీ ప్రభుత్వంలో నెలకు 4482 కేసులు అమ్మేవారు. దాని విలువ రూ.2.67 కోట్లు. కొత్త మద్యం పాలసీతో నెలకు 8,100 కేసులు అమ్ముతున్నారు. విలువ రూ.4.53 కోట్లు.
- చిత్తూరు జిల్లాలో 40 నుంచి 50శాతం మద్యం అమ్మకాలు పెరిగాయి. కర్ణాటక నుంచి జిల్లాకు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) పూర్తిగా ఆగిపోయింది.
- శ్రీసత్యసాయి జిల్లా, పరిగిలో ఒక్కో షాపులో రోజుకు రూ.30 నుంచి రూ.40 వేల మేరకు వ్యాపారం జరిగేది. ఇప్పుడు అది రూ.2 లక్షలు దాటింది.
- చిలమత్తూరులో గతంలో రూ.30 వేల వ్యాపారం జరిగితే ఇప్పుడు రూ.2.75 లక్షల వ్యాపారం జరుగుతోంది.
- తెలంగాణకు సమీపంలోని నూజివీడు, జంగారెడ్డి గూడెంలో నెలకు రూ.10 కోట్ల మేర అమ్మకాలు పెరిగాయి.

నన్ను కిడ్నాప్ చేయబోయారు

- వెంబడించి.. ఆటోలో ఎక్కించే యత్నం: కేఏ పాల్
- భద్రత కల్పించాలని అమిత్ షాకు లేఖ



న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తనకు భద్రత కల్పించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అమిత్ షాకు ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పోరాడుతున్న నేపథ్యంలో తనను కిడ్నాప్ చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని పార్క్ హోటల్ ఎదుట అనుమానాస్పదంగా ఉన్న కొందరు తనను వెంబడించారని, ఆటోలోకి ఎక్కించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. తనకు ప్రత్యేక భద్రత కల్పించాలని కోరారు.

ఆరుగురిని మింగేసిన గ్రానైట్ క్వారీ

- బండరాయి పడి వలస కూలీల దుర్మరణం..
- బాపట్ల జిల్లాలో ఘోరం

బాపట్ల, బల్లికురవ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వారంతా ఒడిశా నుంచి వచ్చిన వలస కూలీలు.. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు. ఎక్కడ పని దొరికితే అక్కడికి వలస వెళ్లడం.. వచ్చిన డబ్బుతో కడుపు నింపుకోవడం.. ఇదే వారి జీవితం. ఈ క్రమంలో రాష్ట్రం కాని రాష్ట్రానికి వలస వచ్చిన ఆ పేద బతుకుల్ని గ్రానైట్ రాయి మింగేసింది. ఒకరిద్దరు కాదు ఏకంగా ఆరుగురు ఒకే బండ కింద నలిగి పోయారు. ఇంతకాలం కలిసి మెలిసి పని చేసిన ఇద్దరు స్నేహితులనూ మృత్యువు కబళించింది. స్నేహితుల దినోత్సవం నాడే ఈ దారుణం జరిగింది. ఆ కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని సత్యకృష్ణ గ్రానైట్స్‌లో ఆదివారం ఉదయం ఈ ఘోరం చోటుచేసుకుంది.

అసలేం జరిగింది?!

శనివారం రాత్రి కురిసిన వర్షానికి క్వారీలో ఉన్న గ్రానైట్ రాళ్ల మధ్య సీఫేజ్ ఏర్పడిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వర్షం నీటికి మధ్యలో ఉన్న మట్టి కొంచెంకొంచెంగా కరిగి తొలగిపోయింది. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కార్మికులు పనికి వెళ్లారు. దాదాపు పదిన్నర సమయంలో క్వారీ అంచు ఒక్కసారిగా విరిగిపడడంతో అక్కడికక్కడే నలుగురు కూలీలు మృతి చెందారు. గాయపడిన వారిని నరసరావుపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరో ఇద్దరు ప్రాణాలొదిలారు. మృతులు ఒడిశాకు చెందిన దండా బడత్యా(48), టుకునదలాయ్(37), బనమల చెహ్రా(30), భాస్కర్ బిషోయ్(40), సైంతోష్ గౌడ(36), ముస్సాజన(43)గా గుర్తించారు. మరో 8 మందికి చికిత్స పొందుతుండగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని ఎస్పీ తుషార్‌డూడి పరిశీలించారు. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలను కలెక్టర్ వెంకటమురళి పరామర్శించారు.




కార్మికులు పనిచేస్తున్న చోట ఊడిపడిన బండరాయి, ఘటనా స్థలంలో మృతదేహాలు

విచారణకు సీఎం ఆదేశాలు

వలస కూలీల మృతి విషయం తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంకటమురళికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడడంతో పాటు ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరపాలని ఆదేశించారు. క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలవడం కలచివేసిందని మంత్రి లోకేశ్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, భరోసా ఇచ్చారు. మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌లు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించడంతో పాటు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రమాదానికి కారణాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.